ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 10.05.2026 | సంపుటి : 12 | సంచిక : 290 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## నేడు హైదరాబాద్‌కు మోదీ రాక

**ప్రధాని సభకు హాజరుకావాలని సీఎం రేవంత్‌కు కేంద్రం ఆహ్వానం**

- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు
- 2వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులపై నిషేధం
- మల్కాజిగిరి డీసీపీ సుమతి వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభకు నగర యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సభకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై మల్కాజిగిరి డిసిపి సుమతి కీలక వివరాలను వెల్లడించారు. సభను ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 2,000 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా సభా ప్రాంగణంలోకి డ్రోన్లు, కెమెరాలు, బ్యాగులను తీసుకురావడంపై నిషేధం విధించారు. బహిరంగ సభ దృష్ట్యా.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి

మిగతా 2లో..

## విద్యా వారోత్సవాలు 11 నుంచి..

ఏర్పాట్లపై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

2లో..

## ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

**రాష్ట్రాభివృద్ధికి క్యూర్.. ప్యూర్.. రేర్.. ప్రణాళికలు**



- పట్టణ జనాభాకు అనుగుణంగా వసతుల కల్పన
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ
- నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని కమిటీకి విజ్ఞప్తి
- మూసీ పునరుజ్జీవం చేపట్టడంపై ముఖ్యమంత్రిని అభినందించిన పార్లమెంటరీ కమిటీ

> రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకొని లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించబోతున్నాం. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలి - సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి

మిగతా 2లో..



సచివాలయంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## ఎట్టకేలకు విజయ్‌కు ఆహ్వానం



**నేడు తమిళనాడు సీఎంగా ప్రమాణస్వీకారం**

| పార్టీల వారీగా సంఖ్యా బలం ఇలా.. | | |
|---|---|---|
| | టీవీకే : 107 | సీపీఎం : 2 |
| | కాంగ్రెస్ : 5 | వీసీకే : 2 |
| | సీపీఐ : 2 | ఐయూఎంఎల్-2 |

**చెన్నై(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన తమిళ నాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడుతోంది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వం లోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేసినట్లు తెలుస్తోంది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు టీవీకే చీఫ్ విజయ్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తోన్న వీసీకే.. క్యాబినెట్ బెర్తులు మాత్రం వద్దని చెప్పింది. "మేం ప్రభు త్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం" అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడిం చారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వం లోని కూటమిలోనే ఉన్నామని



మిగతా 2లో..

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం



- ఆయనతోపాటు ఐదుగురు మంత్రులు కూడా..
- ప్రమాణం చేయించి గవర్నర్ ఆర్ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు

2లో..



ధరల సవరణ నిర్ణయం..

## తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు ఫుల్ డిమాండ్

- విలువలు పెరగకముందే క్రయవిక్రయాలకు ప్రజల క్యూ
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు : మంత్రి పొంగులేటి

**హైదరాబాద్(జనంసాక్షి):** భూముల ధరల సవరణ నిర్ణయంతో తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. స్థిరాస్తుల మార్కెట్ విలువ పెంచేందుకు కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విలువలు పెరగకముందే రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ప్రజలు చొరవ చూపుతున్నారు. ఈ నెల 12 నుంచి 15 వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాలు అదనంగా పని చేయనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు పనివేళలుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 2లో..

## మళ్లీ చర్చలు!

**ఇస్లామాబాద్ వేదికగా అమెరికా- ఇరాన్ మధ్య మరోసారి సంప్రదింపులు**



- పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు
- 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం

**టెహ్రాన్(జనంసాక్షి):** పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా- ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం, దానివద్ద ఉన్న యురేనియం నిల్వల బదిలీ, హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించడం వంటి కీలక విషయాలు ఉన్నాయి. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని టెహ్రాన్ ముందు నుంచీ డిమాండ్ చేస్తూ వస్తోంది. ఈ చర్చలకు ఇవే అడ్డంకిగా మారాయి. కాగా.. చర్చలు సానుకూలం గా సాగితే ఇరుదేశాల మధ్య కొనసాగుతోన్న కాల్పుల విరమణ ఒప్పందం మరికొంతకాలం పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇక, పశ్చిమాసియా సంఘర్షణ ముగించేందుకు తాము పంపిన

మిగతా 2లో..

## హర్మూజ్ వద్ద నావలో మంటలు

భారతీయ నావికుడు దుర్మరణం

2లో..

## రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ

**మూడురోజుల పాటు కొనసాగుతుంది:ట్రంప్**

**వాషింగ్టన్(జనంసాక్షి):** రష్యా-ఉక్రెయిన్ మధ్య మూడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా వెల్లడించారు. మే 9న రష్యా విక్టరీ డే నిర్వహించుకుం టోంది. రెండో ప్రపంచ యుద్ధంలో కీలక పాత్ర పోషించినందుకు

మిగతా 2లో..

## కేంద్రమంత్రి బండి తనయుడు భగీరథ్‌పై పోక్సో కేసు!

- మైనర్ బాలికపై అత్యాచరం జరిపినట్లు ఫిర్యాదు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి
- సీఎం చేతిలో హోంఖాఖ ఉన్నా కనీసం సమీక్షలు లేవు
- చట్టం ఎవరికైనా ఒక్కటిగానే ఉండాలి
- బీఆర్ఎస్ నేతల డిమాండ్



**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ భారతీయ జనతా పార్టీ కీలక నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయినట్లు సమాచారం. ఒక 17 ఏళ్ల బాలికకు బలవంతంగా మద్యం తాగించి, హైదరాబాద్‌లోని మొయినాబాద్ ఫామ్‌హౌస్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వేధింపుల కారణంగా బాధితురాలు రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. చివరికి గత అర్ధరాత్రి ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే, మొదట్లో బండి భగీరథ్‌పై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనుకాడటంతో

మిగతా 2లో..

## కాళేశ్వరంను తక్కువ చేసేందుకు కుట్రలు

- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీలేదు
- కేసీఆర్ ముందుచూపుతోనే భారీ ప్రాజెక్టు నిర్మాణం
- రైతులంటే ముఖ్యమంత్రికి పట్టింపులేదు
- అకాల వర్షాలతో నష్టపోయినా చర్యలు లేవు
- మాజీమంత్రి హరీశ్ విమర్శలు



**సిద్దిపేటబ్యూరో(జనంసాక్షి):** కటిక చీకట్లోనూ కారు దీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్ రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొ న్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మా ట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజా యితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరే ళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామా లు చేసిందని మండిపడ్డారు.

మిగతా 2లో..

## అమెరికాలో హైదరాబాద్ యువతి మృతి

- స్విమ్మింగ్‌పూల్‌లో పడి మరణించిన ఎల్.బి.నగర్‌కు చెందిన వీణ
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



**వాషింగ్టన్(జనంసాక్షి):** అమెరికాలో స్విమ్మింగ్ పూ ల్‌లో మునిగి ఓ తెలుగు యువతి ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర విషాదం రేపింది. వర్జీనియాలో నివాసముంటున్న వీణ

మిగతా 2లో..

## లేగదూడను కాపాడబోయి..

బావిలో మునిగి తండ్రీకుమారుల మృతి ములుగు జిల్లాలో విషాదం..

2లో..

## తదుపరి సీడీఎస్‌గా ఎన్ఎస్ రాజా సుబ్రమణి నియామకం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ ఎస్ రాజా సుబ్రమణి (రిటైర్డ్)ని ప్రభుత్వం నియమించింది. భారత సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా వ్యవహరిం చను న్నారు. ప్రస్తుతం సీడీఎస్‌గా ఉన్న జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం మే 30తో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం

మిగతా 2లో..





## వీడని సందిగ్ధత

- కేరళ సీఎం పదవిపై కొనసాగుతున్న సస్పెన్స్
- ముఖ్యమంత్రి అభ్యర్థిపై ముగిసిన కీలక సమావేశం


**తిరువనంతపురం(జనంసాక్షి):** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ

మిగతా 2లో..

## ఎట్టకేలకు ఓటమిని అంగీకరించిన మమత

**కోల్‌కతా(జనంసాక్షి):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమతా బెనర్జీ.. ఎట్టకేలకు తన పరాజయాన్ని అంగీకరించారు. రాష్ట్రంలో భాజపా సర్కారు కొలువుదీరిన నేపథ్యంలో.. ఆమె తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన మమత ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ సీఎం పదవికి రాజీనామా

మిగతా 2లో..



## ఎట్టకేలకు విజయ్‌కు ఆహ్వానం

వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు.


## బండి తనయుడు భగీరథ్‌పై పోక్సో కేసు!

పోలీస్ స్టేషన్ వద్ద సుమారు ఆరు గంటల పాటు హైడ్రామా చోటుచేసుకుంది. ఆ తర్వాత బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు అనంతరం బండి సంజయ్ కొడుకు భగీరాథ్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. ఇంతకుముందు కూడా కాలేజీలో ఒక విద్యార్థిపై దాడి చేసి భగీరథ్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. అయితే భగీరథ్‌పై పాత వివాదాల నేపథ్యంలో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గతంలో చేసిన ట్వీట్ ఇప్పుడు మళ్ళీ వైరల్‌గా మారింది. భగీరథ్‌ను ఇరాక్ మాజీ నియంత సద్దాం హుస్సేన్ కుమారుడు ఉదయ్ హుస్సేన్‌తో పోలుస్తూ ఆర్జీవీ అప్పట్లో చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా నిలిచింది.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

**సిఎం చేతిలో హోం ఉన్నా సమీక్షలు లేవు**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనట్లు వార్తలు వచ్చిన విషయంపై మాజీహోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. 17 సంవత్సరాల బాలికకు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ఆల్కహాల్ తాగించి అత్యాచారం చేయించడంతో పేట్‌బషీరాబాద్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలంగాణ పోలీస్ అంటే దేశంలో మొదటి స్థానంలో దక్షిణాది రాష్ట్రాల్లో కూడా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అలాంటి పోలీసులు ఈ రోజు దేశంలోనే వెనకడుగు వేస్తున్న రాష్ట్రంలో తెలంగాన ఉందంటే బాధ అనిపిస్తుంది. ఆందోళన కూడా కనిపిస్తుంది.. ప్రభుత్వాలు మారుతుంటాయి. దాంతోపాటు ప్రాధాన్యాతలు కూడా మారుతాయి. కానీ ప్రాథమిక బాధ్యత అయిన శాంతిభద్రతలు విస్మరిస్తే రాష్ట్రమే అధోగతి పాలవుతుందని అనడానికి ఈ రెండున్నర సంవత్సరాలు ఉదాహరణన్నారు.. మన రాష్ట్రంలో శాంతి భద్రతలు అనగానే రాజకీయ వేధింపులు, ప్రతిపక్షంలో ఉన్నవారిని ట్రాప్ చేయడం తప్పితే ఏం జరగుతుంది రాష్ట్రంలో అనేదానిపై రివ్యూ చేసుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. తెలంగాణ సాధించుకున్నమంటే ఏదో భౌగోళికంగా సాధించుకున్నది కాదు. ప్రశాంతమైన వాతావరణం ఉండాలి.. శాంతి భద్ర ఁతలు కాపాడాల్సిన ప్రభుత్వానికి ఉందని విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా హోంమంత్రి దగ్గరకు పరెగెత్తేవాళ్లు. రాష్ట్రంలో హోంమంత్రి లేరు. ఎందుకంటే ముఖ్యమంత్రే హోం మంత్రి. కానీ ఒక్కోసారి ఆ బాధ్యతను విస్మరించాలరేమో అనిపిస్తుంటుంది. ఎప్పుడు వెళ్లినా ముఖ్యమంత్రి కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో సమీక్ష చేస్తున్నారని ఎప్పుడూ వింటుంటాం. ఏం సమీక్ష చేస్తున్నారని.. అనుకుంటే ఒక హోంశాఖ తప్ప మిగితా అన్ని సమీక్షలు జరుగుతంటాయి. కానీ కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని హోంశాఖను సమీక్షించాలన్న ఆలోచన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి లేదని చెప్పుకోవాల్సి రావడం బాధాకరమైన విషయమన్నారు. కేంద్రమంత్రి కొడుకా.. వేరే వ్యక్తి కొడుకా అని కాదు.. తప్పు చేసినప్పుడు సామాన్యుడికి ఏ చట్టం ఉంటుందో ఆయనకు కూడా అదేచట్టం ఉండాలే. ఎవరైతే కంప్లెయింట్ ఇచ్చారో దాన్ని రిసీవ్ చేసుకోవాలె. కచ్చితంగా పోక్సో కేసు పెట్టాల్సిందే. ఎందుకంటే రిపోర్ట్ తీసుకుంటే ఆ అమ్మాయి 17 ఏండ్లు అని విన్నా. కాబట్టి పెట్టాల్సిందే. కేసు రిజిస్టర్ చేయాల్సిందే. చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.



# ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి గారు సమావేశంలో సవివరంగా ఆవిష్కరించారు.ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారితో పాటు ఇతర సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.పెరుగుతున్న నగరీకరణ వల్ల సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి గారు చెబుతూ, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు."హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌ల వంటి మూడు విధానాల్లో ట్రాఫిక్‌కు సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నాం.ట్రాఫిక్ నియంత్రణ కోసం కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే చేపడితే సరిపోదు. బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు."తెలంగాణ రాష్ట్రాన్ని క్యూర్,ప్యూర్,రేర్ విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రధానంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపలి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా గుర్తించాం. ఓఆర్ఆర్ బయట నుంచి రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పెరి అర్బన్ రీజియన్ ఎకానమి ప్రాంతాన్ని ప్రధానంగా మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించాం. ఆ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ గా వ్యవసాయం, దానిక అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలను సిద్ధం చేశాం" అని చెప్పారు."రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఇప్పటికే ఆవిష్కరించుకున్నాం. లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించబోతున్నాం.నగరంలో కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నాం. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వం స్టాండింగ్ కమిటీకి విజ్ఞప్తి చేసింది.మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయమని స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్‌తో పాటు ఇతర సభ్యులు అభివర్ణించారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ నగర ప్రజలకు ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును చేపట్టడంపై ఈ సందర్భంగా కమిటీ ముఖ్యమంత్రి గారిని అభినందించింది. దీంతో పాటు రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కమిటీ ప్రశంసించింది. అంతకుముందు సమావేశం ప్రారంభంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులను ముఖ్యమంత్రి సత్కరించారు.తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి అనుగుణంగా సమగ్ర ప్రణాళికలతో రూపొందించిన తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను స్టాండింగ్ కమిటీ సభ్యులకు అందజేశారు.

## తదుపరి సీడీఎస్‌గా ఎన్ఎస్ రాజా సుబ్రమణి నియామకం

తీసుకుంది. బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు జనరల్ రాజా సుబ్రమణి ఆ పదవిలో కొనసాగనున్నారు.మరోవైపు చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ నియమితులయ్యారు. మే 31న బాధ్యతలు స్వీకరించి డిసెంబర్ 31, 2028 వరకూ ఆ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన వెస్టర్న్ నావల్ కమాండర్‌గా విధుల్లో ఉన్నారు.

## తెలంగాణలో రిజిస్ట్రేషన్లకు ఫుల్ డిమాండ్

తెలిపారు. చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్బీ నగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్వో, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో అదనపు పనివేళలు ఉంటాయని ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే మరింత సమయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది. స్లాట్ బుకింగ్‌ల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించింది.

## వీడని సందిగ్ధత

సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఎట్టకేలకు ఓటమిని అంగీకరించిన మమత

చేసేందుకు నిరాకరించారు. ఆ తర్వాత మే 7వ తేదీతో అసెంబ్లీ గడువు పూర్తైన నేపథ్యంలో గవర్నర్ ఆర్.ఎన్.రవి దానిని రద్దు చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నేడు రాష్ట్ర సీఎంగా భాజపా నేత సువేందు అధికారి ప్రమాణం చేశారు. దీంతో దీదీ తన ఎక్స్ బయోను అప్‌డేట్ చేశారు. 'అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15, 16, 17వ విధానసభ)' అని మార్చుకున్నారు. అంతకుముందు 'పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి' అని మాత్రమే ఉండేది.

## విద్యా వారోత్సవాలు 11 నుంచి..

**జిల్లా కాలెక్టర్లతో సిఎస్ వీడియో కాన్ఫరెన్స్**

హైదరాబాద్,మే9(జనంసాక్షి):99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యాశాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణం

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహితుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

బెంగాల్ ప్రజలకు మోడీ సాష్టాంగ ప్రణామం

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రజలకు సాష్టాంగ వందనం చేశారు. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. భారీ సంఖ్యలో హాజరైన ప్రజలను చూసిన ప్రధాని మోదీ ముందుగా చేతులు ఊపుతూ అభివాదం చేశారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని, చేతులు జోడించి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో బీజేపీ తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. తమకు మద్దతుగా నిలిచిన ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ విధంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమ బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీ తాజా ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. గతంలో తృణమూల్ కాంగ్రెస్‌లో ఉన్న సువేందు అధికారి, ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నేతగా ఎదిగారు.

## కాళేశ్వరంను తక్కువ చేసేందుకు కుట్రలు

మేడిగడ్డ మరమ్మ తు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణ హితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బడ్జెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనునలకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు. మేడిగడ్డ మరమ్మతు చేస్తే కేసీఆర్‌కు పేరొస్తదని తమ్మడిహట్టి అంశం తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్రం గురించి రేవంత్ రెడ్డి ఏ మాత్రం ఆలోచించడం లేదని విమర్శించారు.

**అకాల వర్షాలతో నష్టపోయినా చర్యలు లేవు**

అకాల వర్షాల వల్ల రైతులు చాలా నష్టపోతున్నారని.. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి రైతులపై పట్టింపు లేదని.. మూడు పంటలకు రైతుబంధు కూడా ఇవ్వలేదని హరీశ్ విమర్శించారు. ఢిల్లీకి లేఖలు రాయడం మాని, వెంటనే పండిన పంటను కొనుగోలు చేయాలని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లిపూర్ సొసైటీ వద్ద పొద్దు తిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాజీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు బాధపడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదని విమర్శించారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం కోతల సీజన్ వచ్చినప్పుడల్లా రివ్యూ మీటింగ్‌లు పెట్టి రైతుల అవసరాలన్నీ తీర్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎంతో పాటు మంత్రులు కూడా రివ్యూ చేసిన పాపాన పోలేదని మండిపడ్డారు. వడ్లు, పొద్దు తిరుగుడు, మక్కలు ఎలా కొనుగోలు చేస్తున్నారో చూడడానికి ఒక్క మంత్రి కూడా రైతుల దగ్గరికి రాలేదని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రభుత్వానికి రైతుల కంటే ముఖ్యమైన పని మరేముంటుందని ,సిద్దిపేట, చిన్నకోడూరు మండలాల్లో సన్‌ఫ్లవర్ రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని,కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అని తేడా లేకుండా రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయాలని చెబుతున్నారని.. పంట మార్పిడి చేస్తే కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సూర్యాపేట, సిద్దిపేట, జాలి తదితర ప్రాంతాల్లో వడ్లను బి గ్రేడ్ పేరుతో, తరుగు పేరుతో రైతులకు నష్టం కలిగిస్తు న్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి.. మాటలు బంద్ చేసి ఐకేపీ సెంటర్ దగ్గరికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలి. 40 రోజులుగా సన్‌ఫ్లవర్ కొనుగోలు చేయకపోవడంతో పంటకు చెదలు పడుతున్నాయి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నేడు హైదరాబాద్‌కు మోదీ రాక

గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహన దారులు ఇబ్బందులు పడకుండా ముందుగానే ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై ఎక్కడైనా వాహనాలను పార్క్ చేస్తే.. వాటిని వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సభకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశామని, వాహనదారులు పార్కింగ్ స్థలాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా అక్కడ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచినట్లు వివరించా రు. రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనదారులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొని ప్రసంగించ నున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు.ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, మఫ్టీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

**సీఎంకు ఆహ్వాన పత్రిక**

రేపటి ప్రధాని పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొనాలని జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేశారు.

## మళ్లీ చర్చలు !

– ఇస్లామాబాద్ వేదికగా అమెరికా– ఇరాన్ మధ్య మరోసారి సంప్రదింపులు

ప్రతిపాదనలపై ఇరాన్ నుంచి నేడు స్పందన వచ్చే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఈ విషయాన్ని సాగదీస్తుందా అని విలేకరులు అడగ్గా.. త్వరలోనే మనకు దీని గురించి తెలుస్తుందన్నారు. హర్మూజ్‌లో చిక్కుకుపోయిన నౌకలను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చేపట్టిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను తిరిగి పునరుద్ధరించే విషయాన్ని తమ యంత్రాంగం పరిశీలిస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయకపోతే.. ఈ కార్యక్రమాన్ని 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్లస్'గా నిర్వహిస్తామన్నారు. నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పాటు మరికొన్ని చర్యలను కూడా చేపడతామన్నారు.అమెరికాకు ఇరాన్ గట్టి హెచ్చరికలు చేసింది. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్‌కు యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఓ లేఖ రాశారు. ఇందులో హర్మూజ్ జలసంధిలో సైనిక చర్యలకు దిగి యూఎస్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. పర్షియన్ గల్ఫ్, హర్మూజ్‌లలో యూఎస్ తన సైనిక కార్యకలాపాలు కొనసాగిస్తే.. విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ

ఉక్రెయిన్ సైతం ఇదే రోజును సెలబ్రేట్ చేసుకుంటోందని ట్రంప్ అన్నారు. మే 9 నుంచి 11 వరకు ఇరుపక్షాల మధ్య అన్ని సైనిక కార్యకలాపాలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇరుపక్షాల మధ్య 1,000 మంది చొప్పున ఖైదీల మార్పిడి ఉంటుందన్నారు.ఈ కాల్పుల విరమణను తానే స్వయంగా ప్రకటించానని ట్రంప్ వెల్లడించారు. అయితే తన నిర్ణయానికి అంగీకరించినందుకు పుతిన్, జెలెన్‌స్కీలను అభినందిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న యుద్ధం ముగింపునకు దీన్ని నాందిగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధమే అతిపెద్దదని అభివర్ణించారు. ఇరుదేశాల మధ్య యుద్ధం ముగియడానికి నిరంతరం చర్చలు జరుగుతున్నాయని, ఈ సంఘర్షణ ముగింపునకు చాలా దగ్గరగా ఉన్నామని పేర్కొన్నారు.

## హర్మూజ్ వద్ద నావలో మంటలు

### భారతీయ నావికుడు దుర్మరణం

టెహ్రాన్(జనంసాక్షి):హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఒక నావలో మంటలు చెలరేగడంతో ఒక భారతీయ నావికుడు కన్నుమూసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ ఘటనలో మరో నలుగురు గాయాలపాలైనట్టు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాద సమయంలో నావలో 18 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. మంటలు చెలరేగటానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనలో గాయపడ్డ వారికి దుబాయ్‌లో వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారతీయ కాన్సులేట్ కూడా స్పందించింది. క్షతగాత్రులను ఆసుపత్రిలో పరామర్శించామని తెలిపింది. నావ యజమానితో నిత్యం అందుబాటులో ఉన్నామని కూడా పేర్కొంది. అన్ని రకాల సాయాలను అందిస్తున్నామని తెలిపింది. ఈ ఘటన విచారకరమని కూడా పేర్కొంది. ఇరాన్, యూఎస్ మధ్య హోర్ముజ్ వేదికగా ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న వేళ ఈ పరిణామానికి ప్రాధాన్యం ఏర్పడింది. శుక్రవారం హోర్ముజ్‌లో ఇరాన్, యూఎస్ దళాలు పరస్పరం కాల్పులకు దిగిన విషయం తెలిసిందే. మొదట కాల్పులకు దిగింది అమెరికాయేనని ఇరాన్ ఆరోపించింది. నౌకలను, సాధారణ పౌరులను అమెరికా టా÷–గ్గ÷ట్ చేసిందని ఆరోపించింది. కానీ ఇరాన్ దాడులకు తాము ప్రతిదాడులు మాత్రమే చేశామని అమెరికా తేల్చి చెప్పింది. ఈ కాల్పులను చిన్న విషయంగా కొట్టిపారేసిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్ ఆ తరువాత ఇరాన్‌కు గట్టి హెచ్చరిక చేశారు. చర్చలను మళ్లీ ప్రారంభించకపోతే ఇలాంటి దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## లేగదూడను కాపాడబోయి..

### బావిలో మునిగి తండ్రీకుమారుల మృతి

**ములుగు జిల్లాలో విషాదం..**

ములుగు(జనంసాక్షి):ములుగు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు బావిలో మునిగి తండ్రీకుమారులు మృతిచెందారు. గోవిందరావుపేట మండలం కర్లపల్లిలో ఈ ఘటన జరిగింది. బావిలో పడిన లేగదూడను కాపాడేందుకు వెళ్లి రసపుత్ పవన్ (21) నీట మునిగిపోగా.. అతడిని రక్షించేందుకు యత్నించి తండ్రి రాజు (41) కూడా చనిపోయారు. తండ్రీకుమారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## అమెరికాలో హైదరాబాద్ యువతి మృతి

అనే యువతి మరణంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రెండు రోజుల క్రితం ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆమె.. అక్కడే స్విమ్మింగ్ పూల్ వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వీణ తల్లిదండ్రులు దేవేందర్ రెడ్డి-సునీత ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న తమ కుమార్తె మరణ వార్తతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషాదం గురించి తెలుసుకున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నేరుగా వీణ తల్లిదండ్రులు ఉంటున్న నివాసానికి వెళ్లారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీణ భౌతిక కాయాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# కో-ఆప్షన్ సభ్యుల ఎంపికలో అన్యాయం

- ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలపై కేసులు




**జోగులాంబ గద్వాల, మే9 (జనంసాక్షి) :** ప్రశ్నించే వారిపై ప్రభుత్వం అక్రమ కేసులను పెడుతోందని బిఆర్ఎస్ ఆరోపించింది. హక్కుల సాధనకు నిలదీస్తున్న సామాన్యుడి నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఏదో ఒక రంగా ఇబ్బందులపాలు చేస్తుందన్నారు. గద్వాల మున్సిపల్ కో ఆప్షన్ ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని కమిషనర్‌ను నిలదీసిన 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు పులిపాటి వెంకటేశ్, జగదీష్, గువ్వలగోపాల్, మోహన్ యాదవ్, సంటేన్న ,చిన్న రాముడు,నరసింహ కమ్మరి సునీత గంగాళం మంజుల రాణి,లత , బీఆర్ఎస్ నాయకుడు చిత్తారి కిరణ్ పై పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, పోలీసుల తీరును నిరసిస్తూ కౌన్సిలర్లు శనివారం నిరసన తెలిపారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ చట్టబద్ధంగా జరగాల్సిన ఎన్నికను ఎన్నిక నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కో ఆప్షన్ ఎన్నికలలో భాగంగా గత నెల 23న నామినేషన్ దాఖలు కు చివరిరోజు కావడంతో నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి మున్సిపల్ కార్యాలయంలో ఏ అధికారి లేక పోవడం, దానికి ఒక విభాగాన్నికూడా ఏర్పాటు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్‌ను అడిగామని తెలిపారు. పోలీస్ అధికారులను తప్పుదారి పట్టించి మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించకున్నా తమపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. కౌన్సిలర్లుగా తమ హక్కుల కోసం ప్రజల పక్షాన ఖచ్చితంగా కమిషనర్‌ను నిలదీస్తామని, తప్పుడు పని చేసే ప్రతి అధికారిని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

# గంజాయి బ్యాచ్ పట్టివేత

- భారీగా గంజాయి ప్యాకెట్లు స్వాధీనం
- ఇద్దరు అంతరాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ




**నల్లగొండ, మే9 (జనంసాక్షి) :** గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారి నుండి 104.5 కేజీల గంజాయి, ఒక లారీ, రెండు సెల్ ఫోన్లను నల్లగొండ పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం విజయవాడ నుండి హైదరాబాద్‌కు భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం రావడంతో కేతేపల్లి ఎస్ఐ సతీష్ పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి కొర్లపహాడ్ టోల్ ప్లాజా సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రీన్ కలర్ అశోక్ లేలాండ్ లారీని ఆపి తనిఖీ చేయబోతుండగా లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వాహనం దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సోదాలు జరుపగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయన్నారు. నిందితులను జమ్ముకాశ్మీర్‌కు చెందిన పరంవిర్ సింగ్ అలంబుగా, మహారాష్ట్రకు చెందిన షా ఆలం పర్వేష్ ఆలం అన్సారిగా గుర్తించినట్లు తెలిపారు. అంతర్ రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, నకిరేకల్ సీఐ హరిబాబు, కేతేపల్లి ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది బి.వెంకటేశ్వర్లు, బి.వెంకట కృష్ణ, స్వామి, వెంకన్న, బాసిత్‌లను ఎస్పీ అభినందించారు. ఇదిలావుంటే నల్లగొండ జిల్లా కేంద్రంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠాను అరెస్టు చేసి వారి నుండి 300 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం హైదరాబాద్ రోడ్‌లోని హౌజింగ్ బోర్డు కాలనీ వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చినట్లు తెలిపారు. టూటౌన్ ఎస్ఐ యర్రా సైదులు తన సిబ్బంది బాలకోటి, షకీల్‌తో కలిసి పర్యటిస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు రెండు బైకులపై అక్కడ అనుమానాస్పదంగా నిలబడి ఉండడంతో వారిని విచారించేందుకు ప్రయత్నించగా పారిపోవడానికి యత్నించా రన్నారు. వెంటనే అప్రమత్తమై వారిని చేదించి ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు.వారిని విచారణ చేయగా హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నయీమ్ అ ముజీబ్, మహమ్మద్ సోహెల్, షేక్ లతీఫ్ గా గుర్తించినట్లు చెప్పారు. పారిపోయిన వ్యక్తి రవీంద్రనగర్ కు చెందిన రౌడీషీటర్ బంటు-కార్తీక్‌గా తెలిసిందన్నారు. వారిని సోదా చేయగా వారి వద్ద 300 గ్రాముల గంజాయి లభించినట్లు వెల్లడించారు. పరారీలోన్న బంటు కార్తీక్ ఇతర ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి వీరికి సరఫరా చేస్తున్నట్లు తెలిసిందన్నారు. నిందితులు స్వయంగా గంజాయి సేవించడమే కాకుండా, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ ను రూ.500లకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. పరారీలోన్న బంటు కార్తీక్ పై గతంలో అనేక క్రిమినల్ కేసులు నమోదై కాగా టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతనిపై రౌడీషీట్ కూడా ఉందని, మహమ్మద్ అబ్దుల్ నయీమ్ పై గతంలో హైదరాబాద్ మంగళహాట్ పోలీస్ స్టేషన్ లో ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వై.సైదులు, సిబ్బంది ఎల్.బాలకోటి, ఎండీ.షకీల్, మహేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

# మైనారిటీ డిగ్రీ కళాశాలల ఏర్పాటు నిర్ణయంపై హర్షం

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా
- ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించాలని విజ్ఞప్తి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంపై మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి ఇది కీలక నిర్ణయమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 204 మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రతి సంవత్సరం సుమారు 8 వేల మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేస్తున్నారని తెలిపారు.ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో మైనారిటీ గురుకుల కళాశాలలు రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. అయినప్పటికీ మైనారిటీల కోసం ప్రత్యేక గురుకుల డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఇంటర్ అనంతరం చదువులు కొనసాగించలేక ఉపాధి మార్గాన్ని ఎంచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన బాలికలు ఉన్నత విద్యకు దూరమై వివాహాలు చేసుకునే పరిస్థితి నెలకొంటోందన్నారు.మైనారిటీ డిగ్రీ కళాశాలల అవసరాన్ని ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మైనారిటీ శాఖ కార్యదర్శి బీ. షఫీవుల్లా, మైనారిటీ గురుకులాల చైర్మన్ ఫహీం ఖురేషీల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వేలాది మంది మైనారిటీ విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. ప్రకటించిన మైనారిటీ డిగ్రీ కళాశాలలను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించి విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇప్పటికే దోస్త్ అడ్మిషన్ ప్రక్రియ మొదటి విడత పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని కళాశాలల ప్రారంభంపై స్పష్టత ఇవ్వాలని యాకూబ్ పాషా విజ్ఞప్తి చేశారు.

# బోధన్ పట్టణ శివారులో ఈతవనాలు దగ్ధం

- దుండగులపై చర్యలకు గీతకార్మికుల వినతి

**బోధన్, మే9 (జనంసాక్షి) :** బోధన్ పట్టణం లోని పసుపువాగు శివారులోని సర్వే నంబర్ 594 లోని సుమారు 50 నుంచి 60 ఈత చెట్లను శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి, కాల్చి ధ్వంసం చేశారు. గీత కార్మిక సంఘానికి చెందిన తమ భూమిలో ఈత చెట్లను ధ్వంసం చేసి కాల్చి వేసినట్లు సమాచారమందుకున్న బోధన్ గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు ఈత వనాన్ని పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వనంలో ఈత చెట్ల ద్వారా జీవనోపాధి పొందుతున్న సమయంలో ఈ సంఘటన జరగడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన పై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు గీత కార్మిక సంఘం నాయకులు, గీత కార్మికులు తెలిపారు. బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్ రావు కు ఫిర్యాదు చేసిన వారిలో పీ గంగాధర్ గౌడ్, బీ లింగాగౌడ్, కందుకాల శ్రీకాంత్ గౌడ్, వై జీవన్ గౌడ్, వై రమేష్ గౌడ్, ఏం రాజేందర్ గౌడ్ తో పాటు కల్లు గీత సంఘం నాయకులు ఉన్నారు.

# వేముల సమక్షంలో బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేతలు

**నిజామాబాద్, మే 9 (జనంసాక్షి) :** మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని ఎర్గట్ల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సున్నపు అంజయ్య, జిట్టావోయినా రాజు, నాయుడు పోశెట్టికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా వాటిని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకపోవడం, రైతుబంధు, బోనస్ వంటి హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడం, పంట కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, అందుకే తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాజా పూర్ణనందం, ఎర్గట్ల సర్పంచ్ ఉపేందర్, మాజీ జడ్పీటీసీ గుళ్ళే రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ మధు, పార్టీ అధ్యక్షులు దేవుని నర్సయ్య, సొసైటీ చైర్మన్ బర్మా నర్సయ్య, ప్రభాకర్,కుశ లింబాద్రి పాల్గొన్నారు.

# బెంగాల్ సిఎం సువేందుకు పవన్ శుభాకాంక్షలు

**అమరావతి, మే 9 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించడానికి సంవత్సరాల తరబడి పోరాటం చేశారన్నారు. దీనికి దృఢంగా నిలిచిన బీజేపీ బెంగాల్ నాయకత్వానికి, పార్టీ కార్యకర్తలకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. 'ప్రజాకేంద్రిత పాలనను అందించడంలో నూతన బీజేపీ ప్రభుత్వం విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. దీనిని కేవలం బీజేపీ లేదా పశ్చిమ బెంగాల్ విజయంగానే కాకుండా, భారత ప్రజల గెలుపుగా భావిస్తున్నాను' అని తెలిపారు.

# న్యాయబద్ధమైన రిజర్వేషన్లపై 'మోడీ' స్పష్టత ఇవ్వాలి

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్




**హనుమకొండ (జనంసాక్షి) :** బీసీ బిడ్డగా చెప్పుకునే ప్రధాని నరేంద్ర మోడీ న్యాయబద్ధమైన రిజర్వేషన్లపై ఎందుకు దాట వేస్తున్నారని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ప్రశ్నించారు. కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం విభాగంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ విచ్చేసి మాట్లాడుతూ దక్షిణాదిన పాగా వేయాలనే ప్రధాని మోడీ ఓబీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించకుండా దగా చేస్తున్నారని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్లు బిల్లు పార్లమెంట్ లో 9వ షెడ్యూల్ లో చేర్చకుండా తొక్కిపెట్టడం ఎంతవరకు సమంజసం అంటూ నిప్పులు చెరిగారు. బీజేపీ ఓబీసీలను ఓటు బ్యాంకుగా చూస్తుందే కానీ ,మేమెంతో మాకంతా నినాదం అమలు చేసేందుకు సుప్రీం కోర్టును సాకుగా చూపుతున్నారని, అటువంటిది ఈడబ్ల్యుఎస్ 10శాతం రిజర్వేషన్లలో చట్టబద్ధత కల్పించిన మోడీ వైఖరి బీసీ సమాజం గమనిస్తుందని అన్నారు. 80కోట్ల ప్రజలను మోసం చేసేందుకు ఓబీసీల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావు పూలే స్మరణ చేసుకుంటూ కొత్త నాటకానికి తెరలేపిన ప్రధాని మోడీ హ్యాట్రిక్ తర్వాత తెలంగాణకు విచ్చేస్తున్న సందర్భంగా 'పాస్' పది డిమాండ్లను సమగ్ర కులగణన కోసం ఎస్సీ,ఎస్టీల మాదిరిగా ఓబీసీల కాలం చేర్చాలి. కొలీజియం పేరుతో వివక్ష చూపుతున్న ఉన్నత న్యాయస్థానాల్లో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి. తెలంగాణ ప్రభుత్వం పంపిన 42శాతం రిజర్వేషన్లు బిల్లుకు చట్టబద్ధత కల్పించేందుకు 9వ షెడ్యూల్లో చేర్చి పార్లమెంట్ లో చట్టబద్ధత కల్పించాలి. బీసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలి. బీసీ ప్రధానిగా ఉన్న మోడీ ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. మహిళా బిల్లులో ఓబీసీల సబ్ కోటా ప్రకటించాలి. పేదలకు అందే ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ పునఃసమీక్షించాలి. మండల్ కమిషన్ సిఫార్సులను బేషరత్ గా అమలుచేయాలి. దేశంలోని బీసీ బిడ్డ స్వేచ్ఛగా జీవించేందుకు బీసీ రక్షణ చట్టం చేయాలి. ఎస్సీ,ఎస్టీల మాదిరిగానే ఓబీసీలపై క్రిమీలేయర్ ఎత్తివేయాలని లేఖ విడుదల చేసారు. ఈ న్యాయమైన రాజ్యాంగబద్ధమైన డిమాండ్లపై ప్రధాని మోడీ ఓబీసీల పై స్పష్టత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు బాబుయాదవ్, జిల్లా కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాం వీరయ్య, డాక్టర్ వంగాల సుధాకర్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఏ .సంపత్ కుమార్, పాస్ నాయకులు ఎలకంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఐపీఎస్ భార్య హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

- తనూజ భౌతిక కాయానికి డీజీపీ ఆనంద్ నివాళి



**హైదరాబాద్, మే9 (జనంసాక్షి) :** విశ్రాంత ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజ హత్య కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెల్లవారుజామున నేపాలీ గ్యాంగ్ ఆమెను హత్య చేసి బంగారం, నగదుతో ఉడాయించింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. తనూజను హత్య చేసి పారిపోయిన పని మనిషి కల్పన అండ్ గ్యాంగ్ కోసం 10 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇప్పటికే నేపాల్‌తో పాటు ముంబై, లక్నో, ఢిల్లీకి పోలీసు బృందాలు చేరుకున్నాయి. పని మనిషి కల్పన చరిత్రపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో లక్నోలో కల్పన పని చేసిన ఇంటికి వెళ్లి ఆమె గురించి యజమానులను ప్రశ్నించారు. అయితే, తమ ఇంట్లోనూ భారీగా బంగారం, వెండి, నగదు మాయమైనట్లు పోలీసులకు వారు తెలిపారు. కల్పనతో ఉన్న ఇద్దరు యువకుల గురించీ కూపీ లాగుతున్నారు. హత్య అనంతరం ముగ్గురు నిందితులు నాంపల్లిలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి పారిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మాజీ ఐపీఎస్ ఇల్లు, నాంపల్లి రైల్వేస్టేషన్ సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. శనివారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో తనూజ అంత్యక్రియలు జరిగాయి. మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య మృతదేహానికి తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సహా పలువురు ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు.

# తుమ్మడిహట్టిపై ప్రధానిని ఒప్పించండి

- కాంగ్రెస్ ప్రభుత్వానికే జీవన్ రెడ్డి సవాల్



**జగిత్యాల, మే9 (జనంసాక్షి) :** తుమ్మడిహట్టి బ్యారేజీ పూర్తి చేసి ప్రాణహిత జలాలను ఎల్లంపల్లికి మళ్లించాకే.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడగాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. తుమ్మడిహట్ట ఇపేరుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. రెండున్నరేళ్లయినా తట్టెడు మట్టి కూడా ఎత్తకేండా ఇప్పుడు హడావిడి చేస్తున్నారని ఆరోపించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వరి, మక్కల కొనుగోళ్లు, తరలింపులో జాప్యంపై మండిపడ్డారు. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది 'బడే బాయ్ చోటే బాయ్' బంధమని, హైదరాబాద్‌కు రానున్న ప్రధానికి తుమ్మిడిహట్టిపై విన్నవించి అంగీకారం తీసుకు వస్తే పాలాభిషేకం చేస్తామన్నారు. పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు కాంట్రాక్టర్ మరమ్మతులు చేస్తానన్నా ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు.

# కారు, ప్రయివేటు కాలేజీ బస్సు ఢీ

- ప్రమాదంలో ప్రభుత్వ వైద్యుడు దుర్మరణం

**కల్వకుర్తి, మే9 (జనంసాక్షి) :** కారు, ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూర్ - కోదాడ జాతీయరహదారిపై కల్వకుర్తి మండల పరిధిలోని సీబీఎం కళాశాల వద్ద శనివారం ఉదయం కారు, ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రభుత్వ వైద్యుడు విజయ్ కుమార్ (43) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కల్వకుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సమీపంలోని వందేమాతరం ఫౌండేషన్ ఆవరణలో వ్యాయామం చేసేందుకు వెళ్లి, తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి భార్య యశ్వంత్ రాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యశ్వంత్ రాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన విజయ్ కుమార్ గత మూడేళ్లుగా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు. అతని మృతికి పలువురు వైద్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.



# స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన పట్కారి సహస్ర

**మెహిదీపట్నం (జనంసాక్షి) :** పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన పట్కారి సహస్రకు చిన్నారులతో సన్మానం చేశారు. మెహిదీపట్నం గుడిమల్కాపూర్ లో న్యూ ఎడెన్ స్కూల్లో 10.వ తరగతి చదువుతున్న సహస్ర 600 మార్కులకు 575 మార్కులు ఉత్తీర్ణత సాధించి స్కూల్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది స్కూల్ యాజమాన్యం సహస్రకు అభినందనలు తెలియజేశారు అనంతరం సహస్ర మాట్లాడుతూ కష్టపడి చదివితే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని సహస్ర అన్నారు కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల పేరు కూడా నిలబెట్టాలని సహస్ర తెలిపారు స్కూల్ ఫస్ట్ ర్యాంకు రావడంతో పట్కారి సహస్ర తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# అక్కాచెల్లెళ్లను ఢీకొన్న కారు

- అక్క మృతి.. గాయాలతో ఆస్పత్రిలో చెల్లెలు

**హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) :** గరంలోని వనస్థలిపురం పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. అక్కాచెల్లెళ్లను కారు ఢీకొట్టింది. చింతల్‌కుంట వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అంజలి (19) మృతిచెందగా, ఆమె సోదరి పూజిత (17)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సోదరి పూజితను అంజలి ఎప్‌సెట్ ఇంజినీరింగ్ పరీక్షకు తీసుకెళ్లింది. పరీక్ష అనంతరం విజయవాడ హైవే సర్వీసు రోడ్డులో నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా వారిద్దరినీ కారు ఢీకొట్టింది. అతివేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. తీవ్రంగా గాయపడిన పూజితను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కారులో గ్యాస్ నింపుతుండగా మంటలు

- పేలుడు ధాటికి రెండుకార్లు, టూవీలర్ దగ్ధం



**కామారెడ్డి, మే9 (జనంసాక్షి) :** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ కారులో గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా ట్యాంకు పేలింది. ఈ ప్రమాదంలో కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు, ద్విచక్రవాహనం దగ్ధమయ్యాయి. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

జనంసాక్షి సంపాదకీయం

# సువేందు.. ఎవరికి నీ సేవ..!?

***బెంగాల్ చరిత్రలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందో అధికారి అధికారం చేపట్టారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణ స్వీకారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి ఆయనకు పదవీ గోపనీయతా ప్రమాణం చేయించారు. రాజ్యాంగం పట్ల విధేయత, రాగద్వేషాలకు అతీతంగా లౌకిక పాలన, సమస్త పౌరుల సంరక్షణ.. ఇవే ఆ ప్రమాణంలోని సారాంశం. కానీ ఆ ప్రమాణానికి కేవలం కొద్ది రోజుల ముందు, అదే నేత చేసిన ప్రకటనలు వేరే చిత్రాన్ని చూపిస్తున్నాయి.***

ఫలితాల లెక్కింపు కేంద్రంలో మీడియాతో మాట్లాడిన అధికారి "హింధూ ఈవిఎం బీజేపీ, ముస్లిం ఈవీఎం టీఎంసీ" అని స్పష్టంగా చెప్పారు. అంటే హిందువుల ఓటు బీజేపీకి, ముస్లింల ఓటు టీఎంసీకి అని బహిరంగంగా వర్గీకరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం ఎమ్మెల్యేలను అసెంబ్లీ నుండి 'తరిమికొట్టాలి' అని కూడా ఆయన చెప్పారు. ముస్లింలను 'కట్టర్‌వాది' (మూర్ఖులు/తీవ్రవాదులు) అని అభివర్ణించారని, తన రాజకీయ విజయం హిందూ మద్దతుపై నిర్మించబడిందని పదేపదే చెప్పారని విమర్శకులు ఆరోపిస్తున్నారు


బెంగాల్‌లో సుమారు 27-30% ముస్లిం జనాభా నివసిస్తోంది. వారు సైతం బెంగాల్ పౌరులే. వారి విద్య, ఉపాధి, భద్రత, న్యాయం అన్నీ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతే. వారిని పక్కనపెట్టి పాలన చేయడమంటే దేశ సమగ్రతకే గండి కొట్టడం. చరిత్ర చెప్పిన పాఠం ఒక్కటే మతం పేరిట పాలన జరిగిన చోట నిరాశ, అశాంతి, హింస తప్పవు. సదరు నేతపై ప్రస్తుతం 25 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వాటిలో మతసమూహాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టిన కేసులు, మతభావాలను దెబ్బతీసిన కేసులు ఉన్నాయి. ఇది ఒక ముఖ్యమంత్రి పదవికి సరికాదన్న ప్రశ్నలు సహజంగానే వస్తున్నాయి. ఇప్పుడు ఆయన ముందు రెండుదారులు ఉన్నాయి. ప్రచారంలో చెప్పినట్టే పాలించడం.. ఇది బెంగాల్‌ను మతకలహాల వేదికగా మార్చే ప్రమాదం ఉంది. రాజ్యాంగానికి నిజంగా కట్టుబడటం.. ప్రతి బెంగాలీ పౌరుడిని సమానంగా చూడడం, అభివృద్ధి, న్యాయం, శాంతిని ఆధారంగా చేసుకుని పాలించడం.

భారత రాజ్యాంగం ముఖ్యమంత్రికి స్పష్టమైన బాధ్యత నిర్దేశిస్తుంది. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికిలి న్యాయం, సమానత, రక్షణ అందించడం. మతం, కులం, ప్రాంతం అనే తేడా లేకుండా పాలన చేయడం ముఖ్యమంత్రి ప్రాథమిక రాజ్యాంగ ధర్మం. అధికరణ 14 సమానత్వాన్ని, అధికరణ 15 వివక్షను నిషేధిస్తుంది, అధికరణ 25 మతస్వాతంత్ర్యాన్ని హామీ ఇస్తుంది. ఒక ముఖ్యమంత్రి 'నేను హిందువులకు మాత్రమే సేవ చేస్తాను' అని చెప్పడం రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. ప్రజాస్వామ్యంలో మెజారిటీ ఓట్లతో అధికారానికి వచ్చిన పార్టీ పాలించడం సహజమే. కానీ మెజారిటేరియనిజం అంటే మెజారిటీ మతసమూహం ప్రయోజనాల కోసం మాత్రమే పాలించడం. ఇది ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేసే ప్రమాదకర మార్గం.

ప్రమాణం కేవలం మాటలు కాదు. అది ఒక నిబద్ధత. రాజ్యాంగం కేవలం పుస్తకం కాదు. అది దేశపు ఆత్మ. హింధూ ఏటీఎం, ముస్లిం ఏటీఎం అని చెప్పిన నేత "అందరికీ సమానంగా పాలిస్తాను అని ప్రమాణం చేశారు. ఈ రెండు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చగలరా? పూడ్చకపోతే బెంగాల్ మాత్రమే కాదు, భారత ప్రజాస్వామ్య స్ఫూర్తే ప్రమాదంలో పడుతుంది. "ఒక నేత ఎన్నికల సమయంలో ఏమి చెప్తాడో కాదు.. అధికారంలో ఉన్నప్పుడు ఎలా వ్యవహరిస్తాడో చరిత్ర తేల్చుతుంది.

# "మార్క్సిజం సిద్ధాంతం - అవగాహన, ఆచరణలో సమస్యలు, సవాళ్ళు"

*భారత కమ్యూనిస్టు ఉద్యమం వందేళ్ళ చరిత్రను పరిశీలించేటప్పు డు, సిద్ధాంతం - ఆచరణ మధ్య ఉన్న సంబంధం ఒక కీలకమైన ప్రశ్నగా నిలుస్తుంది. ఈ ఉద్యమం భారత సమాజంలో వర్గ పోరా టాలను, భూస్వామ్య అవశేషాలకు వ్యతిరేక పోరాటాలను రూపొంది ంచడంలో ముఖ్య పాత్ర పోషించింది. కానీ, ఆధునిక భారతదేశ సంక్లిష్టతలు, మారుతున్న ప్రపంచ పరిస్థితులు, స్థానిక వాస్తవాలు... ఇవన్నీ సిద్ధాంతాన్ని ఎలా అన్వయించాలనే సవాలును ఎప్పటికప్పుడు ముందుకు తెస్తూనే వచ్చాయి. ఈ సమీక్షలో విజయాలు, వైఫల్యాలు రెండూ సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉంది.*



1920లలో మొదలైన ఈ ఉద్యమం బ్రిటీష్ వలసవాదానికి వ్యతిరేకంగా, శ్రామికులు, రైతుల సమస్యలను ఉద్ధరించడంలో కీలకమైంది. తెలంగాణ సాయుధ పోరాటం (1946-51), తేభాగా, వార్లీ, శ్రీకాకుళం, నక్సల్‌బరీ వంటి ఉద్యమాలు భూస్వామ్య వ్యవస్థ పై బలమైన దెబ్బ వేశాయి. లక్షలాది ఎకరాల భూమి పునః పంపిణీ, వడ్డీల నియంత్రణ, కూలీల హక్కులు... ఇవి దేశవ్యాప్త భూసంస్కరణలకు పునాది వేశాయి. కమ్యూనిస్టులు ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి, మహిళా సంఘాల ద్వారా ప్రజా చైతన్యాన్ని పెంపొందించారు. భారత స్వాతంత్ర్య సమరంలో కూడా వారి పాత్ర విస్మరించలేనిది, అయినప్పటికీ క్విట్ ఇండియా వంటి క్షణాల్లో వారి స్థానాలు వివాదాస్పదమయ్యాయి.

సిద్ధాంతపరంగా,మార్క్సిజం-లెనినిజం-మావోయిజం భారత పరిస్థితులకు అన్వయించడంలో కమ్యూనిస్టులు కృషి చేశారు. భారత సమాజంలో వర్గాలు, కులం, మతం, ఆదివాసీ సమస్యలు, సామ్రాజ్యవాద-స్థానిక భూస్వామ్య సంయుక్త దోపిడీ ...ఇవన్నీ విశ్లేషించే ప్రయత్నాలు జరిగాయి. కానీ ఇక్కడే ప్రధాన సమస్య తలెత్తింది. సాధారణ మార్క్సిస్టు సూత్రాలను భారతదేశ వైవిధ్యభరితమైన సామాజిక-ఆర్థిక నిర్మాణానికి అనుగుణంగా అభివృద్ధి చేయడంలో లోపాలు కనిపించాయి. పార్టీల మధ్య విభేదాలు (1964 సీపీఐ-సీపీఐ(ఎం) విభజన, తర్వాత నక్సలైట్ ఉద్యమం) సైద్ధాంతిక దృష్టికోణాల్లోని తేడాలను ప్రతిబింబించాయి. కొన్ని ధోరణులు చైనా సాంస్కృతిక విప్లవం ప్రభావంతో ఆయుధ సంఘర్షణను ప్రధానం చేసుకున్నాయి. ఇది కొన్ని ప్రాంతాల్లో రైతాంగాన్ని సమీకరించినప్పటికీ, దీర్ఘకాలిక రాజకీయ స్థిరత్వం కల్పించలేకపోయింది.

ఆచరణలో ఈ సమస్య మరింత తీవ్రమైంది. విప్లవోద్యమం సుమారు అరవై ఏళ్ల చరిత్రలో ఎన్నో త్యాగాలు, పోరాటాలు ఉన్నాయి. కానీ రాజ్య సామర్థ్యం, సైనిక చర్యలు, అంతర్గత లోపాలు ... ముఖ్యంగా జనాధారణ కోల్పోవడం - దాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. 2026 నాటికి మావోయిస్టు ఉద్యమం దాదాపు అంతం చేయబడిందని ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నో జిల్లాల్లో హింస తగ్గింది, నాయకత్వం దెబ్బతిన్నది, స్వయం - సమర్పణలు పెరిగాయి. ఇది కేవలం భద్రతా చర్యల వల్ల మాత్రమే కాదు; స్థానిక సమస్యలకు ప్రత్యామ్నాయాలు (అభివృద్ధి, పాలన) కూడా పాత్ర పోషించాయి. అయినా, ఆదివాసీ ప్రాంతాల్లో భూమి, వన్య సంపద, న్యాయం వంటి మూల సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

సాంస్కృతిక కోణం ఈ ఉద్యమంలో మరో ముఖ్యమైన అంశం. ప్రజల సంస్కృతిని మార్చడం, వారిని రాజకీయ సమీకరణలో భాగం చేయడానికి విప్లవకారులు ప్రయత్నించారు. కళ, సాహిత్యం, జానపద సంప్రదాయాల ద్వారా విప్లవ చైతన్యాన్ని వ్యాప్తి చేశారు. కానీ సంస్కృతి యొక్క సంక్లిష్టత - కులం, మతం, స్థానిక ఆచారాలను పూర్తిగా అర్థం చేసుకోవడంలో లోపాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో బలవంతపు మార్పులు లేదా బాహ్య సూత్రాలను అతిగా బలవంతం చేయడం ప్రజలను దూరం చేసింది.

వందేళ్ల అనుభవం నుంచి గుణపాఠాలు స్పష్టం. మార్క్సిజం ఒక పిడి వాదం (డాగ్మా) కాదు. చారిత్రక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన జీవన విధానం. భారతదేశంలో ఎన్నికల ప్రజాస్వామ్యం, మధ్యతరగతి వృద్ధి, సాంకేతిక మార్పులు, గ్లోబలైజేషన్ వంటి వాస్తవాలను దృష్టిలో ఉంచుకోవాలి. సైద్ధాంతిక కృషి ప్రజా పోరాటాలతో ముడిపడి ఉండాలి, కానీ ఆచరణలో యాంత్రిక అనుసరణకు బదులు సృజనాత్మక అన్వయం అవసరం. అంతర్గత పరిశీలన, విమర్శ, స్వీయ-సంస్కరణ లేకుండా ముందుకు వెళ్లడం కష్టం.

ఈ ఉద్యమం భారత సమాజానికి చేసిన సేవలు విస్మరించరానివి ... శ్రామిక హక్కులు, సమానత్వం, లౌకిక విలువలు. కానీ ఓటముల నుంచి నేర్చుకోవాలి. భవిష్యత్ తరాలకు దిక్సూచిగా మారాలంటే, శాస్త్రీయ విశ్లేషణ, స్థానిక సందర్భాలకు తగిన వ్యూహాలు, ప్రజాస్వామ్య మార్గాలపై ఆధారపడటం అత్యవసరం. మార్క్సిజం యొక్క సారాంశం మార్పు - ఆ మార్పు సమాజానికి మాత్రమే కాదు, సిద్ధాంతం, ఉద్యమం రెండింటికీ కూడా వర్తించాలి. అప్పుడే ఇటువంటి చరిత్రలు కేవలం గతం కాక, భవిష్యత్ ఆశలకు పునాది అవుతాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## శ్రీ కాళ హస్తి!

అంతా శ్రీకాళహస్తి!
ఎవరిమార్గం వారిది!
ఒకరికి నచ్చింది
మరొకరికినచ్చదు!

గుడికొచ్చిన వాళ్ళు
అంతా శివభక్తులే!
శ్రీ -కాళ -హస్తి
ప్రదర్శన భక్తి
కావలసింది ముక్తి!
సాధనలే వేరు!
మనుషులూ అంతే!
లోకోభిన్నరుచి!

సంసారంలోనూ
ఇంతే!
ఈ కథ
సార్వజనీనం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# కేంద్ర ప్రభుత్వం విధానాలతో పెన్షన్ హక్కులకు కొత్త ముప్పు

భారతదేశంలో ఉద్యోగం అంటే ఒకప్పుడు కేవలం నెల జీతం మాత్రమే కాదు, వృద్ధాప్యంలో కనీస భద్రత కూడా అన్న నమ్మకం ఉండేది. ప్రభుత్వ ఉద్యోగులు దశాబ్దాల పాటు సేవ చేసి పదవీ విరమణ అనంతరం పెన్షన్ ద్వారా గౌరవప్రదమైన జీవితం గడపగలరనే విశ్వాసం ఏర్పడింది. కానీ గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాల ఆర్థిక విధానాలు ఆ హామీని ఒక్కొక్కటిగా బలహీనపరుస్తూ వస్తున్నాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా పెన్షన్ సవరణలు ఆ ప్రక్రియను మరింత ప్రమాదకర దశకు తీసుకెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆర్థిక బిల్లులో భాగంగా తీసుకొచ్చిన ఈ మార్పుల అసలు సారాంశం ఏమిటంటే -భవిష్యత్తులో వేతన సంఘాల సిఫార్సులు అందరికీ ఒకే విధంగా వర్తించకపోవచ్చు. అంటే కొత్త పే కమిషన్ అమలైన తేదీ తరువాత రిటైర్ అయ్యే వారికి మాత్రమే పెరిగిన ప్రయోజనాలు ఇవ్వవచ్చు, అంతకు ముందు పదవీ విరమణ చేసినవారిని మినహాయించే అధికారం ప్రభుత్వానికి కలుగుతుంది. ఇది సాధారణ పరిపాలనా మార్పు కాదు; పెన్షన్ వ్యవస్థలోనే ఒక ప్రాథమిక తత్వ మార్పు.

భారతదేశంలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి చెందిన సుమారు 50 లక్షల ఉద్యోగులు, 65 లక్షల పెన్షనర్లు ఉన్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకులు, బీమా, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు కలిపితే కోట్లాది కుటుంబాల భవిష్యత్తు పెన్షన్ విధానాలపై ఆధారపడి ఉంది. అందుకే ఈ మార్పులు కేవలం ఒక చట్ట సవరణగా కాకుండా, సామాజిక భద్రతపై ప్రభుత్వ దృక్పథాన్ని సూచిస్తున్నాయని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి.

పెన్షన్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని భారత సుప్రీంకోర్టు పలు మార్లు స్పష్టం చేసింది. ముఖ్యంగా 1983లో వచ్చిన "డీఎస్ నకారా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా" కేసులో, రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షనర్లను వేరు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కోర్టు పేర్కొంది. అదే తీర్పు తరువాతే వేతన సంఘాల ప్రయోజనాలు పాత, కొత్త పెన్షనర్లందరికీ వర్తించే సంప్రదాయం బలపడింది. ఇప్పుడు కొత్త చట్టం ద్వారా ఆ తత్వాన్నే బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇక్కడ మరొక కీలక అంశం ఉంది. ఈ సవరణను ప్రత్యేక బిల్లుగా తీసుకురాకుండా ఆర్థిక బిల్లులో చేర్చడం రాజకీయంగా కూడా విమర్శలకు దారితీసింది. ఎందుకంటే ఆర్థిక బిల్లులపై రాజ్యసభ అధికారాలు పరిమితంగా ఉంటాయి. ఫలితంగా విస్తృత చర్చ లేకుండానే ఇంత పెద్ద విధాన మార్పు అమలులోకి వచ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలు పారదర్శక చర్చలకు లోనుకావాలి. కానీ ఇక్కడ ఆ అవకాశం కనిపించలేదనే విమర్శలు రావడం సహజం.

2004లో పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి నేషనల్ పెన్షన్ సిస్టమ్ తీసుకురావడం నుంచే ఈ మార్పు ప్రారంభమైంది. నిర్వచిత ప్రయోజనం ఉన్న పెన్షన్‌ను తొలగించి, మార్కెట్ ఆధారిత విధానానికి ఉద్యోగులను నెట్టారు. స్టాక్ మార్కెట్ లాభనష్టాలపై ఆధారపడే ఈ వ్యవస్థలో ఉద్యోగికి ఎంత పెన్షన్ వస్తుందో ముందుగా హామీ ఉండదు. ఇప్పుడు యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో తీసుకొచ్చిన కొత్త నమూనాపైనా అనేక సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఉద్యోగుల పొదుపు నిధులను మార్కెట్ వ్యవస్థకు అనుసంధానం చేయడం ద్వారా పెద్ద ఆర్థిక సంస్థలు, కార్పొరేట్ పెట్టుబడిదారులకే ఎక్కువ లాభం చేకూరుతుందన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక విధానం మాత్రమే కాదు; ప్రభుత్వ పాత్రపై ఒక సిద్ధాంతపరమైన మార్పు కూడా. సంక్షేమ బాధ్యతలను తగ్గిస్తూ, వ్యక్తిగత భద్రతను మార్కెట్ చేతుల్లోకి నెట్టే ధోరణి ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాద ఆర్థిక విధానాల భాగంగా వచ్చింది. భారతదేశంలో కూడా అదే నమూనా వేగంగా అమలవుతోందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల మార్పులు, కాంట్రాక్టు ఉద్యోగాల పెరుగుదల, ఇప్పుడు పెన్షన్ హక్కుల పరిమితీకరణ --- ఇవన్నీ ఒకే దిశలో సాగుతున్న చర్యలుగా వారు విశ్లేషిస్తున్నారు.

ప్రభుత్వం తన వాదనలో "పెన్షన్ ప్రయోజనాల అమలుపై విధాన నిర్ణయ స్వేచ్ఛ అవసరం" అంటోంది. కానీ ఆ స్వేచ్ఛ ఎక్కడ ఆగాలి? రాజ్యాంగ హక్కులు, సమానత్వ సూత్రాలు, వృద్ధాప్య భద్రత వంటి అంశాలను మించి ప్రభుత్వానికి పూర్తి అధికారాలు ఇవ్వడం భవిష్యత్తులో మరింత వివక్షకు దారి తీసే అవకాశం ఉంది. నేడు కేంద్ర ఉద్యోగులపై అమలయ్యే విధానం, రేపు రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు, బీమా రంగాలకు విస్తరించకపోతుందనే హామీ లేదు.

అంతిమంగా చూస్తే, ఈ వివాదం కేవలం పెన్షన్ లెక్కల గురించిది కాదు. ఉద్యోగ జీవితాంతం చేసిన సేవకు సమాజం ఇచ్చే గౌరవం గురించిది. వృద్ధాప్యంలో మనిషికి కనీస భద్రత హక్కా? లేక ప్రభుత్వ ఇష్టం మీద మారిపోయే సౌకర్యమా? అన్న మౌలిక ప్రశ్న గురించిది. అందుకే ఈ చట్ట మార్పులపై విస్తృత ప్రజా చర్చ అవసరం. ఎందుకంటే పెన్షన్ వ్యవస్థ బలహీనపడితే దాని ప్రభావం ఒక్క ఉద్యోగిపై కాదు; మొత్తం మధ్యతరగతి సామాజిక భద్రత నిర్మాణంపైనే పడుతుంది.

డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

# ఆదర్శ తల్లులు



మాతృ దినోత్సవ సందర్భంగా. తల్లి అంటే కేవలం జన్మనిచ్చే వ్యక్తి మాత్రమే కాదు. జీవితం అంటే ఏమిటో, మన గౌరవం ఏమిటో, సమాజంలో మన స్థానం ఏమిటో తెలియజేసే వ్యక్తి కూడా తల్లే. శారీరక తల్లి మనకు జీవాన్ని ఇస్తే, ఐడియాలాజికల్ తల్లి మనకు ఆత్మగౌరవాన్ని, ఆలోచనను, పోరాటస్ఫూర్తిని అందిస్తుంది. ఆమె మనకు వారసత్వ జ్ఞానాన్ని అందిస్తూ, చీకటిలో దారి చూపించే దీపస్తంభంలా నిలుస్తుంది. ఈ దేశంలో మొట్టమొదట చదువు దూరమైన అణగారిన మహిళలకు, బీసీ ఎస్సీ ఎస్టీల పిల్లలకు అక్షరజ్యోతి వెలిగించిన మహత్తర తల్లి సావిత్రిబాయి పూలే. ఆమె కేవలం ఒక గురువుగానే కాదు, సమానత్వ సమాజానికి మార్గదర్శకురాలిగా నిలిచింది. మహిళ చదువుకుంటే సమాజం మారుతుందని విశ్వసించి, అవమానాలు, దాడులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. బాలికల కోసం తొలి పాఠశాల ప్రారంభించి, మహిళ విముక్తి కోసం జీవితాన్ని అంకితం చేసింది. సావిత్రిబాయి పూలే వంటి ఐడియాలాజికల్(ఆదర్శ) తల్లులు మనకు కేవలం విద్యనే ఇవ్వలేదు, విముక్తి మార్గాన్ని చూపిన తల్లి. విద్యతో మన చరిత్రను తిరిగి పరిచయం చేశాయి. రమాబాయి అంబేద్కర్ నిత్యం అంబేద్కర్ కు తోడుగా నిలిచి మనకు ఒక ప్రపంచం మేధావినీ, రాజ్యాంగ నిర్మాతను అందించింది. అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా కోట్లాది ప్రజలకు విముక్తి కల్పించాడు. తీవ్రమైన పేదరికం, ఆకలి, కుటుంబ కష్టాలు, సామాజిక అవమానాలు మధ్య కూడా ఆమె అంబేద్కర్ గారిని చదువు, లక్ష్యం, ఉద్యమం వైపు నిలబెట్టింది. కుటుంబ బాధ్యతలన్నీ తన భుజాలపై మోస్తూ, ఆయన సమాజ విముక్తి కోసం పనిచేయడానికి అండగా నిలిచింది. అంబేద్కర్ విజయం వెనక రమాబాయి త్యాగం ఉంది. రమాబాయి అతనికి తోడుగా నిలకపోతే ఈరోజు మనం ఇంత స్వేచ్ఛగా హక్కులను కలిగి ఉండేవాళ్ళం కాదు. రమాబాయి తన వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాదు, ఒక సమాజ భవిష్యత్తును మోసిన తల్లి. ఆమె త్యాగం వల్లే ఒక మహానాయకుడు సమాజానికి దొరికాడు. అందుకే రమాబాయి అంబేద్కర్‌ను కేవలం కుటుంబ తల్లిగానే కాదు, కోట్లాది అణగారిన ప్రజలకు ఐడియాలాజికల్ తల్లిగా కూడా గుర్తించాలి. నేటి మదర్స్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ శారీరక తల్లితో పాటు, తమ ఆలోచనలను నిర్మించిన ఐడియాలాజికల్ తల్లులను కూడా స్మరించుకోవాలి. ఎందుకంటే ఒక తల్లి శరీరాన్ని జన్మనిస్తే, మరో తల్లి వ్యక్తిత్వాన్ని జన్మనిస్తుంది. సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్ వంటి తల్లులు అందరికీ శాశ్వత ప్రేరణ. వారి ఆశయాలను కొనసాగించడం, సమానత్వం కోసం నిలబడడమే ఈ మాతృ దినోత్సవం సందర్భంగా తల్లుల కర్తవ్యం.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# ఏం కొనేటట్లు లేదు, ఏం తినేటట్లు లేదు



ఒక్కసారి కళ్లు మూసుకుని ఆలోచించండి. తెల్లవారుజామున కోడికూతతో పాటే నిద్రలేచి, గడియారం ముల్లుతో పోటీ పడుతూ పనిలోకి పరిగెత్తి, సాయంత్రం సూర్యాస్తమయంతో పాటు అలసిపోయి ఇంటికి చేరే ఒక సామాన్య మనిషి జీవితం ఎలా ఉంటుంది? నెలకు పదిహేను వేలో, ఇరవై వేలో సంపాదించే ఆ మనిషి నేడు బజారుకెళ్లి కూరగాయలు కొనుక్కోవడానికి రెండుసార్లు కాదు, పదిసార్లు ఆలోచిస్తున్నాడు. పిల్లల గ్లాసు పాలలో నీళ్లు కలవకుండా చూసుకోవడానికి లెక్కలు వేసుకుంటున్నాడు. ఆకస్మికంగా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తే, ఏ స్నేహితుడిని చెయ్యి చాపాలో, ఏ వడ్డీ వ్యాపారి గడప తొక్కాలో అర్థం కాక తర్జనభర్జన పడుతున్నాడు. ఇది ఒక్కడి కథ కాదు ఇది ఈ దేశంలోని కోట్లాది మంది మధ్యతరగతి జీవుల నిత్య జీవన సమరం.నగరాల నడిబొడ్డున ఉండే మార్కెట్ల నుంచి పల్లెటూరి సంతల వరకు నేడు వినిపిస్తున్న మాట ఒక్కటే మంటలు . అవును, ధరల మంటలు సామాన్యుడి పొట్టను దహిస్తున్నాయి. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి మార్కెట్‌లో కూరగాయలు కొనడానికి వచ్చిన రమేష్ (45) పరిస్థితి ఇందుకు నిదర్శనం. ఒక ప్రభుత్వ కార్యాలయంలో చిరు ఉద్యోగిగా పనిచేసే రమేష్, కిలో టమాటాల ధర అడిగి శిలా విగ్రహంలా నిలబడిపోయాడు. అరవై రూపాయలా? నెలక్రితం ఇరవై రూపాయలే కదా? అని ఆయన గొంతులో వణుకు కనిపిస్తుంటే, కాయగూరల వ్యాపారి ముఖం చాటేసుకున్నాడు. మాకేం తెలుసు సార్, లారీ ఛార్జీలు పెరిగాయి, డీజిల్ ధరలు మండిపోతున్నాయి, అన్నీ పెరిగినప్పుడు మేమేం చేస్తాం? అన్నది ఆ వ్యాపారి సమాధానం.రమేష్ చేతిలో ఉన్న రెండు వందల రూపాయలతో ఏం కొనాలో, ఏది వదిలేయాలో తెలియక తల పట్టుకున్నాడు. ఇంట్లో ఐదుగురు మనుషులు. కొడుకు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నాడు, భార్యకు షుగర్ వ్యాధి ఉంది. ఆ రోజు సాయంత్రం పప్పు వండుకోవాలా లేక పల్చటి చారుతో సరిపెట్టుకోవాలా అని కూడా లెక్కవేసుకోవాల్సిన దీనస్థితి. ఇది ఒక్క రమేష్ వ్యథ మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ప్రతి గడపలోనూ వినిపిస్తున్న హాహాకారం.గత ఐదేళ్ల కాలంలో భారతదేశంలో ద్రవ్యోల్బణం అనే భూతం సగటు మనిషి పళ్లెంలోని ఆహారాన్ని లాగేసుకుంటోంది. 2019లో ఒక కిలో ఉల్లిపాయ ధర పది రూపాయలుంటే, ఈరోజు అది యాభై దాటి పరుగులు తీస్తోంది. వంట నూనె ధరలు ఆకాశాన్ని తాకాయి. బియ్యం, గోధుమ పిండి, పప్పులు ఇవేవీ సామాన్యుడికి చౌకగా దొరకడం లేదు. పాల ధర లీటరు డెబ్బైకి చేరితే, పేదవాడి ప్రొటీన్ వనరు అయిన గుడ్డు కూడా ఇప్పుడు విలాస వస్తువుగా మారిపోయింది.కానీ, విచారకరమైన విషయం ఏమిటంటే మధ్యతరగతి మనిషి జీతం మాత్రం నత్తనడకన కూడా సాగడం లేదు. ద్రవ్యోల్బణం ఇరవై శాతం పైగా పెరిగితే, జీతాల పెరుగుదల మాత్రం ఐదు శాతానికి మించడం లేదు. పదేళ్ల క్రితం కనీసం వారానికి ఒకసారైనా మా ఇంట్లో మాంసాహారం వండుకునేవాళ్లం. ఇప్పుడు పండుగ వస్తే తప్ప చికెన్ ముక్క చూసే పరిస్థితి లేదు అని విజయవాడలో ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్న సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె సంపాదన పదిహేను వేలు. అద్దె, ఫీజులు పోను మిగిలిన ఏడు వేలతో ఐదుగురు మనుషులు నెట్టుకురావడం ఒక నిత్య యుద్ధమే. ఆమె కళ్లలోని అలసట, ముఖంలోని నిస్సహాయత నేటి ఆర్థిక వ్యవస్థకు నిలువుటద్దం.నిత్యావసరాల ధరలు ఒక ఎత్తు అయితే, వైద్య ఖర్చులు మరొక ఎత్తు. రోగమొస్తే సామాన్యుడు చితికిపోతున్నాడు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అంతులేని వరుసలు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో నక్షత్రాల వంటి బిల్లులు ఈ రెండింటి మధ్య సామాన్యుడి ప్రాణం కొట్టుమిట్టాడుతోంది. ఒక సాదాసీదా శస్త్రచికిత్సకు కూడా లక్షలు కుమ్మరించాల్సి వస్తోంది. ప్రాణాలు నిలబెట్టే మందుల ధరలు కూడా అమాంతం పెరిగాయి.కరీంనగర్ జిల్లాకు చెందిన సోమయ్య అనే రైతు కథ వింటే కన్నీళ్లు రాక మానవు. భార్యకు గుండె జబ్బు వస్తే, ఆపరేషన్‌కు నాలుగు లక్షలు కావాలన్నారు. ఉన్న ఆ ముక్క భూమి అమ్మాలా? లేక పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టి అప్పు చేయాలా? అని ఆయన ప్రశ్నిస్తున్నాడు. దేశంలో ఇలాంటి సోమయ్యలు లక్షల్లో ఉన్నారు. ఒక్క అనారోగ్యం ఒక తరాన్ని రోడ్డున పడేస్తున్న వాస్తవం మన కళ్లముందే ఉంది.ఒకప్పుడు విద్య జ్ఞానాన్ని ఇచ్చేది, ఇప్పుడు అది వ్యాపారంగా మారి సామాన్యుడి కలలను కబళిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత లోపించడంతో, భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ స్తోమతకు మించి ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒక్కో బిడ్డ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు అన్నీ కలిపి నెలకు వేలల్లో భారమవుతున్నాయి.నా కొడుకు ఇంజినీర్ కావాలని కల కంటున్నాడు. కానీ వాడికి కాలేజీ ఫీజు కట్టే శక్తి నాకు లేదు అని నల్లగొండ జిల్లాలో మేస్త్రీ పని చేసే నాగేశ్వరరావు కళ్లు చెమర్చారు. తన రెక్కల కష్టాన్ని నమ్ముకున్న తండ్రి, కొడుకు కలలను నెరవేర్చలేక కుమిలిపోవడం ఎంతటి విషాదం! విద్యా హక్కు చట్టం ఉన్నా, క్షేత్రస్థాయిలో అది అక్షర సత్యం కావడం లేదు.నగరా ల్లో నివసించే మధ్యతరగతికి ఇంటి అద్దె ఒక పెద్ద శాపం. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాల్లో ఒక చిన్న పోర్షన్ అద్దె కూడా పది వేల లోపు దొరకడం గగనమైపోయింది. సంపాదించిన దానిలో సగం ఇంటి యజమానికే సరిపోతోంది. సొంతిల్లు కట్టుకోవాలనేది నా జీవితకాల స్వప్నం. కానీ లోన్ వడ్డీలు చూస్తే భయం వేస్తోంది. EMI కడితే కూరగాయలకు కూడా పైసలు మిగలవు అని గుంటూరులోని ఒక క్లర్క్ వాపోతున్నాడు. అద్దెలు, కరెంటు బిల్లులు, పెరిగిన వస్తువుల ధరల మధ్య సామాన్యుడి బతుకు బండి చక్రం విరిగిన స్థితిలో ఉంది.నగరాల కంటే గ్రామాల్లో పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కదు, కానీ అతడు కొనే వస్తువుల ధరలు మాత్రం చుక్కల్లో ఉంటాయి. కూలీ పనికి వెళ్లే తల్లుల పరిస్థితి మరీ ఘోరం. రోజంతా ఎండలో ఎండి, వానలో తడిసి పని చేస్తే వచ్చే ఆ మూడు వందల రూపాయలు, సాయంత్రం సరుకులు కొనేటప్పటికే ఖర్చయిపోతాయి. ఆ తర్వాత పిల్లల అవసరాల కోసం ఆ తల్లి పడే తపన వర్ణనాతీతం.ప్రభుత్వాలు సబ్సిడీలు ఇస్తున్నాయి, సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నాయి అది కాదనలేని సత్యం. ఉచిత బియ్యం, గ్యాస్ వంటివి కొంత ఊరట ఇస్తున్న మాట నిజమే. కానీ, అసలు సమస్య ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకపోవడంలోనే ఉంది. ఒక చేత్తో సాయం చేస్తూ, మరో చేత్తో ధరల పెరుగుదల ద్వారా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టడం ఎంతవరకు సమంజసం? కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారుల మీద, నిల్వ దారుల మీద కఠినమైన చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారా అన్న అనుమానం కలుగుతోంది. అంతర్జాతీయ పరిణామాలను సాకుగా చూపడం మానేసి, స్థానిక ధరలను నియంత్రించే పక్కా ప్రణాళిక అవసరం.రాజకీయ పార్టీలకు మధ్యతరగతి ఓటు బ్యాంకుగానే కనిపిస్తుంది తప్ప, వారి బాధలు పట్టవు. పేదవారికి పథకాలు ఉంటాయి, ధనికులకు రాయితీలు ఉంటాయి. కానీ మధ్యతరగతికి మాత్రం 'అర్హత లేదు' అనే ముద్ర పడుతుంది. వీరికి రేషన్ కార్డు దొరకదు, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే అలుసు, ప్రైవేట్‌కు వెళ్తే దోపిడీ. దేశానికి అత్యధికంగా పన్నులు కట్టే ఈ వర్గం, నేడు నిరాదరణకు గురవుతోంది.ఈ అంధకారం నుంచి బయటపడాలంటే రాజకీయ సంకల్పం ముఖ్యం.నిత్యావసర వస్తువులపై జీఎస్టీని గణనీయంగా తగ్గించాలి.రైతులకు కనీస మద్దతు ధరతో పాటు, వినియోగదారులకు తక్కువ ధరకే వస్తువులు అందేలా మార్కెట్ నియంత్రణ ఉండాలి.ప్రభుత్వ వైద్యం, విద్యపై భారీగా నిధులు ఖర్చు చేసి, కార్పొరేట్ సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి.మధ్యతరగతి ఆదాయ పన్ను పరిమితిని పెంచి, వారి చేతిలో నాలుగు డబ్బులు మిగిలేలా చూడాలి.మల్కాజ్‌గిరి మార్కెట్‌లో నిలబడ్డ ఆ రమేష్, చివరికి కిలో టమాటాలు కొనలేక, అరకిలోతో సరిపెట్టుకుని ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రి అతడికి నిద్ర పట్టలేదు. తన అసమర్థత వల్ల కాదు, వ్యవస్థలోని లోపాల వల్ల తన కుటుంబానికి నాణ్యమైన భోజనాన్ని అందించలేకపోతున్నాననే బాధ అతడిని దహిస్తోంది.ఏం కొనేటట్లు లేదు. ఏం తినేటట్లు లేదు అనేది ఒక నినాదం కాదు, అది అశ్రువులతో నిండిన సామాన్యుడి ఆర్తనాదం. పాలకులు ఈ నిట్టూర్పులను వింటారా? ఈ నిశ్శబ్ద యుద్ధంలో సామాన్యుడికి విజయం ఎప్పుడు లభిస్తుంది? సమాధానం కోసం యావత్ మధ్యతరగతి భారతం నిరీక్షిస్తోంది.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## ఆశలు రాలిన చోటు

అకాల వర్షం
ఊరుక్కుంటూ వచ్చింది
పొలాల మీద
కూలీల మీద
వాళ్ళు తీసే మోపుల మీద
పత్తి గోతాల మీద
చివరికి పట్టేడన్నం మీద
ప్రకృతి పగబట్టిందేమో!!
సకాలంలో వానలు లేక
చెరువు కుంటలు ఆదుకుంటాయని
ఆరు తడి పంటలేస్తే
సాగుభూముల మొహన
ఈదురుగాలు ఈడ్చికొట్టి
వడగండ్ల వానయై తడిపే!!
యాడంగానో వచ్చిన
దుమ్ము దుమారాంతో
ఇంటి కప్పులు పైకెగిరిపోయే!!
తీవ్ర నష్టంతో రైతన్నల కన్నీటి ధారాలు
కొనుగోలు కేంద్రాల్లో
తడిసిముద్దయిన ధాన్యంలో
కలిసిపోయే...
అయినకాడికి కూడా తెగనమ్ముకోలేని
మట్టి హృదయాల గోసలు
ఎవ్వరు వినకపోయే!!
జీవం కోల్పోయిన ధాన్యం
కొనేదెవ్వరు,??
చేతికొచ్చిన పంట
తడిసి చేజారి పోయినాక,
ఈదురుగాలులకు విరిగిపడిన విద్యుత్
స్తంభాలోలే!!
వెన్నెముక ముక్కలై
నిటారుగా ఒరిగిపోయే అన్నదాత!!
పెట్టుబడి కూడా దక్కని
రైతుల దీనావస్థల
మట్టి కేకలు వినేదెవ్వరు!?
నీట మునిగిన ధాన్యం
ప్రభుత్వాలు కొనేదెన్నడు!!?

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

# రాజ్‌పుత్రులు మహారాణా ప్రతాప్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**తాండూరు, మే 9 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో రాజ్ పుత్ సమాజం ఆధ్వర్యంలో మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖాజాపూర్ సమీపంలో గల మహారాణా ప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి పట్టణంలోని కాళికాదేవి ఆలయం, వినాయక్ చౌక్, పాత కూరగాయల మార్కెట్, గాంధీ చౌక్ మీదుగా భారీ బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం భద్రేశ్వర్ చౌక్ లో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ బి ఓ ఎల్ సి ఈ ఓ బుయ్యని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మహారాణ ప్రతాప్ జయంతి వేడుకలలో ఆయన మాట్లాడుతూ రాజపుత్రులు మహారాణా ప్రతాప్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. మాతృభూమి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అన్యాయంపై అలుపెరగని



పోరాటం చేసిన వీర యోధుడు అని కొనియాడారు. రాజ్ పుత్ సమాజం వారు కోరిన విధంగా వారి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో మాట్లాడి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, బీసీ కమిషనర్ మాజీ సభ్యులు శుభప్రద్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్,బిజెపి ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సమాజ గౌరవ అధ్యక్షులు ఠాకూర్ సుభాష్ సింగ్,ఠాకూర్ సమాజ్ అధ్యక్షులు దిలీప్ సింగ్, జనరల్ సెక్రటరీ శివానంద్ సింగ్, , ఆర్గనైజేషన్ కమిటీ చైర్మన్ రమేష్ సింగ్, వైస్ చైర్మన్ ఉమేష్ సింగ్, సంఘం మాజీ అధ్యక్షులు ఠాకూర్ సూరజ్ సింగ్, దినేష్ సింగ్,యువ దళ్ కన్వీనర్ దీపక్ సింగ్ ఠాకూర్, మహిళా సమాజ జిల్లా అధ్యక్షులు నిఖితా ఠాకూర్, పల్లవి ఠాకూర్, సుమన్ ఠాకూర్, ఝాన్సీ ఠాకూర్, జ్యోతి ఠాకూర్, నీతా ఠాకూర్, వికారాబాద్ జిల్లా నుంచి వివిధ గ్రామాల రాజ్ పుత్ సమాజ సమాజ అధ్యక్ష కార్యదర్శులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**నర్వ, మే 9 (జనంసాక్షి) :** నర్వ పోలీస్ స్టేషన్లో రాబోయే బక్రీద్ ఈద్ ఉల్ అజ్హాపండుగను హిందూ, ముస్లిం సోదరులందరూ కలిసిమెలసి,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మరికల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భగవంత రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం నర్వపోలీస్ స్టేషన్ ఆవరణలో నర్వఎస్.ఐ పబ్బతి రమేష్ ఆధ్వర్యంలో ఇరు మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సి.ఐ భగవంత రెడ్డి మాట్లాడుతూ గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలిచే మన ప్రాంతంలో పండుగలను భక్తిశ్రద్ధలతో,ఒకరినొకరు గౌరవించుకుంటూ జరుపుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని,ఏదైనా సమస్యాత్మక విషయం దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రార్థనా స్థలాల వద్ద పారిశుధ్యం మరియు విద్యుత్ సౌకర్యాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిషేధిత జంతువులను వధించరధన్నారు. పండుగ పూట ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.ఈసమావేశంలో నర్వ ఎస్.ఐ పబ్బతి రమేష్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హిందూ, ముస్లిం కమ్యూనిటీల పెద్దలు, ప్రజా ప్రతినిధులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిమ్జ్ అబివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



**ఝరాసంగం, మే 9 (జనం సాక్షి) :** జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాంతంలో కొనసాగుతున్న నిమ్జ్ అబివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఝరాసంగం, న్యాల్కల్ మండలాల పరిధిలోని ఎల్గోయి, బర్దీపూర్, ఛీలెపల్లి, ఛీలెపల్లి తండా, రుక్మాపూర్, ముంగి ప్రాంతాలలో పర్యటించారు. స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న అంతర్గత రోడ్లు, ఫినిషింగ్ పనులు పరిశీలించారు. మొదటి విడుతలో నిమ్జ్ నిర్మాణానికి కెటాయించిన భూమి వివరాలు ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యాప్ను పరిశీలించారు. నిమ్జ్ ప్రాంతంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలకు సంబందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు.ఆయన వెంట ఎస్పీ పరితోష్ పంకజ్ ,టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి,జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ,డీఎస్పీ సైదానాయక్, సీఐ జక్కుల హన్మంతు, తహసీల్దార్ భాస్కర్, టీజిఐఐసీ అధికారులు , కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

# రోడ్డుపై బైక్ స్టంట్లు చేస్తున్న ఆరుగురు యువకుల అరెస్ట్

**రాజేంద్రనగర్, మే 9 (జనం సాక్షి) :** రోడ్డు పై ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఆరుగురు యువకులను రాజేంద్రనగర్ జోన్ టాస్క్ ఫోర్స్, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ప్రకారం అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ మధ్య ప్రధాన రోడ్డు పై ఈ యువకులు ట్రిపుల్ రైడింగ్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, వీలీలు వంటి ప్రమాదకర విన్యాసాలు చేస్తూ వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.అరెస్టైన వారిలో హసన్‌నగర్‌కు చెందిన సయ్యద్ షాహెద్ (19), షేక్ నసీర్ హుస్సేన్ (19), షేక్ జునైద్ (18), కాలాపత్తర్‌కు చెందిన మొహమ్మద్ బిన్ ఇసా (17), అబ్దుల్ సమద్ (20), ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మొహమ్మద్ అర్బాజ్ హుస్సేన్ ఖాన్ (22) ఉన్నారు. వీరిలో నలుగురిపై గతంలో కూడా బైక్ స్టంట్ల కేసులు నమోదై ఉండగా, అర్బాజ్ హుస్సేన్ ఖాన్‌పై పోక్సో కేసు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర



వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ నిర్వహించిన టాస్క్ ఫోర్స్ మరియు అత్తాపూర్ పోలీసు బృందాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అభినందించారు. అలాగే తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, ప్రమాదకర డ్రైవింగ్ గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# హిందూ సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయాలి



ఖిల్లా ఘనపురం, మే 9 (జనంసాక్షి) : ఖిల్లా ఘనపురం కేంద్రం లో సోమవారం జరిగే హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం మండల కార్యవర్గం శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు వెళ్లి హిందూ సమ్మేళన కార్యక్రమం కరపత్రాన్ని ఆయా గ్రామాల పెద్దలకు నాయకులకు అందించడం జరిగింది అనంతరం హిందూ సమ్మేళనం మండల నాయకులు విక్రం మ్ పాలవాది రాజు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ సోమవారం మండల కేంద్రంలో పద్మశాలి కళ్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా విజయోత్సవ హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని మండలంలోని ఉన్న అన్ని గ్రామాల హిందూ బంధువులు పాల్గొని హిందువుల ఐక్యతను చాటాలని ఉద్దేశంతో మండపం లో జరగనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి హిందూ బంధువులను ఆహ్వానించడానికి వెంకటాంపల్లి, ఆగారం, కమాజీ పురం, తీర్మాలాయపల్లి, రోడ్డుమీది తాండ, అల్లామాయి పల్లి, రాంరాంపల్లి, అప్పరెడ్డి పల్లి, సల్కెలాపూర్, మామిడిమాడ, పర్వతాపూర్, గ్రామాల సర్పంచులను వార్డు సభ్యులను హిందూ బంధువులను అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా గ్రామాల వారికి తెలపడం జరిగింది అని ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త శ్రీనివాసులు, శివ శంకర్,రామ్ చంద్రయ్యా,వెంకటేష్ రాజు గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మ్యాతరీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# నత్త నడకన ధాన్యం కొనుగోళ్లు

- రైతుల పడిగాపులు
- అలసత్వంపై మండిపడ్డ బీజేపీ నాయకులు

**కోహెడ, మే 9 (జనంసాక్షి) :** మండలంలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు సెంటర్లలో రైతులు పడిగాపులు కాసే విధంగా కొనుగోలు నత్తనడకపై కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తూ రైతులను ఇబ్బందులు పెట్టడం సరికాదని బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఖమ్మం వేంకటేశం, బిజెపి మండల శాఖ అధ్యక్షుడు జాలిగం రమేష్ లు కలిసి డిమాండ్ ప్రభుత్వ పని తీరుపై మండి పడ్డారు. కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు సత్వరమే న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొనుగోలు సెంటర్లలో అలాగే రైస్ మిల్లర్లలో ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటను కటింగ్ ల పేరిట నిలువునా దోచుకోవడం ఏమిటని వారు ప్రభుత్వ పని తీరుపై మండి పడ్డారు. విచ్చలవిడిగా దోపిడి జరుగుతున్న స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోకుండా చోద్యం చూడడం ఏమిటి అని వారు ప్రశ్నించారు. కొనుగోలు



సెంటర్లలో మిల్లర్ల వద్ద ఏ గ్రేడ్ వడ్లను కూడా కటింగ్ ల పేరట దోపిడి చేస్తున్న ప్రభుత్వం కానీ,అధికారులు కానీ పట్టించుకొని సమస్య పరిష్కరించకపోతే కొనుగోలు సెంటర్లలో రైతుల పక్షాన పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు బిజెపి చేపట్టే అవకాశం మాకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించకుండా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే మొక్కజొన్న కొనుగోలు వేగవంతం చేయాలని బిజెపి నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిల్లి నర్సయ్య గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, బండ జగన్ యాదవ్, కంది సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు.

# జనగణనలో ఓబీసీలను కూడా లెక్కించాలి




**అంబర్‌పేట, మే 9 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబీసీలను కూడా లెక్కించాలి అనే డిమాండ్ తో ప్రభుత్వ సలహాదారు, ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు తన అంబర్ పేట నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. రాజకీయ పార్టీలకి అతీతంగా బీసీల అభ్యున్నతికి, బీసీ జనాభా ప్రతిపాదికంగా న్యాయం జరగాలంటే జనగణనలో బీసీ జనాభా కూడా లెక్కించాలి అని పలు మార్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖలు రాసిన కూడా సరైన స్పాందన లేకపోవడంతో ఈ దీక్ష చేపట్టడం జరుగుతుందని వి.హెచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్ అది శ్రీనివాస్, బి ర్ల ఐలయ్య.ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే, ఓబీసీ కమిటీ చైర్మన్ శంకరయ్య, రాజ్ ఠాకూర్,తీన్మార్ మల్లన్న, కన్వీనర్లు ధన లక్ష్మీ, కే. వెంకటేష్, సంతోష్, బిసి సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, గుజ్జ కృష్ణ మేకపోతు నరేందర్ గౌడ్, పిసిసి అధ్యక్షులు మోతారోహిత్ అంజన్ న్ బాబు, సంజీవ్ ముదిరాజ్, రాజీవ్ రెడ్డి రాజేష్ అగర్వాల్ ఆర్ లక్ష్మణ్ యాదవ్ శంబూల ల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట వాసికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో గ్యాదరి బలరాంకు పీహెచ్‌డీ ప్రదానం
- అభినందించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్ రావు

**సిద్దిపేట బ్యూరో, మే 9 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సిద్దిపేటకు చెందిన పరిశోధక విద్యార్థి గ్యాదరి బలరాంకు ప్రతిష్టాత్మక డాక్టరేట్ (పీహెచ్‌డీ) వరించింది. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు అధికారికంగా ప్రకటన విడుదల చేశారు. శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ మరియు ఓయూ ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి. సతీష్ కుమార్ పర్యవేక్షణలో బలరాం తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఆయన "హార్మోనిక్స్ రిడక్షన్ అండ్ బ్యాలెన్స్డ్ ఫేజ్ ట్రాన్సిషన్ ఇన్ హైబ్రిడ్ రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ ఇన్ ఏ మైక్రో గ్రిడ్ పవర్ సిస్టమ్స్" అనే అంశంపై సమర్పించిన ప్రతిభావంతమైన పరిశోధనా గ్రంథానికి గాను ఓయూ ఆయనకు ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.అభినందించి శుభాకాంక్షలు తెల్పిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట చెందిన గ్యాదరి బలరాం కు విద్యుత్ మరియు సాంకేతిక రంగంలో అత్యున్నత పరిశోధనలు చేసి డాక్టరేట్ సాధించడం పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు సంతోషం చేశారు. ఈ సందర్భంగా బలరాంకు ఆయన అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు..ఈ సందర్భంగా "మన సిద్దిపేట బిడ్డ గ్యాదరి బలరాం ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పొందడం సిద్దిపేట ప్రజలందరికీ గర్వకారణం. నేటితరం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపేలా, మైక్రో గ్రిడ్ పవర్ సిస్టమ్స్‌లో పునరుత్పాదక ఇంధన వనరులపై ఆయన చేసిన పరిశోధన ఎంతో అభినందనీయం. కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన బలరాం నేటి యువతకు ఆదర్శం. భవిష్యత్తులో అతను మరెన్నో ఉన్నత శిఖరాలను చేరుకుని, తన పరిశోధనల ద్వారా దేశానికి, మన రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను," అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.



# నేడు పరేడ్ గ్రౌండ్‌లో ప్రధానమంత్రి మోడీ పబ్లిక్ మీటింగ్

- సభకు భారీ భద్రతా ఏర్పాట్లు

**సికింద్రాబాద్, మే 9 (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఆదివారం సాయంత్రం 4గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేసినట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బీ.సుమతి తెలిపారు. సభకు దాదాపు లక్ష మంది హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో విస్తృత స్థాయిలో బందోబస్తు చేపట్టినట్లు ఆమె చెప్పారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్ లోని డిసిపి కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్ల డించారు.. ఈ బందోబస్తులో సుమారు 2వేల మంది లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు 550 మంది ట్రాఫిక్ సిబ్బందిని విధుల్లో నియమించారు. విధుల్లో ముగ్గురు డీసీపీలు, 5గురు అదనపు డీసీపీలు, 21 ఏసీపీలు, 61 మంది ఎస్‌డీపీవో లు,57 మంది ఇన్‌స్పెక్టర్లు, 226 మంది ఎస్‌ఐలు, 12 ప్లాటూన్ల ప్రత్యేక దళాలు, 6 ఏఆర్ ప్లేషన్లు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, ఇంటెలిజెన్స్ బృందాలు , సూపర్ ఆక్టోపస్ టీమ్స్, ఐటి, కమ్యూనికేషన్ టీంలు, ఐటీ సెల్, కమాండ్ కంట్రోల్ టీమ్స్, షి టీమ్స్, స్నిఫర్ డాగ్ స్క్వాడ్, భద్రతా పర్యవేక్షణలో పాల్గొంటున్నాయనీ తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాలు, రహదారులు, పార్కింగ్ ప్రదేశాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని సీపీ తెలిపారు. సభ ప్రాంగణంలోకి కేవలం నిర్దేశిత గేట్ల ద్వారానే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. డ్రోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ప్రమాదకర వస్తువులు తీసుకురావడంపై నిషేధం విధించామని చెప్పారు.




### డ్రోన్లపై నిషేధం...

పబ్లిక్ మీటింగ్ సందర్భంగా పర్యట గ్రౌండ్ చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్ల ఎగురవేతను నిషేధిస్తున్నట్లు సిపి చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బేగంపేట్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ల ఎగరవేయటంపై నిషేధం అమల్లో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పరేడ్ గ్రౌండ్స్, బేగంపేట్, ప్యారడైజ్, ప్యాట్నీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని సూచించారు.

### సభకు వచ్చే వాహనాల కోసం 12 పార్కింగ్ ప్రాంతాలు..

పరేడ్ గ్రౌండ్స్‌లో భద్రతా కారణాలు, వీవీఐపీ కాన్వాయ్‌ల రాకపోకల దృష్ట్యా పరేడ్ గ్రౌండ్స్, బేగంపేట్, పారడైజ్, ప్యాట్నీ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణలు, పార్కింగ్ పరిమితులు అమల్లో ఉంటాయని సీపీ సుమతి తెలిపారు.సభా ప్రాంగణం సమీపంలో వాహనాలకు అనుమతి ఉండదని, ప్రజలు కేవలం గుర్తించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపివేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం మొత్తం 12 ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటికి సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌లను కూడా అందుబాటులో ఉంచా మని చెప్పారు. ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, వరంగల్, భువనగిరి జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఉప్పల్ స్టేడియం పార్కింగ్ వద్ద నిలిపి, అక్కడి నుంచి మెట్రో రైళ్ల ద్వారా పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకోవాలని సూచించారు. సభ సందర్భంగా జనసమ్మర్థ నియంత్రణ, వైద్య సదుపాయాలు, అగ్నిమాపక భద్రత, అత్యవసర తరలింపు చర్యల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పార్టీ ప్రతినిధులు, మీడియా సిబ్బంది, అనుమతి పొందిన సభ్యులు కేటా యించిన ఎన్‌క్లోజర్‌లలోనే ఉండాలని, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. భద్రతా నిబంధనల ఉల్లంఘన, ప్రజాశాంతి భంగం లేదా సభకు అంతరాయం కలిగించే చర్యలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ విలువైన వస్తువులు, వ్యక్తిగత సామగ్రిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, అవసరం లేని సామాను తీసుకురాకూడదని, రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు లేదా యజమాని లేని సామాను కనిపిస్తే వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సీపీ.సుమతి విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ గృహలక్ష్మితో పేదలకు మహర్దశ

- డీసిసి ప్రధాన కార్యదర్శి కె. భాస్కర్ రెడ్డి

**న్యాల్‌కల్, మే 9 (జనం సాక్షి) :** ఇందిరమ్మ గృహలక్ష్మి పథకంతో అర్హులైన పేదలకు ఎంతో ప్రయోజనం చేకూర్తోందని, ఈ పాటికే మండలానికి 650 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని, తాజాగా రానున్న జూన్ మాసంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ గృహలక్ష్మి పథకం అందేలా ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ రెడ్డి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, న్యాల్ కల్ సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామిలు పేర్కొన్నారు. శనివారం.."ప్రజా పాలన ప్రగతి నివేదిక" కార్యక్రమంలో భాగంగా.. న్యాల్ కల్ లో రుక్మిణి భాయి, మైబలిలకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. స్థానిక అధికార, విపక్ష పార్టీ నాయకులు గిరీష్ రావు జోషి, ప్రవీణ్ కుమార్, చంద్రప్ప, తదితరులతో కలిసి ప్రారంభించారు. న్యాల్ కల్ గ్రామానికి 80 ఇండ్లు మంజూరు అవ్వగా.. 45 ఇండ్ల నిర్మాణాల పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని, 8 ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్ల నిర్మాణాలను చేపట్టుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో గృహలక్ష్మి కమిటీ అధ్యక్షుడు అడివప్ప, నాయకులు రఫీ యుద్దీన్, అంజి, కాశీనాథ్, గౌసుద్దీన్, విజయ్, బద్రు స్వామి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
10 మే 2026

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై దృష్టి సారించాలి
- విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మే 9 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ




ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ కోరారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ 66 శాతం పూర్తయిందని, పంచాయతీ కార్యదర్శుల సహకారం కూడా తీసుకొని, ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సెన్సెస్ పై సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు గూగుల్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ, డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిఐఈఓ హృదయ రాజ్, డీఈవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

## రైతు ఫార్మార్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**చిన్నశంకరంపేట, మే 9 (జనం సాక్షి) :** చెరువులను సంరక్షించుకోవాలని, వర్షాలు కురిసే వరకు చెరువులు కుంటల్లో పూడికతీతలు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ వాసుదేవ్, అన్నారు. శనివారం మండల పరిధి అంబాజీపేట పెద్ద చెరువు కట్టపై రైతులకు సాగునీటి పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన వ్యవసాయ అధికారి లక్ష్మి ప్రవీణ్, మాట్లాడుతూ, కూడుక పోయిన చెరువుల్లో మట్టి పూడిక తీతలు చేపట్టాలన్నారు. కూడుకు పోయిన కాలువలు తవ్వాలన్నారు. చెక్ డ్యాములు మర్మతులు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ ఏఈ వాసుదేవ్ మాట్లాడుతూ,సాగునీటి వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ మహేందర్ గౌడ్, సర్పంచులు సబిత రవి గౌడ్,సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి లక్ష్మి ప్రవీణ్, సాన సత్యనారాయణ, చెన్నగౌని కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- బాదేపల్లి పి.ఎ.సి.ఎస్ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం
- గత పాలకుల అవినీతి చిట్టా బయటపెడతాం
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, మే 9 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. బాదేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఎ.సి.ఎస్) నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పిఎసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్, వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లచే ప్రమాణస్వీకారం చేయించి నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రైతుల సమస్యలపై చిల్లర రాజకీయాలు చేయడం దురదృష్టకరమని, జడ్చర్ల మార్కెట్‌లో మక్కల కొనుగోలు విషయంలో మాజీ ఎమ్మెల్యే అనుచరులే రాజకీయాలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులను అవమానకరంగా మాట్లాడటంతో వారు రోడ్డుపై ధర్నా చేయాల్సి వచ్చిందని, ఆ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే కూర్చోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మార్కెట్ లో తప్పు చేసిన వ్యక్తిని వెంటనే సస్పెండ్ చేయించామని, రైతుల గౌరవాన్ని దెబ్బతీసే వారిని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. జడ్చర్ల నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూ కుంభకోణాలపై తాము వెనక్కి తగ్గబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత పాలకుల అవినీతి చిట్టాను త్వరలోనే పూర్తి ఆధారాలతో ప్రజల ముందుకు తెస్తామని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతు ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పిఎసిఎస్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక దిగుబడి




**తూప్రాన్, మే 9 (జనం సాక్షి) :** రైతులు పంట మార్పిడి చేయడంతో భూసారం పెరుగుతుందని, అధిక దిగుబడి వస్తుందని ఆరుతడి పంటల పైన దృష్టి సారించాలని తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ కీర్తన విట్టల్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో బాగంగా రైతు వారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు నూనె సంబంధిత పంటలను వేయాలని కోరారు. నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు యావపూర్ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమనికి జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ పరిశీలన అధికారి ఏడిఏ అనిత ఎంపీడీవో సతీష్, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి గంగమల్లు ఇరిగేషన్ డి ఈ శ్రీకాంత్ ,గ్రామ సర్పంచ్ యంజాలస్వామి మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణ డైరెక్టర్లు వెంకటేశం, శంకర్ రెడ్డి, నరసింహారెడ్డి తదితర గ్రామ సర్పంచ్ లు రైతులు హాజరయ్యారు. గ్రామాలలో చెరువుల పూడిక, కట్టు కాలువ మరమ్మతులకు నిధులు మంజూరయ్యేటట్లు చేయాలని పలువురు రైతులు కోరారు. మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి జింక మల్లేష్ మాట్లాడుతూ నిధులు వచ్చేవని చెరువులో పూడిక పెరిగిపోయిందని, దాన్ని తీయాలని అందుకు నిధులు కావాలని కోరారు. చుట్టుప్రక్కల నాలుగు చెక్ డాములు నిర్మించామని మరొక చెక్ డాం నిర్మించడానికి అధికారులు పనులు ప్రారంభించాలని కోరారు .తూములు నీటి వినియోగం పైన అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాట్లాడుతూ పంట మార్పిడి, పచ్చి రొట్టె పంటలు వేయాలని కోరారు. ప్రతి ఒక్కరు మట్టి పరీక్షలు చేపించి తగు మోతాదులో మందులు వాడాలని ఎక్కువ మొత్తానికి రసాయన ఎరువులు వాడటం తగ్గించాలని సేంద్రియ ఎరువులు వాడాలని అధిక దిగుబడి వస్తుందని నూతన కొత్త రకం వరి వంగడాలనువేయాలని హైబ్రిడ్ రకాల వల్ల అధిక దిగుబడి వస్తుందని అన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు ఏర్పాటు చేయా లని జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను అధికారులను ఆదేశించారు. శనివారం ధన్వాడ మండలంలోని మందిపల్లి , అప్పంపల్లి మరికల్ మండలంలోని తీలేరు, మద్దూరు మండ లంలోని పల్లె గడ్డ తాండ గుండుమాల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన వరి ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను నిల్వ చేసేందుకు షెడ్డు ఏర్పాటు చేయాలన్నారు.అలాగే కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు సౌకర్యాలను చూశారు. ఆయా కేంద్రాల నిర్వహణ,టర్పాలిన్ల లభ్యత, అవసరమైన హమాలీలను అందుబాటులో ఉంచుకోవా లన్నారు.గన్నీ బస్తాలు, ఇతర ఏమైనా తక్కువ అయితే వాటిని తెప్పించు కోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్ ఛార్జ్ లను ఆదేశించారు.

# మొక్కజొన్న రైతుల గోస పట్టదా..?

- జాతీయ రహదారిపై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆందోళన

**జడ్చర్ల, మే 9 (జనంసాక్షి) :** పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. జడ్చర్ల పత్తి మార్కెట్‌లో కొనుగోలు చేసిన మొక్కజొన్నను గోదాములకు తరలించడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ, శనివారం జడ్చర్ల – కల్వకుర్తి జాతీయ రహదారిపై గంగాపూర్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు దాదాపు 40 రోజులుగా మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండించడానికి రైతు ఎంత కష్టపడతాడో, అంతకంటే ఎక్కువ కష్టాన్ని ప్రభుత్వం అమ్ముకునే దగ్గర పెట్టిస్తోందని మండిపడ్డారు. జడ్చర్ల మార్కెట్‌లో పేరుకుపోయిన 40 వేల బస్తాల మొక్కజొన్నను తక్షణమే గోదాములకు తరలించాలని డిమాండ్ చేశారు. నాగసాల గోదాం దగ్గరకు 40 ట్రాక్టర్లు తీసుకెళితే కేవలం నాలుగు మాత్రమే అన్‌లోడ్ చేయడం వల్ల మిగతా రైతులు రాత్రంతా అక్కడే ఉండాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగుబడిపై అంచనా లేకపోవడం, గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలు, గోదాముల వంటి కనీస



వసతులపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ భయంకర పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఐదు రోజుల క్రితమే అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, ప్రజా పాలన అని చెప్పుకునే ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టడం తగదని హితవు పలికారు. ఇటువంటి చేతగాని ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని, ప్రభుత్వం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన పేర్కొన్నారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం హేయమైన చర్య



**మెదక్, మే 9 (జనం సాక్షి) :** 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని గౌరవ డివిజన్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం హేయమైన చర్య అని రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు ఎల్.మల్లారెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం రోజు మెదక్ లో మాట్లాడుతూ..1-09-2004 కు ముందు నోటిఫికేషన్ జారీ చేసి, అనంతరం నియామకాలు పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమలు చేస్తోందని వారు గుర్తు చేశారు. ఇదే విధంగా పలు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 57/4, 57/5 ప్రకారం అమలు చేశాయనీ మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని వారు తెలుపడం జరిగింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో టీజీజాక్ నాయకత్వం జరిపిన చర్చల్లో కూడా ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని వారు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కోర్టు తీర్పులను, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదని వారు విమర్శించారు. ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి, కోర్టు ఉత్తర్వుల ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల కోసం పి ఆర్ టి యు నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమములో డీఎస్సీ 2003 బాధితులు. తాళ్ళ శ్రీనివాస్, సుంకరి కృష్ణ, రాఘవేందరు, అంజిబాబు, ఇమ్మడి సంతోష్ కుమార్, శిరేగే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబెడితే చర్యలు

నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి

**కల్హేర్, మే 9 (జనం సాక్షి) :** వరి ధాన్యం రోడ్లపై ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, అందుకు సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కేసు నమోదు చేస్తామని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు మండలంలోని బాచేపలి ,మాసన్పల్లి గ్రామాల్లో స్థానిక పోలీసులతో కలిసి ఆయన పర్యటించి రైతులకు అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కల్హేర్ మండలంలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర



ఇబ్బందులు కావడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. అఆలాగే రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో , వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలని రైతులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డీఎస్పీ కోరారు.

## చెరువులను పరిరక్షించుకోవాలి



**మెదక్ జిల్లా బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** చెరువులను పరిరక్షించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ అన్నారు. శనివారం మెదక్ మండలంలోని కోముటూరు చెరువు కట్టపై ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, కార్యక్రమం ద్వారా చెరువుల పరిరక్షణ, పూడిక తీత, ముల్లా చెట్ల పొదల తొలగింపు, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. చెరువు బాగుంటేనే ఊరు బాగుంటుందని, చెరువు ద్వారా పంటలు పండి గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చెరువులను కాపాడుకొని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు అన్నారు. చెరువులను అక్రమాల నుండి, కాలుష్యం నుండి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాహాసిల్దార్ లక్ష్మణ్ బాబు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్ పాల్గొన్నారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

- ప్రభుత్వం రైతు పక్షపాతి
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

**మెదక్ జిల్లా బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ నగేష్,వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్, ట్రాన్స్పోర్ట్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ధాన్యం చివరి గింజలకు కొనాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఆలస్యం అవుతుందని, రైస్ మిల్లులో హమాలీల సమస్యను పరిష్కరించుకోవాలని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారు




తెలుపాలని అధికారులపై ఆగ్రహించారు. రైతులు ధాన్యం తరలింపు పై రోడ్లపైకి వచ్చిన సంఘటన, ధర్నాలు చేసిన విధానం, రైతు పెట్రోల్ బాటిల్ తో రోడ్ల పైకి వచ్చారు ఇలాంటి సంఘటనకు ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలన్నారు. తమది రైతు ప్రభుత్వమని, రైతు సమస్యలపై తప్పకుండా గళం ఎత్తుతామన్నారు. ముఖ్యమంత్రి ,మంత్రులు 24 గంటలు రైతుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు వివరించారు. తాను ప్రజలు, రైతులు ఎన్నుకుంటే వచ్చానని వారికోసం ఎవరినైనా ప్రశ్నిస్తానన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలను స్పీడ్ అప్ చేయాలని అధికారులు ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ సజావుగా నిర్వహిస్తామని, హమాలీల సమస్యను పరిష్కరిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపడతామన్నారు. నాలుగైదు రోజుల్లో మరింత స్పీడ్ అప్ చేసి రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియను సైతం త్వరిత గతిన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధికా భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లారంలో లీకేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు

- జనంసాక్షి పత్రిక కథనానికి స్పందన






**మల్హర్, మే 09 (జనంసాక్షి) :** మండలంలోని మల్లారం గ్రామంలో నెలకొన్న పైప్‌లైన్ లీకేజీ సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని లింగన్నపేట శ్యామల ఇంటి ముందు పైప్‌లైన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని జనం సాక్షి దినపత్రికలో వెలువడిన కథనంపై మల్లారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు యాదవ్ తక్షణమే స్పందించారు. పంచాయతీ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపి, లీకేజీ పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారం సర్పంచ్ మేకల రాజయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ ముందుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. తమ సమస్యను పత్రికా ముఖంగా వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి కృషి చేసిన జనంసాక్షి దినపత్రిక వార్తపై సానుకూలంగా స్పందించి మరమ్మతులు చేయించిన అధికారులకు లింగన్నపేట శ్యామల తో పాటు స్థానికులు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం

- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 09(జనంసాక్షి) :** 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. **https://se.census.gov.in** అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు. దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## హన్మకొండ జిల్లా ఒక్కరోజే గడువు

- స్వీయ జనగణన తప్పనిసరి
- ప్రతి కుటుంబం వెంటనే వివరాలు నమోదు చేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ ప్రతినిధి మే 9 (జనం సాక్షి) :** 2027 జనగణనలో భాగంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ స్వీయ జనగణనకు ఈ నెల 10వ తేదీ రాత్రి 12 గంటల వరకు మాత్రమే అవకాశం ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ తప్పనిసరిగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. ప్రజలు ఇంటి వద్ద నుంచే సులభంగా **https://se.census.gov.in** వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియను సులభంగా పూర్తి చేయవచ్చని, తమకు నచ్చిన భాషను ఎంపిక చేసుకుని కుటుంబ వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన ఈ స్వీయ జనగణన కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగియనున్నందున, ఇంకా నమోదు చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జనగణన ప్రక్రియలో భాగంగా ముందుగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి స్థాయి జనగణన చేపడతారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారని తెలిపారు. ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యాక ఎన్యుమరేషన్ ఐడి లభిస్తుందని, ఆ ఐడీ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని తెలిపారు. స్వీయ జనగణన కు ఒక్కరోజే గడువు మిగిలి ఉన్నందున, హన్మకొండ జిల్లా ప్రజలందరూ బాధ్యతగా పాల్గొని ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.

## జనగణనపై అవగాహనకే మారథాన్



- జెండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్ బ్యూరో, మే08 (జనంసాక్షి) :** దేశాభివృద్ధికి కీలకమైన జనగణన ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్మల్ పట్టణంలో భారీ మారథాన్ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ఈ మారథాన్‌ను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, దేశ ప్రగతి, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి జనగణన అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అని తెలిపారు. జనాభా లెక్కల ఆధారంగానే ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రణాళిక చేపడుతుందని వివరించారు. జనగణన-2027లో భాగంగా ప్రతి పౌరుడు స్వీయ గణన విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని కోరారు. అవగాహన లేని వారికి ఇతరులు సహకరించాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సి పి ఓ జీవరత్నం, డి వై ఎస్పీ ఓ కాంత్ రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ఎల్‌డీఎం రామ్ గోపాల్, డీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ పీజీ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- బాలల సంరక్షణ చట్టాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, మే 08(జనంసాక్షి) :** బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని, బాలల సంరక్షణ చట్టాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన వివిధ రకాల గోడ పత్రికలు, కరపత్రాలు సంబంధించిన ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారిణి ఈపి ప్రేమలత అధ్యక్షతన జరుగగా జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి మంత్రి సీతక్క ఈ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజం సాంకేతికతతో ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇప్పటికీ సమాజంలో బాల్య వివాహాలు జరిపించే చర్యలు సామాజిక అభివృద్ధికి గొడ్డలి పెట్టు అని అన్నారు. వెనుకటి రోజుల్లో ఏ సౌకర్యాలు లేని రోజుల్లో ఎంతో మంది తల్లితండ్రులు తమ ఆడ పిల్లలను చదివించారని, కానీ ప్రస్తుతం ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి ఎంతో గొప్ప స్థాయికి ఎదిగేలా ప్రభుత్వాలు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ కొంతమంది తల్లితండ్రులు మాత్రం తమ పిల్లలకు చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు జరిపించడం చాలా బాధాకరం అని అన్నారు. ముఖ్యంగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సిబ్బంది బాల్య వివాహాలను ఆపుతున్న సందర్భంలో చాలా మంది మాకు చట్టం తెలియదు అని అంటున్నారని, కానీ చట్టం గురించి తెలుసుకొని, మనం చేసే ప్రతీ పనీ చట్టానికి లోబడే ఉండేలా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత ఈ సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని అన్నారు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయిన విజయవంత అవుతుందని, కావున అంతా కలిసి మన ములుగు జిల్లాను బాలలకు స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దుదామని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిషేధం, బాలల పై లైంగిక వేధింపుల నిరోధం, చట్ట బద్ధమైన దత్తత విధానాలు మరియు చిన్నారులకు ఆపదలో చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ కి కాల్ చేసి సమాచారం అందించాలని అలాగే వివిధ బాలల పరిరక్షణ అంశాలపై రూపొందించిన ఈ గోడ పత్రికలు, కరపత్రాలు మరియు బ్రోచర్లు అర్థ వంతంగా ప్రజలకు సులువుగా అర్థమయ్యేలాగా రూపొందించారని సిబ్బందిని అభినందించారు. ఈ ప్రచార సామాగ్రిని వినియోగించి ప్రజలకు బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై మరింత అవగాహన కలిగించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా ల, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్ మహేందర్ జీ, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## వారంలోపు ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య
- ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



**స్టేషన్ ఘనపూర్, మే 09 (జనంసాక్షి) :** వారం రోజుల లోపు కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేయకపోతే ప్రభుత్వా న్ని నిలదీస్తామని తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ము ఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. చిల్పూర్ మండలం ఐకెపి సెంటర్ ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సందర్శించి రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపైన కూర్చొని ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భం గా డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ ధాన్యం కొను గోలు కేంద్రాలు ప్రారంభించి సుమారు నెల కావస్తు న్నప్పటికీ ఇప్పటివరకు రైతులకు గన్ని బ్యాగ్స్ , ఇవ్వడం లేదు కాంట వేయడం లేదు, లారీలలో ధాన్యాన్ని తరలించడం లేదని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులకు వారి ఖాతాలలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని, నిన్నటి రోజు శివునిపల్లిలో వరి ధాన్యం దగ్గరికి వెళ్లి వచ్చి ఎండ దెబ్బ తగిలి ఒక రైతు కూడా మరణించడం జరిగిందని, కానీ కాంగ్రె స్ ప్రభుత్వానికి నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని ఇక్కడ ఉన్న స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతుల ధాన్యం కొనుగోలు చేపించకుండా, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి రైతు మేళాలో సంబరాలు జరుపుకుంటున్నాడని అన్నారు. రైతులకు ఏమి న్యాయం చేశారో తెలియజేయాలని దొంగే దొంగ, దొంగ అన్నట్లుగా కెసిఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం వరప్రదాయని అని పొగిడిన కడియం శ్రీహరి కెసిఆర్ ని తిట్టిపోస్తున్నాడని తెలిపారు. వారం రోజుల లోపు ధాన్యం మొత్తం కొనుగోలు చేయక పోతే ప్రభుత్వం నిలదీస్తాము ధర్నాలు రాస్తారోకో లు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ మాలోతు రమేష్ నాయక్ నియోజకవర్గ కోఆర్డినే టర్ కేసిరెడ్డి మనోజ్ రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు,జిల్లా నాయకులు వలెందర్ రెడ్డి, చిల్పూరు గ్రామ ఉపసర్పంచ్ రాజారపు రంజిత్, మండల నాయకులు నారగోని రాజు, మాజీ ఉపసర్పంచ్ పిట్టల మహేందర్, నలిమెల కుమార్, సత్తయ్య, కిషన్, శేఖర్, సూర రవి, మహిళా రైతులు పాల్గొన్నారు.



## మొక్కజొన్న పంట దగ్ధం

- రూ. 2 లక్షల 50 వేల నష్టం

**చెన్నారావుపేట, మే 9 (జనంసాక్షి):** ప్రమాదవశాత్తు మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం...ఇదే గ్రామానికి చెందిన బొమ్మెర సౌందర్య- వీరస్వామి రైతు దంపతులు 2.29 ఎకరాలలో మొక్కజొన్న పంటను వేశారు. చేతికి అందివచ్చిన మొక్కజొన్న పంట శనివారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు కాలి బూడి దైంది. దీంతో ఈ ప్రమాదంలో రూ. 2 లక్షల 50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు దంపతులు బొమ్మెర సౌందర్య వీరస్వామిలు రోధిస్తూ తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహా యం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం..

- ఫైర్ సిబ్బంది చేరుకోలేక రూ.50 వేల ఆస్తి నష్టం



**మహబూబాబాద్ ప్రతినిధి, మే 9 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా పరిధిలోని శనిగాపురం బోడ తండాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బోడ తండాకు చెందిన గుగులోతు మన్సూర్ అనే వ్యక్తి ఇంటి ముందు నిప్పు అంటించడంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. అగ్నిప్రమాదం తీవ్రరూపం దాల్చడంతో ఇంటి ముందు నిల్వ ఉంచిన సుమారు ఐదు ట్రాక్టర్ల పొయ్యిల కర్రలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో దాదాపు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తండాకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకోలేకపోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికులే స్వయంగా మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర సేవలు అందేలా రోడ్డు సౌకర్యాలు కల్పించాలని తండా వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పురాణ కథలతో మాలలను చైతన్య పరచిన భక్తి పరవశం

- ముగిసిన శివ పార్వతుల కళ్యాణం, ఆది పురాణం, శివకథ మాల చరిత్ర



**గూడూరు, మే9 (జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెంద్రుగూడెం గ్రామంలో గత మూడు రోజులుగా మాల కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కథ నిర్వాహకులు ఎడ్ల శ్రీనివాస్, పస్తాం రవి, పస్తాం సమ్మయ్య, వాగుమడి రాజయ్య, ఎడ్ల సారయ్య వారితో పాటు మరికొంత మంది హాజరై శివపార్వతుల కళ్యాణం,అది పురాణం,శివకథ మాల వివిధ పురాణ గాథల కథా కాలక్షేప కార్యక్రమం భక్తి భావనల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువత, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. కథకులు తమ ప్రత్యేక శైలిలో శివపార్వతుల వివాహ ఘట్టాన్ని హృద్యంగా వివరిస్తూ భక్తులను అలరించారు. పరమశివుడి తపస్సు,పార్వతీదేవి భక్తి, హిమవంతుని యాగశాల వైభవం, దేవతల సంబరాలు వంటి అంశాలను భావోద్వేగపూర్వకంగా వినిపించారు. మహాభారతం, రామాయణం, భాగవతంలోని ఎన్నో విశిష్ట ఘట్టాలను కూడా వివరిస్తూ పురాణ సంస్కృతిని ప్రజలకు చేరవేశారు. కథా కాలక్షేపంలో భాగంగా భక్తి గీతాలు, హారతులు,వాద్య విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కథకులు చెప్పిన నీతి సందేశాలు యువతలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ అంతరించి పోతున్న కథలకు,ఊపిరి పోస్తూ మాలలను చైతన్యం పరిచే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో పురాణ గాథల పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మాల కులస్తులు ఐక్యంగా ముందుకు వచ్చి భక్తి,సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే దిశగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ముందుండి సహకరించిన మాల సంఘం నాయకులు బేతం లక్ష్మినారాయణ,సదువాల యాకస్వామి, పత్తేం ఉపేందర్, దోమ వెంకన్న,పూల వెంకటస్వామి,గోనె శోభన్, దోమ సారయ్య,చీదురు హరీష్,బత్తుల యాదగిరి దోమ ఉపేందర్,గుండు శ్రీకాంత్,మాల కులస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటి పనోళ్ల వివరాలు పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలి

- వర్కర్ల నియామకంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 09 (జనంసాక్షి):** జిల్లాలో ఇంటి యజమానులు తమ ఇళ్లలో పనిచేసే వంటమనుషులు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు, సహాయకులు తదితరుల పూర్తి వివరాలను తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. అద్దె గదులు ఇచ్చే యజమానులు కూ డా అద్దెదారుల వివరా లను ముం దుగానే పోలీసులకు తెలి యజేసి వెరిఫికేషన్ చేయిం చుకోవాలని తెలి పారు. భద్రతా పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇంటి పనుల కోసం నియమించుకునే వ్యక్తుల ఆధార్ కార్డు, ఫోటో, మొబైల్ నంబర్, ప్రస్తుత చిరునామా వంటి వివరాలను నమోదు చేయడం ద్వారా అనుమానాస్పద ఘటనలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో నియమించుకునే సందర్భాల్లో వ్యక్తుల పూర్తి ధృవీకరణ అనంతరమే పనిలోకి తీసుకోవాలని సూచించారు. ఇంటి యజమానులు ముందస్తుగా వివరాలు నమోదు చేయిస్తే ఎటువంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుందని, ప్రజలకు మరింత సురక్షిత వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని ఆమె స్పష్టం చేశారు.

## స్నానం కోసం వెళ్ళి కోనేరులో మునిగి యువకుడి మృతి



**కుంటాల, మే 09 (జనంసాక్షి):** కుంటాల మండల కేంద్రానికి చెందిన మూసరి శ్రీనివాస్ (25) కుంటాలలోని కోనేరులో మునిగి మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. స్థానికుల వివరాల ప్రకారం శ్రీనివాస్ కోనేరుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో జారి పడగా ఈత రాక మునిగిపోయినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే యువకుడు మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## రైతులు పంటల సాగును శాస్త్రీయ పద్ధతిలో చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**శాయంపేట, మే 9 (జనం సాక్షి) :** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలలో భాగంగా నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శాయంపేట మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి నీటి వినియోగం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకుంటూ రైతులు పంటల సాగును శాస్త్రీయ పద్ధతుల్లో కొనసాగించాలని సూచించారు. నీటి విలువను గుర్తించి ఆయకట్టు ప్రాంతాల అభివృద్ధి, కాలువల సంరక్షణ, నీటి పంపిణీ సమర్థవంతంగా జరిగితే రైతులకు మరింత లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కిడ్నీ వైఫల్య సమస్యకు యశోద ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స

- ప్రాణదాతలుగా నిలుస్తున్న మలక్‌పేట యశోద డాక్టర్లు
- అత్యంత తీవ్రతరం వ్యాధులను పరిష్కరిస్తున్న
- యశోద మలక్పేట్ హాస్పిటల్ వైద్య బృందం




**దేవరకొండ, మే 9 (జనం సాక్షి) :** దేవరకొండకు చెందిన 32 ఏళ్ల చిన్న చక్కని పద్మ కు ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో కూడిన రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్‌ను సమయానికి గుర్తించి ప్రారంభ దశలోనే ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స అందించి డయాలసిస్ నుండి విముక్తి కలిగించామని హైదరాబాద్ మలక్పేట్ యశోద హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం దేవరకొండ పట్టణం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మ జ్వరం, వణుకులు, అనంతరం శరీరమంతా వాపులతో బాధపడుతూ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్‌లో చేరిన వెంటనే డా. చెతన్ వీరమనేని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ ఁ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో రోగికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారని,కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో వ్యాధి మూలకారణాన్ని గుర్తించేందుకు అల్ట్రాసౌండ్ మార్గదర్శకత్వంలో రియల్‌టైమ్ రీనల్ బయాప్సీ నిర్వహించారని తెలిపారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం మెరుగుపడిందని, బయాప్సీ ప్రక్రియ ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తైందని,శరీర వాపులు తగ్గి రోగి పరిస్థితి స్థిరపడిందని,అవసరమైన మందులు, ఆహార నియమాలు, ఫాలోఅప్ సూచనలతో డిశ్చార్జ్ చేశారని అన్నారు.ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో కూడిన రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్‌ను సమయానికి గుర్తించి ప్రారంభ దశలోనే ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స అందించడం ఎంతో ముఖ్యమని లేకపోతే కిడ్నీలు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని తెలిపారు. డయాలసిస్ ప్రారంభించిన రోగుల్లో సుమారు 50--60 శాతం మందికి, సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే దీర్ఘకాలిక డయాలసిస్ అవసరం లేకుండా కోలుకునే అవకాశం ఉంటుందని సూచించారు.ముఖ్యంగా యువ రోగుల్లో కిడ్నీ సమస్యను ముందుగానే గుర్తించి సరైన వైద్య నిర్వహణ అందిస్తే, డయాలసిస్ ప్రారంభించినప్పటికీ లేదా క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉన్నప్పటికీ తిరిగి కోలుకునే అవకాశాలు చాలా ఉంటాయని తెలిపారు.చికిత్స ద్వారా పూర్తిగా నయం అయ్యే కిడ్నీ వ్యాధులపై అవగాహన అవసరమని,సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్స అందిస్తే చాలామంది రోగులు పూర్తిగా కోలుకుని డయాలసిస్ అవసరం లేకుండా సాధారణ జీవితానికి తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కేసు మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక నెఫ్రాలజీ సేవలు, సమగ్ర వైద్య సదుపాయాలు మరియు ఖచ్చితమైన నిర్ధారణ సామర్థ్యాన్ని మరోసారి ప్రతిబింబించింది. ఆక్యుట్ కిడ్నీ ఇంజరీతో పాటు రాపిడ్లీ ప్రోగ్రెసివ్ రీనల్ ఫెయిల్యూర్ వంటి క్లిష్ట పరిస్థితులను ప్రారంభ దశలోనే గుర్తించి, సమయానికి అధునాతన పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం ద్వారా రోగిని స్థిరపరచడంలో ఆసుపత్రి వైద్య బృందం విజయవంతమైందని,ప్రత్యేక నెఫ్రాలజీ పర్యవేక్షణ, రీనల్ బయాప్సీ వంటి ఆధునిక నిర్ధారణ విధానాలు, అనుభవజ్ఞులైన వైద్యుల సమన్వయం ఈ విజయానికి కీలకంగా నిలిచాయని అన్నారు. అత్యాధునిక సాంకేతికత, ఆధునిక నెఫ్రాలజీ విభాగం, నిపుణులైన వైద్య బృందం, మరియు రోగి–కేంద్రిత వైద్య విధానాలతో క్లిష్టమైన కిడ్నీ వ్యాధులను కూడా సమర్థవంతంగా చికిత్స చేయగల సామర్థ్యం తమ ఆసుపత్రికి ఉందని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్ డైరెక్టర్ శ్రీ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, మరియు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో సురక్షితమైన, నాణ్యమైన మరియు సమయోచిత వైద్య సేవలను అందించడంలో తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని వారు స్పష్టం చేశారు.మరిన్ని వివరాలకోసం సంప్రదించాల్సిన నెంబర్లు ఎ. వాసుకిరణ్ రెడ్డి – 97057 71230 / 99499 98378 లను సంప్రదించాలని కోరారు.

## ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుండి వచ్చేటటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**నిజామాబాద్ క్రైం, మే 9 (జనం సాక్షి) :** ఇతర రాష్ట్రాలు, జిల్లాలు లేదా ప్రాంతాల నుండి వచ్చి పని చేసుకునే కార్మికులు , అద్దెదారులు, ఉద్యోగుల విషయంలో గృహ యజమానులు, వ్యాపార సంస్థలు, కాంట్రాక్టర్లు మరియు యాజమాన్యాలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. వారి పూర్తి వివరాలు సేకరించడం ద్వారా భద్రతా పరమైన సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు.ఉపాధి కోసం వచ్చే వ్యక్తుల పేరు , శాశ్వత చిరునామా , ఆధార్ కార్డు ప్రతులు , మొబైల్ నంబర్లు , కుటుంబ వివరాలు , పని చేసే స్థలం , వచ్చిన తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసి తమ వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా వారి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. అద్దె ఇళ్లలో నివసించే వారు, నిర్మాణ పనుల్లో పనిచేసే కార్మికులు , హోటళ్లు , లాడ్జీలు , పరిశ్రమలు మరియు ఇతర వ్యాపార సంస్థల్లో పనిచేసే వారి వివరాలను యాజమాన్యాలు నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా , వారి ప్రవర్తనలో మార్పులు గమనించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల అప్రమత్తతతోనే నేరాలను అరికట్టడం , శాంతిభద్రతలను కాపాడడం సులభమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించి సమాజ భద్రతకు తోడ్పడాలని అన్నారు.

## అంతర్ రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు అరెస్ట్

- 104.5 కిలోల గంజాయి స్వాధీనం
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్లగొండ ప్రతినిధి, మే 9 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠాను ఛేదించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్న పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో కేతేపల్లి ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో కొర్లపహాడ్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న HP-38-F-3447 నంబర్ గల అశోక్ లేలాండ్ లారీని పోలీసులు అడ్డుకున్నారు.పోలీసులు తనిఖీలు చేయబోతుండగా లారీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లారీ వెనుక భాగాన్ని పరిశీలించగా నాలుగు ప్లాస్టిక్ బస్తాల్లో బ్రౌన్ టేప్‌తో ప్యాక్ చేసిన 103 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. మొత్తం 104.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.52.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.అరెస్టు చేసిన వారిలో జమ్మూకు చెందిన పరంవిర్ సింగ్ అలియాస్ లంబు (42), ముంబైకి చెందిన షా అలం పర్వేష్ ఆలం అన్సారి (37) ఉన్నారు. మరో ముగ్గురు నిందితులు బిక్రం సింగ్, ఫరూక్ అలియాస్ రాజుభాయి, భావు అలియాస్ కేదర్ ప్రధాన్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.విచారణలో ఒడిశా రాష్ట్రంలోని గంజం జిల్లా అడవుల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ముంబైకి తరలిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. గతంలో కూడా రెండు సార్లు ఇదే తరహాలో గంజాయి రవాణా చేసినట్లు విచారణలో వెల్లడైంది.పోలీసులు 104.5 కిలోల గంజాయితో పాటు అశోక్ లేలాండ్ లారీ, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయి అని హెచ్చరించారు.ఈ కేసును డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో, నకిరేకల్ సీఐ హరిబాబు ఆధ్వర్యంలో కేతేపల్లి ఎస్సై సతీష్ మరియు పోలీసు సిబ్బంది ఛేదించారు.భారీ మొత్తంలో గంజాయిని పట్టుకున్న పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి

- టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రగుడు ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం కల్పించిన సౌకర్యాలు, దిగుబడి వివరాలు, హమాలీల గురించి ఆరా తీశారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే జాప్యం చేయకుండా తూకం వేయాలని, అందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు,ఎంత వరకు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు వాహనాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించే అవకాశం ఉందని, జాప్యం చేయకుండా తరలించాలని, మిల్లుల్లో ధాన్యం బస్తాలు త్వరగా అన్ లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు.ఇట్టి తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.

## గంగుల కమలాకర్ గృహనిర్బంధం



**కరీంనగర్ టౌన్, మే 9 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన కరీంనగర్ బంద్ నేపథ్యంలో శనివారం నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంద్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పోలీసులు గృహనిర్బంధం చేశారు. గంగుల నివాసం వద్ద భారీగా మోహరించిన పోలీసులు ఆయనను బయటకు వెళ్లకుండా అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.ఇది మా ఇల్లు.. మమ్మల్ని ఎలా నిర్బంధిస్తారు అంటూ గంగుల పోలీసులను ప్రశ్నించారు.దొంగలను పట్టుకోవడం చేత కాదు కానీ, మమ్మల్ని పట్టుకుంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బంద్‌ను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను ఉపయోగిస్తోందని గంగుల కమలాకర్ ఆరోపించారు. మరోవైపు బంద్ ప్రభావంతో కరీంనగర్ నగరంలోని పలు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నగర వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ అరెస్ట్



**కరీంనగర్ టౌన్, మే 9 (జనం సాక్షి) :** కరీంనగర్‌లో రాజకీయ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. బీజేపీ దాడులకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బంద్ పిలుపుతో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు వ్యాపార సంస్థలు, షాపులను స్వచ్ఛందంగా మూసివేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ క్రమంలో మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి గంగుల కమలాకర్ నివాసానికి బయల్దేరిన రవీందర్ సింగ్‌ను పోలీసులు గంగుల ఇంటి సమీపంలో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రవీందర్ సింగ్ అరెస్ట్‌కు నిరసనగా బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడులు చేసిన వారిని వదిలేసి... నిరసన తెలిపే ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సర్ధార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా అణచివేయాలని చూస్తున్నారు. కరీంనగర్‌లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టింది ఎవరో ప్రజలకు తెలుసు. ఉద్యమాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరు అని హెచ్చరించారు.

## సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 9 (జనం సాక్షి) :** సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.శనివారం ఉదయం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.జనగణనపై క్షేత్ర స్థాయి ప్రచారం, అవగాహన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ కూడలి నుండి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన 2కె వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసా చారి, మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా,జిల్లా అధికారులు అఫ్జల్ బేగం, సౌజన్య, లక్ష్మీరాజం, స్వప్న, తహసీల్దార్ జయంత్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఎస్ ఓ సంపత్, జనగణన సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ద్వారా స్వీయగణన నమోదు చేసుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి, మే 9 (జనంసాక్షి) :** స్వీయ జనగణన నమోదుకు ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు నేటి వరకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు.ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని,జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు.ఆన్ లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు.ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని సూచించారు.

## మాజీ ఎంపీ బీఎన్ రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం



**సూర్యాపేట, మే 9 (జనంసాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహ రెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎంపీ భీమిరెడ్డి నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న ఆయన విగ్రహంకు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ భీమిరెడ్డి నరసింహారెడ్డి సేవలను గుర్తుచేసుకున్నారు.తెలంగాణ నేల గర్వించదగ్గ గొప్ప విప్లవకారుడు, ప్రజా నాయకుడు భీమిరెడ్డి అని అన్నారు.నిజాం వ్యతిరేక పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. పేద ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.పార్లమెంట్ సభ్యుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి, సామాన్యుల గొంతు వినిపించడానికి ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఎన్ రెడ్డి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.నేటి తరానికి భీమిరెడ్డి నరసింహారెడ్డి పోరాట పటిమ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని, ఆయన చేసిన సేవలు సూర్యాపేట ప్రజల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఎన్ రెడ్డి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్




**దేవరకొండ, మే 9 (జనం సాక్షి) :** యాసంగి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి,దేవరకొండ నియోజక వర్గ పరిధిలో 15 రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్. బి చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్,ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 457 కొనుగోలు కేంద్రాల ద్వారా 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొత్తం 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని ముందస్తు అంచనా వేసినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన ధాన్యం కొనుగోళ్లు వచ్చే 15 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. దేవరకొండ డివిజన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో మిల్లర్ల సమన్వయం ద్వారా ధాన్యం వేగంగా మిల్లులకు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన చోట హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు, అదనంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం కళ్లాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా త్వరితగతిన తరలింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ487 కోట్లు చెల్లించామని తెలిపారు. డివిజన్ పరిధిలోని 12 మిల్లులకు చెందిన మిల్లర్లు ధాన్యం సేకరణలో పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని పేర్కొంటూ అదనంగా 30 లారీలను పెంచామని, ప్రస్తుతం మొత్తం 100 లారీలతో 24 గంటల వ్యవధిలో ధాన్యం అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని,ఒక వేళ వర్షానికి ధాన్యం తడిచినా కొంటుందని తెలిపారు. నియోజకవర్గానికి ఈసారి సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. డిండి ప్రాంతంలో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయని, అక్కడినుండి వచ్చే ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని 12 మిల్లుల మిల్లర్లు ధాన్యం స్వీకరణలో భాగస్వామ్యం కావాలని కోరారు.ప్రస్తుతం ఉన్న 70 లారీలు సరిపోకపోతే మరిన్ని లారీలు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏ కేంద్రంలో ధాన్యం ఎక్కువగా ఉంటే అక్కడికి వెంటనే లారీలు పంపిస్తామని చెప్పారు. వచ్చే పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందని. మిల్లర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గింజ కొనుగోలు చేసి రైతులను ఆదుకోవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంచార్జ్ ఆర్డిఓ రమణారెడ్డి ,డిఎస్ఓ వెంకటేష్, డిఎం రాంపత్తి నాయక్, డిసిఓ పత్యా నాయక్ , మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, డిటి ముబీన్,రైస్ మిల్లర్ల తరఫున వెంకన్న,శ్రీనివాస్,అధికారులు,తదితరులు హాజరయ్యారు.




# 'రాయల్ ఎన్‌ఫీల్డ్'..

## ఈ బ్రాండ్ చాలా స్ట్రాంగ్ గురూ..

**న్యూఢిల్లీ:**ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ అరుదైన ఘనతను సాధించింది. ప్రపంచంలోనే మూడో అత్యంత దృఢమైన ఆటోమోటివ్ బ్రాండ్‌గా అవతరించింది. ఈ క్రమంలో ఇది ఫెరారీ, ఆడి వంటి గ్లోబల్ దిగ్గజాలను సైతం వెనక్కి నెట్టి.. బీఎండబ్ల్యూ, టయోటా సరసన నిలిచింది. ఈ మేరకు బ్రాండ్ ఫైనాన్స్ ఆటోమోటివ్ ఇండస్ట్రీ నివేదిక వెల్లడించింది. ఇందులో భాగంగా మొదటి రెండు స్థానాల్లో టయోటా, బీఎండబ్ల్యూ నిలవగా, రాయల్ ఎన్‌ఫీల్డ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆడి నాలుగో, ఫెరారీ ఏడో స్థానాలకు పరిమితమయ్యాయి. నివేదిక ప్రకారం.. రాయల్ ఎన్‌ఫీల్డ్ 100 బ్రాండ్ స్ట్రెంగ్త్ ఇండెక్స్ పాయింట్లకు గానూ 88.9 పాయింట్లు సాధించింది. ౦౦౦ రేటింగ్ కూడా పొందింది. కంపెనీ బ్రాండ్ విలువ సైతం 30% పెరిగి 1.2 బిలియన్ డాలర్లకు (భారత కరెన్సీ ప్రకారం రూ.11,337 కోట్లు) చేరుకుంది. ప్రస్తుతం 80కి పైగా దేశాల్లో ఈ కంపెనీ తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా దీనికి 3,200కి పైగా రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి. యూరప్, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లో ఈ బైక్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఒకప్పుడు రెట్రో మోటార్ సైకిల్ (పాతకాలపు లుక్) తయారీకి ప్రసిద్ధి చెందిన కంపెనీ నేడు బ్రాండ్ వాల్యూతో అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతోంది. హంటర్ 350, సూపర్ మెటోర్ 650, కొత్త హిమాలయన్ 450 వంటి మోడల్స్ కొనుగోలుదారులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు మరిన్ని భారతీయ కంపెనీలు కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. టాటా మోటార్స్ 5, మహీంద్రా 25, మారుతీ సుజుకి 34 స్థానాల్లో నిలవడం గమనార్హం.

# ఆద్యంతం నష్టాల్లోనే..

**సూచీలకు ఉద్రిక్తతల నష్టాలు**

**రూ.1.50 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.4,110.60 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు.. రూ.6,748.13 కోట్లు**



**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరగడంతో, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడొచ్చనే ఆందోళనల వల్ల దేశీయ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలకు తోడు విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగడం సెంటిమెంటును బలహీనపర్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 71 పైసలు పెరిగి 93.51 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1% పెరిగి 101.01 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.51 లక్షల కోట్లు తగ్గి రూ.473.46 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,631.94 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 77,844.52) ఆరంభమైంది. అదే ధోరణిలో స్వల్ప శ్రేణికి పరిమితమై కదలాడింది. ఒక దశలో 77,146.43 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 516.33 పాయింట్ల నష్టంతో 77,328.19 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 150.50 పాయింట్లు కోల్పోయి 24,176.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,126.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 24,253.80 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 414.69 పాయింట్లు, నిఫ్టీ 178.60 పాయింట్లు చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో సగానికి పైగా కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.84%, బజాజ్ ఫైనాన్స్ 1.8%, యాక్సిస్ బ్యాంక్ 1.78%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.62%, ఎల్అండ్‌టీ 1.22%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.22%, టాటా స్టీల్ 1.2% నష్టపోయాయి. టైటన్ 4.76%, ఏషియన్ పెయింట్స్ 2.8%, అదానీ పోర్ట్స్ 1.58%, ఇన్ఫోసిస్ 1.44% చొప్పున పెరిగాయి. జనవరి- మార్చి త్రైమాసిక ఫలితాల ప్రభావంతో బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 6.62% నష్టపోయి రూ.1,019.55 వద్ద ముగిసింది. ఇక టైటాన్ షేరు 4.76% పెరిగి రూ.4,513.40 వద్ద ముగిసింది. డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్ 'కిష్ట్'ను నిర్వహిస్తున్న ఆన్ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్ లిమిటెడ్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన రోజే రాణించాయి. ఇష్యూ ధర రూ.171 కాగా, శుక్రవారం బీఎస్ఈలో ఈ షేరు 11.69% అధికంగా రూ.191 వద్ద నమోదైంది. ఆ తర్వాత 32.95% వరకు పెరిగి రూ.227.35 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 21.87% లాభంతో రూ.208.40 వద్ద ముగిసింది.

# ఐపీఎల్ సీజన్..

## బర్గర్ స్పీడ్‌కు బిర్యానీ ఔట్

**న్యూఢిల్లీ**ఎప్పుడు ఏ ఫుడ్ ట్రెండ్ చూసినా బిర్యానీదే అగ్రస్థానం. ఆన్‌లైన్ డెలివరీల్లో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుంది. అలాంటిది ఐపీఎల్-2026 సీజన్‌లో ఆ ఫుడ్ ట్రెండ్ కాస్త మారింది. బిర్యానీని వెనెక్కి నెట్టి బర్గర్ ముందు వరుసలోకి చేరింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం జియోహాట్‌స్టార్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు వీక్షిస్తున్న సందర్భంలో ఎక్కువగా ఆర్డర్ అయిన వంటకంగా బర్గర్ నిలిచింది. ఈ విషయాన్ని ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ తన నివేదికలో పేర్కొంది. మ్యాచ్ సందర్భంగా ఓ కస్టమర్ ఒకేసారి 100కి పైగా బర్గర్‌లను ఆర్డర్ చేయడం విశేషం. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం సమయంలో క్రీడాభిమానుల కోసం జియోహాట్‌స్టార్, స్విగ్గీ వినూత్న ప్రయత్నం చేశాయి. ఇందుకోసం ఇరు సంస్థలు జట్టు కట్టాయి. ఇందులో భాగంగా ఫుడ్ ఆర్డర్ కోసం కస్టమర్లు తమ ప్లాట్‌ఫాంను వీడకుండా ఇన్-యాప్ ఫుడ్ ఆర్డరింగ్ సదుపాయాన్ని జియోహాట్‌స్టార్ తీసుకొచ్చింది. ఇలా అత్యధిక ఆర్డర్లు అందుకున్న ఆహారపదార్థంగా బర్గర్ నిలిచింది. ఓ కస్టమర్ 100పైగా బర్గర్లను ఆర్డర్ చేయగా.. మరో కస్టమర్ ఇప్పటివరకు 34 వంటకాలను విడిగా ఆర్డర్ చేశాడు. ఈ ఫీచర్ ద్వారా ఇంకో కస్టమర్ ఫుడ్ ఆర్డర్ కోసం సుమారు రూ.7 వేలు ఖర్చు చేయగా.. లైవ్ మ్యాచ్ ఆఫర్లలో భాగంగా మరో కస్టమర్ రూ.12,947 నగదును డిస్కౌంట్‌గా పొందాడని స్విగ్గీ తెలిపింది. కేవలం 10 నిమిషాల 42 సెకన్లలోనే ఫుడ్ డెలివరీ రికార్డు కూడా ఈ సీజన్‌లో నమోదైంది. ముఖ్యంగా ముంబయి ఇండియన్ లైవ్ మ్యాచ్‌ల సమయంలోనే అత్యధిక ఆర్డర్లు నమోదైనట్లు స్విగ్గీ తెలిపింది.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
**హైదరాబాద్**

| ₹ 1,39,950 | ₹1,52,680 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
**హైదరాబాద్**
₹ 2,74,900

# లాభాల్లో ఎస్‌బీఐ

## తగ్గిన మొండి బకాయిలు



**న్యూఢిల్లీ:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), 2025-26 మార్చి త్రైమాసికంలో రూ.19,684 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.18,643 కోట్లతో పోలిస్తే ఇది 6% అధికం. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్)తో పాటు ట్రెజరీ ఆదాయం తగ్గడం వల్లే లాభం పరిమితమైంది. ఏకీకృత ప్రాతిపదికన లాభం రూ.19,600.46 కోట్ల నుంచి రూ.19,648.87 కోట్లకు పెరిగింది. డిసెంబరు త్రైమాసికంలోని రూ.21,317 కోట్లతో పోలిస్తే ఇది తక్కువే. బ్యాంకు మొత్తం ఆదాయం రూ.1,43,876 కోట్ల నుంచి రూ.1,40,412 కోట్లకు పరిమితమైంది. ఇందులో వడ్డీ ఆదాయం రూ.1,19,666 కోట్ల నుంచి రూ.1,23,098 కోట్లకు పెరిగింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వంటి సవాళ్లు ఎదురవుతున్నా 2026-27 రుణ వృద్ధి లక్ష్యాన్ని 13-15% వద్దే కొనసాగిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. నికర వడ్డీ మార్జిన్ లక్ష్యాన్ని 3 శాతంగా పెట్టుకున్నామన్నారు. ఇరాన్ ఉద్రిక్తతలు 6 నెలలకు మించి కొనసాగితే స్థూల ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందని వివరించారు. అత్యవసర రుణ హామీ పథకం కింద రూ.80,000 కోట్ల వరకు రుణాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా, అనిశ్చితి కారణంగా ఎక్కువ మంది రుణ స్వీకర్తలు ముందుకు రాకపోవచ్చని ఆయన అంచనా వేశారు. 2025-26లో స్టాండలోన్ పద్ధతిన నికర లాభం రూ.80,032 కోట్లకు చేరుకుంది. 2024-25 లాభం రూ.70,901 కోట్ల కంటే ఇది 13% ఎక్కువ. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.17.35 డివిడెండును బ్యాంకు బోర్డు ప్రకటించింది. రికార్డు తేదీ మే 16.

మార్చి చివరకు స్థూల నిరర్థక ఆస్తులు(జీఎన్‌పీఏలు) మొత్తం రుణాల్లో 1.49 శాతంగా ఉన్నాయి. 2025 మార్చి ఆఖరుకు ఇవి 1.82 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.47% నుంచి 0.39 శాతానికి దిగివచ్చాయి.

**6,000 ఉద్యోగ నియామకాలు చేపడతాం**

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లో తమ వాటాను కొంతమేర విక్రయించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. 'ఎన్ఎస్ఈ ఐపీఓలో ఈ ప్రక్రియ ఉంటుంద'ని స్పష్టం చేశారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌ను ఇప్పట్లో లిస్టింగ్ చేసే ఆలోచనేదీ లేదని కూడా తెలిపారు. 2026-27 మొత్తం మీద రెపో రేటును ఆర్‌బీఐ మార్చకపోవచ్చనీ శెట్టి అంచనా వేశారు. అందుబాటు ధర ఇళ్ల నిర్వచనం మార్చాలి: ఇటీవల గృహ రుణాల సగటు పరిమాణం పెరుగుతున్నందున, అందుబాటు ధర గృహాల నిర్వచనాన్ని కేంద్రం సమీక్షించాలని శెట్టి సూచించారు. రెండేళ్ల కిందట రూ.35-40 లక్షలుగా ఉన్న సగటు గృహ రుణ పరిమాణం ఇపుడు రూ.51 లక్షలకు చేరుకుందని వివరించారు. ప్రస్తుతం నిర్దిష్ట కార్పెట్ విస్తీర్ణంలో ఉంటూ, రూ.45 లక్షల్లోపు ధర పలికేదే అందుబాటు గృహం కింద అర్హత ఉంది. ప్రాధాన్యతా రంగ రుణాల కింద వీటిని బ్యాంకులు పరిగణిస్తాయి. పన్ను ప్రోత్సాహకాలూ లభిస్తాయి.


**మిథోస్‌పై ఆర్‌బీఐ, ప్రభుత్వంతో కలిసి..**

బ్యాంకు 6,000 వరకు నియామకాలు చేపట్టనుందని శెట్టి తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం సైబర్ సెక్యూరిటీ కోసం నియమించుకోవచ్చన్నారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2.45 లక్షలకు చేరుతుందన్నారు. సైబర్‌భద్రతపై సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కృత్రిమమేధ (ఏఐ) టూల్ మిథోస్ సవాలును ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై ఆర్‌బీఐ, ప్రభుత్వంతో కలిసి బ్యాంకులు పనిచేస్తున్నాయని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ)కూ నేతృత్వం వహిస్తున్న శెట్టి తెలిపారు.

# భూమి వెలుపల జీవం ఉందా?

## యూఎఫ్‌వోలు ఉన్నట్లా... లేనట్లా?

### ఉంటే మనపై దాడికి వస్తాయా?



**న్యూఢిల్లీ:**మానవజాతిని అనాదిగా వేధిస్తున్న ప్రశ్నలివి! నిబిడాశ్చర్యంతో ఆకాశాన్ని చూసినప్పుడు కొందరికి కొన్ని నిగూఢ అంశాలు కనిపించాయి. అంతుచిక్కని ఆ ఆకృతులను గ్రహాంతరవాసుల వాహకనౌకలుగా, ఫ్లయింగ్ సాసర్లుగా పిలిచేవారు. ఆ తర్వాత వాటికి అన్ ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్ (యూఎఫ్‌వో), అన్ ఐడెంటిఫైడ్ ఎనామలస్ ఫినామెనా (యూఏపీ)గా పేరుపెట్టారు. మిస్టరీగా మారిన ఈ అంశాలపై దశాబ్దాలుగా అనేక ఊహాగానాలు వ్యాప్తిలో ఉన్నాయి. వీటికి సంబంధించిన కొత్త ఫైళ్లను అమెరికా రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం 'పెంటగాన్' తాజాగా శుక్రవారం విడుదల చేయడం మొదలుపెట్టింది. యూఎఫ్‌వోలు ఉన్నాయో లేవో చెప్పకుండా... ఈ ఫైళ్లలో ఉన్న సమాచారాన్ని ప్రజలే విశ్లేషించుకోవాలని స్పష్టంచేయటం గమనార్హం. యూఎఫ్‌వోలకు సంబంధించిన రహస్య పత్రాలను బహిర్గతం చేసేందుకు పెంటగాన్ కొన్నేళ్లుగా కసరత్తు చేస్తోంది. పెంటగాన్ తాజాగా విడుదల చేసిన వివరాల్లో అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ, రక్షణ శాఖ, నాసా, విదేశాంగ శాఖకు సంబంధించిన 162 ఫైళ్లు ఉన్నాయి. ఈ పత్రాల్లో అంతుచిక్కని వస్తువులను చూసినట్లు చెబుతున్న ప్రత్యక్ష సాక్షుల కథనాలు, 28 వీడియోలు, 14 ఫొటోలు ఉన్నాయి. దశాబ్దాల నాటి ఉదంతాలనూ ఇందులో ప్రస్తావించారు. ఈ వీడియోలు, ఫొటోలను సైనిక విమానాలు చిత్రీకరించాయి. చందమామపైకి మానవులను తీసుకెళ్లిన అపోలో-12, 17 మిషన్ల సమయంలో నాసా శాస్త్రవేత్తలు వీక్షించిన కొన్ని వింత వస్తువుల ఫొటోలనూ పెంటగాన్ ఇప్పుడు విడుదల చేసింది. వాటిని చంద్రుడి ఉపరితలం నుంచి తీశారు. 2020 నుంచి 2026 మధ్య ప్రపంచంలో పలుచోట్ల తీసిన వీడియోలు ఇందులో ఉన్నాయి. వీటిలో అనేకం.. పరారుణ కెమెరాలు చిత్రీకరించిన తెల్లటి వస్తువులు కనిపించాయి. 2023లో గ్రీస్‌లో ఒక వస్తువు.. గంటకు 80 మైళ్ల వేగంతో ప్రయాణిస్తూ 90 డిగ్రీల కోణంలో అనేకసార్లు మలుపులు తిరుగుతున్న వీడియో కూడా ఇందులో ఉంది. ఒక వీడియోలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఫుట్‌బాల్‌ను తలపిస్తున్న వస్తువు కనిపించింది. నింగిలో కనిపించిన అంతుచిక్కని అంశాలను గ్రహాంతర జీవం లేదా వారికి సంబంధించిన టెక్నాలజీగా అధికారులు ఎక్కడా నిర్ధారించలేదు. విభిన్న వస్తువులను యూఎఫ్‌వోలుగా ప్రజలు భ్రమపడుతున్నారని కొందరు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాతావరణ పరిశోధన బెలూన్లు, ఉపగ్రహాలు, సంక్లిష్ట విన్యాసాలు చేస్తున్న డ్రోన్లు, వాణిజ్య విమానాల వేడి ఉద్గారాలు వంటివి వాటిని యూఎఫ్‌వోలుగా భావిస్తుండొచ్చు. పక్షులు, సుడిగుండంలా కనిపించే లెంటిక్యులర్ మేఘాలు, వాతావరణంలో సూర్యకాంతి వక్రీభవనం చెందడం (సన్ డాగ్), వేడి గాలులు వంటి సహజసిద్ధ వాతావరణ పోకడలను చూసి కూడా ఇలా భ్రమపడి ఉండొచ్చు. నెవాడాలోని 'ఏరియా 51' వద్ద రహస్య యుద్ధవిమానాలను అమెరికా పరీక్షిస్తుంటుంది. వాటిని కూడా యూఎఫ్‌వోలుగా కొందరు భావిస్తుంటారు. కొన్ని ఉదంతాలపై విస్పష్ట డేటా లేకపోవడంతో అవి ఇప్పటికీ మిస్టరీగానే ఉండిపోయాయి. వీటికి సంబంధించి హై రిజల్యూషన్ ఉపగ్రహ డేటా సహా సవివర డేటాను ఇవ్వాలని శాస్త్రవేత్తలు అమెరికా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనివల్ల స్వతంత్ర విశ్లేషణకు వీలుంటుందని చెబుతున్నారు.

**కొన్ని ఉదంతాలు..**

1947లో వెలుగుచూసిన 'రాస్‌వెల్ యూఎఫ్‌వో ఉదంతం' ప్రముఖంగా చెప్పుకోదగ్గది. అందులో ఒక ఫ్లయింగ్ డిస్క్ కనిపించింది. అది అమెరికాలోని న్యూమెక్సికో పట్టణానికి వెలుపల కూలింది. దాన్ని వాతావరణ బెలూన్‌గా అమెరికా వైమానిక దళం ఆ తర్వాత నిర్ధారించింది. అయితే దానిపై అనేక కథలు, వదంతులు వ్యాపించాయి. నాటి ఘటనలో గ్రహాంతరవాసుల మృతదేహాలు కూడా లభ్యమయ్యాయని కూడా కొందరు కట్టుకథలు అల్లారు. భారత్‌లోనూ.. 2023 నవంబరులో ఇంఫాల్ విమానాశ్రయ గగనతలంలో అంతుచిక్కని వెలుగులేవో కనిపించాయి. దీంతో 3గంటల పాటు అక్కడ విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. వైమానిక దళం రఫేల్ జెట్‌లను పంపాల్సి వచ్చింది. వాటికి అనుమానాస్పద అంశాలేవీ తారసపడలేదు.

# వెనిస్‌లో అంబానీ ప్రత్యేక విందు..

### తల్లికి ఇషా ప్రశంసలు

వెనిస్ :ఇటలీలోని వెనిస్ నగరంలో నిర్వహించిన 61వ వెనిస్ ప్రదర్శనలో ఇండియా పెవిలియన్ ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ తరపున ఇషా అంబానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారతీయ కళలను ప్రపంచానికి చాటిచెప్పడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా తన తల్లి నీతా అంబానీపై ప్రశంసల వర్షం కురిపించారు. భారతీయ సంప్రదాయ నృత్య కళాకారిణిగా, ఉపాధ్యాయురాలిగా, ఆమెకు కళలపై ఉన్న అపారమైన ప్రేమ వల్లే ఎన్ఎంఏసీసీ స్థాపన సాధ్యమైందన్నారు. భారతీయ మూలాలను, కళలను విశ్వవ్యాప్తం చేసేందుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఇషా అంబానీ కృతజ్ఞతలు తెలిపారు.





# అనిల్ అంబానీ కార్యాలయాల్లో సీబీఐ సోదాలు

ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిపినట్లు తెలుస్తోంది. బ్యాంక్ మోసం కేసులో ముంబయిలోని ఆయనకు సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) శనివారం తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లోనూ సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని.. దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై ఇప్పటికే ఏడు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సీబీఐ ఇప్పటికే పలుమార్లు అనిల్ అంబానీ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. ఇదీ చదవండి: నెలకు రూ.30,000 కోట్ల నష్టం

## ఎప్‌స్టీన్ ఫైల్స్ కోసం..

## సీక్రెట్ రీడింగ్ రూమ్..!

**వాషింగ్టన్:**ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌కు సంబంధించిన ఫైళ్లన్నీ ఓ లైబ్రరీ ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. దీనికి సంబంధించి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఒక రీడింగ్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. ఆ నగరం సమీపంలోని ట్రైబెకా ప్రాంతంలో వాటిని ప్రదర్శనకు ఉంచారు. మే 8 నుంచి 21 వరకు ప్రజలు వీటిని చదవడానికి వీలు ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ రాకెట్‌కు సంబంధించిన 3.5 మిలియన్ల ఫైళ్లను దశలవారీగా అమెరికా న్యాయశాఖ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రైమరీ ఫ్యాక్ట్స్ అనే ఎన్జీఓ ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసింది. 3,700 వాల్యూమ్స్‌లో 'డొనాల్డ్ జె.ట్రంప్ అండ్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మెమోరియల్ రీడింగ్ రూమ్' పేరిట వాటిని అందుబాటులో ఉంచింది. అపాయింట్‌మెంట్ తీసుకున్నవారే ఈ రీడింగ్ రూమ్‌కు వెళ్లడానికి వీలు ఉంటుంది. భద్రతా కారణాలతో నిర్వాహకులు ఈ గ్యాలరీ అడ్రెస్‌ను రహస్యంగా ఉంచారు. ట్రంప్, ఎప్‌స్టీన్ ల మధ్య సంబంధాలు ఎప్పుడు మొదలై, ఎప్పటివరకు కొనసాగాయో కూడా ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారట. ఎప్‌స్టీన్ వర్గం చేసిన నేరాలు, వాటిని కప్పిపుచ్చడానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాల నుంచి ప్రజల దృష్టి మళ్లకుండా చేసేందుకే ఈ ఏర్పాటు అని ఎన్జీఓ వెబ్‌సైట్ పేర్కొంది. అలాగే న్యాయకోసం పోరాడుతున్న బాధితులకు మద్దతుగా నిలిచే ప్రయత్నమని రాసుకొచ్చింది.

# ట్రంప్‌నకు 'ట్రూత్' కష్టాలు..

### 400 మిలియన్ డాలర్ల నష్టం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు సంబంధించిన సోషల్ మీడియా ట్రూత్ భారీ నష్టాన్ని చవిచూసింది. ట్రూత్ సోషల్ మాతృ సంస్థ 'ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్'నకు తొలి త్రైమాసికంలో 400 మిలియన్ డాలర్ల (రూ.3,700 కోట్లు) నష్టం వాటిల్లింది. ఈ సంస్థలో ట్రంప్‌నకు 41శాతం వాటాలు ఉన్నాయి. కంపెనీ ఫైలింగ్ ప్రకారం.. మార్చి 31తో ముగిసిన మూడు నెలలకు ట్రంప్ మీడియా ఆదాయం 1 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8.74 కోట్లు) కంటే తక్కువగా ఉంది. డిజిటల్ కరెన్సీ మార్కెట్‌లో భారీ పతనం.. క్రిప్టో కరెన్సీ విలువలు పడిపోవడం వల్లే ఈ నష్టం సంభవించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లో బిట్‌కాయిన్ విలువ 1,26,000 డాలర్లకు పైగా ఉండగా.. మార్చి నాటికి 70,000 డాలర్ల కంటే తక్కువకు పడిపోయింది. ప్రస్తుతం దాని విలువ 80వేల డాలర్లుగా ఉంది. ఈ నేపథ్యంలో ట్రూత్ తన మొదటి త్రైమాసికంలో 9,00,000 డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. అయితే దీనికి విరుద్ధంగా స్టాక్ మార్కెట్‌లో ట్రూత్ విలువ 2.47 బిలియన్ డాలర్లుగా ఉంది. ఈ నష్టం నేపథ్యంలో భవిష్యత్తులో కొత్త వృద్ధి అవకాశాలను, వాటాదారుల విలువను పెంచే నూతన విధానాలపై దృష్టిపెట్టామని ట్రూత్ సీఈఓ కెవిన్ మెక్‌గర్న్ వెల్లడించారు. ట్రూత్ మీడియాలో కొత్త ఫీచర్లు తీసుకురావడానికి.. మరింతమంది వినియోగదారులకు దీనిని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమెరికన్ కంపెనీ టీఏఈ టెక్నాలజీతో వీలైనంత త్వరగా విలీనానికి చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

# కిమ్ హత్యకు గురైతే.. అణుదాడులే..!



ప్యాంగ్యాంగ్:ఉత్తరకొరియాలో కిమ్ జోంగ్ ఉన్ నియంతృత్వ పాలన గురించి ఎప్పటికప్పుడు అనూహ్య విషయాలు వెలుగులోకి వస్తుంటాయి. తాజాగా అలాంటి కీలక విషయమే బయటకు వచ్చింది. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉ.కొరియా తన విధానాలను సవరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా- ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేక మంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల ప్యాంగ్యాంగ్‌లో జరిగిన 15వ సుప్రీం పీపుల్స్ అసెంబ్లీ మొదటి సమావేశంలో ఈ రాజ్యాంగ సవరణను ఆమోదించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ మార్పులకు సంబంధించిన వివరాలను తాజాగా దక్షిణ కొరియాకు చెందిన నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ తమ ఉన్నతాధికారులతో పంచుకుంది. ఉ.కొరియా తన రాజ్యాంగంలోని అణ్వాయుధాల పాలసీని సవరించినట్లు పేర్కొంది. తాజాగా సవరించిన చట్టం ప్రకారం.. దేశ అణ్వాయుధ వ్యవస్థపై కిమ్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఒకవేళ శత్రుదాడుల్లో ఆయన మరణిస్తే.. వెంటనే అణ్వాయుధ దాడులు చేపట్టొచ్చు. ఇక, ఈ ఏడాది దక్షిణ కొరియా సరిహద్దు సమీపంలో దీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను మోహరించాలని ప్యాంగ్యాంగ్ యోచిస్తున్నట్లు కూడా తాజాగా బయటకు వచ్చింది.

# మక్క రైతులకు ముప్పు తిప్పలు



## మార్క్‌ఫెడ్ ట్రాన్స్‌పోర్ట్ సెగ

- లారీల కొరత పేరుతో కోట్ల మాయాజాలం
- బస్తాకు రూ. 50 చొప్పున రైతుల దగ్గర దోపిడీ



**ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) :**
మక్క రైతుల పరిస్థితి "ముందు నుయ్యి.. వెనుక గొయ్యి" అన్న చందంగా మారింది. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే అవి అమ్ముకోవడానికి ముప్పు తిప్పలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. రైతులు తమ రక్తాన్ని స్వేదంగా చిందించి పంట పండిస్తే ప్రభుత్వం ఆ దిగుబడిని కొనడానికి సవాలక్ష నొక్కులు నొక్కుతోంది. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో రైతులు అధికంగా మక్కలను సాగు చేశారు. ఫలితంగా పెద్ద ఎత్తున దిగుబడి వచ్చింది. అయితే ఆ పంటను కొనే విషయంలో సర్కారు ఆంక్షలు రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. తాజాగా లారీల కొరత పేరుతో మాయాజాలం సాగుతోంది. పంట రవాణా విషయంలో కృత్రిమ కొరత సృష్టించి కోట్లు కొల్లగొడుతున్న వైనం కర్షకుల నడ్డి విరుస్తోంది. ఈ ఫలితంగా ఆరుగాలం శ్రమించిన రైతులు పంట చేతికి వచ్చిన తర్వాత కూడా తిప్పలు పడాల్సి వస్తోంది.

**మార్క్‌ఫెడ్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ఆగడాలు**
ఖమ్మం మార్క్‌ఫెడ్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రవాణా పేరుతో మాయాజాలం సాగిస్తూ కోట్లు కొల్లగొడుతున్నా అదుపు చేసే నాదులే లేకుండా పోయారు. బస్తాకు రూ. 50 చొప్పున రైతుల దగ్గర దోపిడీ చేస్తున్న వైనం తాజాగా బట్టబయలైంది. అదనపు పైకం ఇస్తేనే లోడింగ్ చేస్తామంటూ హుకుం జారీ చేస్తున్న తీరు రైతులకు కంటగింపుగా మారింది. పైకం ఇవ్వకుంటే నో వెహికల్ అంటూ తిరస్కరిస్తున్నా సరే అడ్డుకునే వారు లేకుండా పోయారు. ఖమ్మం గాంధీ చౌక్ ప్రాంతానికి చెందిన ఒక ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ తీరు ఇది. ఈ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ అక్రమ దందాతో గిట్టుబాటు ధర ఉన్నా రైతులకు ఫలితం దక్కకుండా పోతోంది. ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ సిండికేట్ దెబ్బకు ముక్కలు పండించిన రైతులు బక్కచిక్కుతున్నారు. బహిరంగ మార్కెట్ కన్నా మార్క్‌ఫెడ్ ధర మేలని వస్తే రవాణా ఖర్చుల పేరిట దోపిడీ జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఖమ్మం మార్క్ ఫెడ్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ అక్రమ దందాపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కర్షకులు డిమాండ్ చేస్తున్నారు.

# కరీంనగర్ బంద్ విజయవంతం

- ప్రజల సంపూర్ణ మద్దతుతో బంద్ సక్సెస్
- బీఆర్ఎస్‌కు ధన్యవాదాలు తెలిపిన జి.వి. రామకృష్ణారావు
- కాంగ్రెస్, బీజేపీ కుట్రలు తిప్పికొట్టిన ప్రజలు



**కరీంనగర్ టౌన్, మే 09 (జనంసాక్షి):** భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పిలుపునందించిన కరీంనగర్ బంద్‌కు నగర ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపడంతో బంద్ విజయవంతమైందని బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావు ప్రకటించారు. బంద్‌కు సహకరించిన ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు, కార్మికులు, వ్యాపారులు, ట్రేడ్ అసోసియేషన్లు, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతు తెలిపి తమ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారని పేర్కొన్నారు. ప్రజల అపార మద్దతుతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మౌనం వహించాల్సి వచ్చిందని విమర్శించారు.
కాంగ్రెస్, బీజేపీ కలిసి బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలని కుట్ర పన్నాయని ఆరోపించిన రామకృష్ణారావు, ప్రజలు వారి కుట్రలను తిప్పికొట్టి బంద్‌ను విజయవంతం చేశారని అన్నారు. కరీంనగర్ నగర ప్రశాంతత, శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈ బంద్ నిర్వహించామని, ప్రజలు ఆ విషయాన్ని అర్థం చేసుకుని సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు.
ఉదయం నాలుగు గంటల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని మండిపడ్డారు. ఎన్ని అరెస్టులు చేసినా, ఎంతమందిని అడ్డుకున్నా ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారని స్పష్టం చేశారు. అధికార పార్టీ గుండాల బెదిరింపులకు భయపడకుండా బంద్‌ను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, కరీంనగర్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**జి.వి. రామకృష్ణారావు హౌస్ అరెస్ట్‌ను ఖండించిన బీఆర్ఎస్ నేతలు**
కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావును శనివారం తెల్లవారుజామున మానకొండూర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అర్ధరాత్రి నుంచి నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని ఆరోపించారు.

## క్యాన్సర్‌కు అరుదైన చికిత్స..

# యశోదలో సరికొత్త మైలురాయి

- నాలుగో దశలోనూ భయపడనవసరం లేదు
- హైపర్ సైట్ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ మెషిన్‌తో ఖచ్చితమైన చికిత్స
- ప్రతి ఒక్కరూ పర్యావరణం, ఆహార అలవాట్లపై దృష్టి పెట్టాలి: డా. సందీప్ కుమార్ తుల



**పెద్దపల్లి, మే 09 (జనంసాక్షి):** క్యాన్సర్ రహిత సమాజం లక్ష్యంగా వైద్య రంగంలో వస్తున్న అధునాతన చికిత్సా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ సందీప్ కుమార్ తుల అన్నారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు క్యాన్సర్ అంటే మరణశాసనంగా భావించేవారని, కానీ నేడు అందుబాటులోకి వచ్చిన సాంకేతికతతో నాలుగో దశలో ఉన్న రోగులు కూడా ఏళ్ల తరబడి సాధారణ జీవితం గడుపుతున్నారని భరోసా ఇచ్చారు. యశోద ఆసుపత్రిలో తాజాగా ప్రవేశపెట్టిన హైపర్ సైట్ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ మెషిన్ గురించి వివరిస్తూ, ఈ పరికరం ద్వారా ట్యూమర్‌ను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, పక్కన ఉన్న గుండె, ఊపిరితిత్తుల వంటి సున్నితమైన అవయవాలపై ప్రభావం లేకుండా కేవలం క్యాన్సర్ కణాలపైనే చికిత్స అందించవచ్చని తెలిపారు. క్యాన్సర్ ఒకే వ్యాధి కాదని, సుమారు 100కి పైగా రకాలుగా విభజించబడిన వ్యాధుల సమూహమని డాక్టర్ సందీప్ వివరించారు. రొమ్ము, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణాశయం, గర్భాశయ ముఖద్వారం, ప్రోస్టేట్, బ్లడ్, స్కిన్ క్యాన్సర్లు ఎక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు.
నోటి పూత, గొంతు నొప్పి, జీర్ణ ప్రక్రియలో మార్పులు వంటి లక్షణాలు రెండు వారాలకు మించి కొనసాగితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ధూమపానం, మద్యపానం, ప్రాసెస్డ్ ఫుడ్స్, హోటల్ నూనెల పునర్వినియోగం వంటివి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని హెచ్చరించారు.
ప్రతిరోజూ వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని డాక్టర్ సందీప్ సలహా ఇచ్చారు. యశోద ఆసుపత్రిలో అత్యాధునిక చికిత్సల ద్వారా క్యాన్సర్ రోగులు సాధారణ జీవితం గడపడం సాధ్యమని, వ్యాధి స్టేజ్‌ను నిర్ధారించుకుని సకాలంలో చికిత్స తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

Industrial Training Institute

# ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

- ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి
- మే 14 నుండి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు

**పెద్దపల్లి, మే 09 (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, టీసీ తదితర ధ్రువ పత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు ఐ వెబ్‌సైట్ హెచ్‌టిటిపి ఇన్‌రి( ఐటిఐ తెలంగాణ. గౌఐ ఎస్/యుటిఎంబిసోర్స్=చాట్ జిపిటి. కమ్) ద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని, అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఐటీఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గతంలో ఎన్నడూలేని విధంగా పెద్దపల్లి అభివృద్ధి

- రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా బైపాస్ రోడ్డు
- 12.1 కిలోమీటర్ల దూరంతో 82 కోట్లతో పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు



పెద్దపల్లి,మే 09(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రూ. 82 కోట్లతో నూతనంగా నిర్మించే బైపాస్ రోడ్డు నిర్మాణానికి స్థానిక నాయకులతో మరియు అధికారులతో కలిసి శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి సహకరించాలని పార్టీలకు అతీతంగా బైపాస్ రోడ్డు నిర్మాణానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి నియోజకవర్గానికి రూ. 82 కోట్లతో బైపాస్ రోడ్డు మంజూరు చేయడం శుభ సూచకం అని పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రకాల అభివృద్ధి గౌరవ మంత్రుల సహకారంతో చేయడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి లో ఎన్నడు లేని విధంగా బస్సు డిపో, జిల్లా కోర్టు భవనం, డబల్ లైన్ రోడ్ల నిర్మాణాలు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ, మినీ ట్యాంక్ బండ్ల నిర్మాణాలు, బ్యాడ్మింటన్ కోర్టులు, నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణాలు, సెంట్రల్ లైటింగ్లు, మండలాల నుండి జిల్లా కేంద్రానికి రోడ్డు మార్గాన్ని సులభతరం చేసే దిశగా డబల్ రోడ్డులు, దేవాలయాల అభివృద్ధి, అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అలాగే అమృత్ పథకం ద్వారా మంచి నీటి ట్యాంకులను నిర్మిస్తూ ప్రజల అవసరాలను తీస్తున్నామని గుర్తు చేశారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల నుండి నిట్టూరు, చందపల్లి మీదుగా అప్పన్నపేట వరకు 12 కిలో మీటర్ల మేరకు డబల్ లైన్ రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ తో కూడిన బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈరోజు పనులు ప్రారంభించుకోవడం ఆనందదాయకం అని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రజలందరూ సహకరిస్తూ అభివృద్ధి లో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు, స్థానిక సర్పంచు, గ్రామ పాలకవర్గం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు. డైరెక్టర్లు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- గన్నీ బ్యాగులు, టార్పాలిన్, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచాలి
- రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి
- తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి 72 ఎకరాల ప్రభుత్వ భూమి

**పెద్దపల్లి, మే 09 (జనంసాక్షి):**
జిల్లాలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం, కల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం, ఓదెల మండలంలోని పోత్కపల్లి, ఓదెల మండల కేంద్రం, సుల్తానాబాద్ మండలంలోని రేగడి మధికుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అలాగే సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలోని జై హనుమాన్ రైస్ మిల్, సాంబశివ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కనకమహాలక్ష్మి రైస్ మిల్, సుగ్లంపల్లి గ్రామంలోని లక్ష్మీ భవాని రైస్ మిల్లులను కూడా తనిఖీ చేశారు.
కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని, ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని, రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం స్వీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**72 ఎకరాల ప్రభుత్వ భూమి తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి**
ధర్మపురి శాసనసభ్యులు, సంక్షేమ శాఖ మంత్రి అడూరి లక్ష్మణ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదు మేరకు ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారు సర్వే నెం. 679లో జరిగిన చట్టవిరుద్ధ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టి 72.03 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటించారు.
ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అక్రమంగా ఆక్రమించి ఉంటే స్వచ్ఛందంగా తహసీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. లేని పక్షంలో అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, సంబంధితులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీలు, సమీక్షల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఆర్డీఏ, రవాణా, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# వరి రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో మే 9(జనం సాక్షి):** వరి కొనుగోలు కేంద్రాలలో లావాదేవీల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం ఆమె నారాయణ పేట మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగో లు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా కేంద్రానికి ఇంత వరకు ఎన్ని బస్తాల ధ్యానం వచ్చిందని ? గత సంవత్సరం క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డుల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు. కేంద్రం లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలతో పాటు ఇంకా ఎన్ని బస్తాల ధ్యానం విక్రయానికి వస్తుందో నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. కేంద్రానికి చెందిన గన్ని బస్తాల స్టాక్ ను కలెక్టర్ పరిశీలించారు. ఒకరిద్దరు రైతులతో మాట్లాడి కేంద్రానికి ఎప్పుడు వచ్చారని ? తేమ శాతం వచ్చిందా లేదా అని వాకబు చేశారు. కొనుగోలు చేసిన బస్తాలను ఎప్పటి కప్పుడు మిల్లులకు తర లించాలని నిర్వాహ కులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి బాల్ రాజ్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, డీటీలు కాళప్ప, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లెంకలపల్లిలో రోడ్డు వెడల్పు, డ్రైన్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

- నాణ్యత, వేగం పెంచాలి.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- నిధుల కొరత లేకుండా అభివృద్ధి పనులు
- ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**మర్రిగూడ, మే 9 (జనంసాక్షి):** మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామంలో కొనసాగుతున్న రోడ్డు వెడల్పు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే పనుల నాణ్యతను క్షేత్రస్థాయిలో సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు వెడల్పు పనులు పకడ్బందీగా ఉండాలని, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా ఉండాలని, వర్షాకాలంలో నీరు నిలవకుండా వాలు సరిగ్గా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బి అధికారులు, గ్రామ నాయకులు ఎమ్మెల్యేతో పాటు ఉన్నారు.

# 80 ఏళ్ల రావి చెట్టుకు సింగరేణి పునర్జన్మ

- పర్యావరణ పరిరక్షణలో సింగరేణి మరో మైలురాయి
- జీడీకే-11 జియం లలిత్ కుమార్ చొరవకు ప్రశంసలు
- వృద్ధ వృక్ష సంరక్షణకు సింగరేణి సంస్థ ఆదర్శం



**గోదావరిఖని, మే 08 (జనంసాక్షి):** ఆర్జీ-1 ఏరియా పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ గని సమీపంలో ఇటీవల కురిసిన గాలివానకు సుమారు 80 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన రావి చెట్టు నేలకొరిగింది. విషయం తెలుసుకున్న ఆర్జీ-1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ వెంటనే స్పందించి ఆ చెట్టును కాపాడేందుకు చర్యలు చేపట్టారు. శనివారం సింగరేణి సెంట్రల్ నర్సరీ సమీపంలోని జంక్షన్ రోడ్డు వద్ద నేలకొరిగిన రావి చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తరలించి పునఃప్రతిష్ఠ చేశారు. జియం లలిత్ కుమార్ స్వయంగా చెట్టును నాటి నీళ్లు పోసి పర్యావరణ పరిరక్షణపై తన నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా లలిత్ కుమార్ మాట్లాడుతూ, "వృక్షాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా వృద్ధ వృక్షాలను కాపాడడం ద్వారా ప్రకృతి సమతుల్యతను రక్షించవచ్చు" అని అన్నారు. కార్యక్రమంలో జీడీకే-11 గ్రూప్ ఆఫ్ మైన్స్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, డిజియం ఫారెస్ట్ ఆఫీసర్ కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీఎస్‌పీ ఫైదీశ్వర్, సీనియర్ పీఓ హనుమంతరావు, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు. ఎనభై ఏళ్ల చరిత్ర కలిగిన రావి చెట్టును కాపాడి పునఃప్రతిష్ఠ చేసిన జియం లలిత్ కుమార్ చొరవను స్థానికులు, పర్యావరణ ప్రేమికులు అభినందిస్తున్నారు.

# జనగణన స్వీయ గణనపై నార్సింగిలో అవగాహన వాకథాన్



**శేరిలింగంపల్లి, మే 09 (జనంసాక్షి) :**
జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనగణన నమోదు ప్రక్రియ ఈనెల 11వ తేదీ నుండి ఇంటింటి సర్వే ఉంటుందని, ఈరోజు వరకు స్వీయ గణన నమోదు ప్రక్రియ ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకొని సకాలంలో వివరాల నమోదును అందించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ నార్సింగి సర్కిల్ పరిధిలో స్వీయ గణన వాకథాన్ కార్యక్రమానికి నార్సింగి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణమోహన్ తోకలిసి జెడ్సి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా జనగణన కార్యక్రమంలో భాగంగా స్వీయగణన యొక్క ప్రాధాన్యతపై పౌరులు మరియు వాకర్లకు అవగాహన కల్పించేందుకై సర్కిల్ పరిధి కోకాపేట అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీయ గణనవల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ జనగణన ప్రక్రియలో ప్రజల చురుకైన భాగస్వామ్యం ఎంత అవసరమో తెలియజేయడం జరిగింది. స్వీయ గణనద్వారా ఇంటివద్ద నుండే మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా వివరాలు నమోదు చేసే సౌకర్యాన్ని పౌరులు వినియోగించుకోవాలని సూచించారు. స్వీయ గణనద్వారా గణకులు ఇంటికి వచ్చేవరకు వేచి చూడాల్సిన అవసరం ఉండదని, తద్వారా సమయం ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని వివరించారు. పౌరులు స్వయంగా వివరాలు నమోదు చేయడంవల్ల దోషాలు తగ్గి, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యపడుతుందన్నారు. జరుగుతుంది. సరైన జనగణన డేటా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని జెడ్సి తెలిపారు. కావున శేరిలింగంపల్లి జోనల్ పరిధి పౌరులందరూ జనగణన ప్రక్రియకు సహకరించాలని, స్వీయ గణన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, వాకర్స్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# నత్త నడక ధాన్యం కొనుగోళ్లు

**ముస్తాబాద్ మే 9( జనం సాక్షి) :**
అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన కొనుగోలు కేంద్రాల్లో పేరుకపోతున్న ధాన్యం ముస్తాబాద్ మండల కేంద్రంలోని 22 గ్రామాలలో ధాన్యం కొనుగోలు నత్తనడక సాగుతూ ఉండడంతో రైతులలో ఆందోళన నెలకుంది. రెండు వారాలు నుంచి అకాల వర్షాలు ఈదురు గాలులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లారీలు లోడు చేసుకోక రైస్ మిల్ నిర్వాకులు వద్ద లోడ్లను దించుకోక ఇబ్బందులు. తమను ఎవరు పట్టించుకోవడం లేదని అధికారుల నాయకుల తీరుపై మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 10 రోజులు గడుస్తున్న నత్తనడక ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి అంతంత మాత్రాననే వెంటనే కొనుగోలు కేంద్రాలు తొందరగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు

# కల్లాలు దాటని ధాన్యం... రైతు కళ్ళల్లో కన్నీరు దాటే!





- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- కొనుగోలు కేంద్రాల్లో అధికారుల కొర్రీలు
- అకాల వర్షాలకు రైతు కష్టం నీళ్లపాలు
- రోడ్ల మీదనే రాసులుగా పేరుకుపోతున్నాయి

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి మే 9 (జనం సాక్షి) :** తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం, అకాల వర్షాల నేపథ్యంలో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు (ఐకేపీ) తరలించినా, అవి రోడ్ల మీదనే రాసులుగా పేరుకుపోతున్నాయి.మిల్లర్లు ధాన్యం దిగుమతికి నిరాకరించడం, కొనుగోలు కేంద్రాల్లో అధికారుల కొర్రీలు, మందకొడి కొనుగోళ్ల వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అకాల వర్షాలకు కల్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దవుతోంది, రైతు కష్టం నీళ్లపాలవుతోంది.కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడవడం చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**కోతల మోత!**

కొనుగోలు కేంద్రాల్లో రవాణా, మిల్లర్ల ఎంపిక, గన్నీ బ్యాగుల కొరత వంటి కారణాలతో ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరుగుతోంది. అన్నీ జరిగి కాంటా చేసినా ధాన్యాన్ని తరలించడానికి నాలుగైదు రోజులు అవుతోంది. దీంతో తరుగు ఏర్పడుతోంది. క్వింటాల్‌కు 2నుంచి 3 కిలోలు కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. గింజ నాణ్యత లేదని, తాలు ఎక్కువగా ఉందని మిల్లర్లు క్వింటాలుకు 2కిలోలు లేదా బ్యాగ్‌కు కిలో కోత పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17శాతం, 5శాతం తాలు ఉన్నా కొనుగోలు చేయాలని ఆదేశాలున్నాయి. ఒక బ్యాగుకు 41 కిలోలు కాంటా వేస్తున్నారు. అందులోనే 650 గ్రాముల ఖాళీ బస్తా బరువు, 550 గ్రాముల తాలు బరువు కలుపుకొని ఉంటుంది. కానీ అదనంగా కాంటా వేసి రైతులను మోసం చేస్తున్నారు.

తడుస్తున్న ధాన్యం..కల్లాల్లో ధాన్యపు రాసులు పోసుకున్న రైతుల కళ్లల్లో కన్నీరు తాండవిస్తోంది. కొనుగోళ్లలో జరుగుతున్న అసాధారణ జాప్యం వల్ల కేంద్రాల్లో ధాన్యం రాసులు పేరుకుపోయి కనిపిస్తున్నాయి. కోతలు ముగించి పంటంతా కొనుగోలు కేంద్రాలకు చేరుకోగా వాటిని ఎప్పుడు కొంటారా అని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఒకవైపు అకాల వర్షాలు రైతుల గుండెల్లో గుబులును రేకెత్తిస్తున్నాయి.

ఉమ్మడి జోగులాంబ గద్వాల జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత పది రోజుల్లోనే మూడు సార్లు తీవ్రమైన గాలి, దుమారంతో కూడిన వర్షాల వల్ల కల్లాల్లో ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దయింది. ప్రస్తుతము మార్కెట్లో 40 వేల క్వింటాల ధాన్యం నిలువ ఉన్నట్టు సమాచారం, కొన్ని చోట్ల భారీ వర్షానికి ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఇలా వర్షం పాలుకావడం పట్ల అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

# గంగుల అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళనలు

- కోర్ట్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం.. కరీంనగర్‌లో ఉద్రిక్తతలు
- చల్ల హరిశంకర్, పొన్నం అనిల్ గౌడ్ సహా పలువురు నేతల అరెస్టు



**కరీంనగర్ టౌన్, మే 9 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన కరీంనగర్ బంద్ పిలుపు నేపథ్యంలో శనివారం ఉదయం కరీంనగర్ నగరంలో రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పోలీసులు ఆయన నివాసం వద్ద అదుపులోకి తీసుకుని సిటీసీకి తరలించారు. బంద్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఇది పూర్తిగా అక్రమ అరెస్టు అని ఆరోపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అరెస్టు వార్తతో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కసారిగా ఆందోళనకు దిగాయి. జిల్లా కేంద్రంలోని కోర్ట్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు చల్ల హరిశంకర్, పొన్నం అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

నిరసనకారులు బండి సంజయ్ డౌన్ డౌన్, దొంగల రాజ్యం.. దోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేస్తూ ప్రాంతాన్ని మారుమోగించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం బంద్‌కు పిలుపునిస్తే ప్రభుత్వం పోలీసులను అడ్డంగా ఉపయోగించుకుని ప్రతిపక్ష నాయకులను వేధిస్తోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు రాజకీయ కక్షసాధింపుతోనే గంగుల కమలాకర్‌ను అరెస్టు చేయించారని మండిపడ్డారు.

దిష్టిబొమ్మ దహనం సందర్భంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. నిరసన కార్యక్రమం మరింత ఉధృతం కావడంతో చల్ల హరిశంకర్, పొన్నం అనిల్ గౌడ్ సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని సిటీసీకి తరలించారు. దీంతో కోర్ట్ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు దారితీసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోదీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**బీజేపి జిల్లా కో కన్వీనర్ కృష్ణ ముదిరాజ్.**

తాండూరు మే 9(జనంసాక్షి )దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా కో కన్వీనర్ కృష్ణ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు పరేడ్ గ్రౌండ్స్ సికింద్రాబాద్ లో జరగబోయే బహిరంగ సభ లో బిజెపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు మరియు తాండూరు నియోజకవర్గం మరియు వికారాబాద్ జిల్లాకు సంబంధించిన భారతీయ జనతా పార్టీ నేతలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



# అండగా ఉంటా.. ఆదుకుంటా

**అర్సపల్లి షార్ట్ సర్క్యూట్ బాధితులకు అర్బన్ ఎమ్మెల్యే పరామర్శ**

నిజామాబాద్ అర్బన్ మే 09: జనం సాక్షి

ఇందూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బీజేపీ నాయకురాలు మీరా వైచల్ కుటుంబానికి అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని అర్సపల్లి లో గల జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. మీరా వైచల్ పిల్లల విద్యాభ్యాసానికి తన వంతు సహాయం ఉంటుందన్నారు. షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం కూడా వీలైనంత తొందరగా అందేలా చూడాలని ఆర్డిఓ రాజేంద్రప్రసాద్ను ఆదేశించారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ధన్ పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెలవారి నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే తో పాటు కార్పొరేటర్ మఠం పవన్, బీజేపీ నాయకులు గడ్డం రాజు, పవన్ ముందడ, బంటు ప్రవీణ్, మేధరి శేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నిద్ర మత్తు వదలండి

- అధికారులు ప్రైవేటు యజమానిలా మోచేతి నీళ్లు తాగడం ఆపండి
- ప్రైవేట్ స్కూల్ బస్సులపై స్పందించిన ప్రజాసంఘాల నాయకుడు



**గద్వాల నడిగడ్డ, మే 09 (జనంసాక్షి) :** అధికారులకు ప్రైవేటు యాజమాన్యాల మోచేతి నీళ్లు తాగడం అలవాటుగా మారిందనీ, వాళ్ళు ఎప్పుడు నిద్ర మత్తులో జోగుతూనే ఉంటారనీ, ఎన్నిసార్లు ఎన్ని సమస్యలు తెలిసినా వారు ఏమి చేయలేని వారిగా తయారయ్యారనీ తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ అన్నారు. అధికా రులు మేల్కొండి ప్రైవేట్ యాజమాన్యాల చెప్పు చేతుల్లో ఉండొద్దండి మీరు ప్రజల పైసలు తీసుకొని ఉద్యోగాలు చేస్తున్నారనీ, ప్రజలు లేకపోతే మీరు లేరు కనీసం ప్రజలకు వారి జీతాలు తీసుకుంటూ వారికి మేలు చేయలేని వారు మీరు మిమ్మల్ని ప్రజలు క్షమించరనీ, ప్రైవేటు స్కూల్ యజమానులు స్కూల్ బస్సుల ను పెళ్లిళ్లు ,పేరంటాలు, వాణిజ్య అవసరాలకు అద్దెలకి ఇవ్వడం సమంజసం కాదని, ఇది పత్రికల్లో వచ్చిన కానీ అధికారులలో చలనం లేదని అధికారులు నిద్ర మేల్కొండి అని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జిల్లా ఉన్నతాధికా రులు వీటిపై తక్షణమే చర్య తీసుకుని ప్రైవేట్ పాఠశాల యజమానులు తమ స్కూల్ బస్సులను పెళ్లిళ్లకు అద్దెకిస్తున్నారని ఈ విషయాన్ని తెలిసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, జిల్లాలో ప్రజాస్వామ్యం కూని అయిపోయిందని ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రైవేటు స్కూల్ బస్సులను నడిపే యజమాన్యంపై చర్య తీసుకుని బస్సులను సీజ్ చేసి, ఆ స్కూల్ పర్మిషన్ రద్దుచేసి, స్కూళ్ల యజమానుల పై క్రిమినల్ కేసులు పెట్టాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

# నత్త నడక ధాన్యం కొనుగోళ్లు

**ముస్తాబాద్ మే 9( జనం సాక్షి)**అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన కొనుగోలు కేంద్రాల్లో పెరుకపోతున్న ధాన్యం ముస్తాబాద్ మండల కేంద్రంలోని 22 గ్రామాలలో ధాన్యం కొనుగోలు నత్తనడక సాగుతూ ఉండడంతో రైతులలో ఆందోళన నెలకుంది. రెండు వారాలు నుంచి అకాల వర్షాలు ఈదురు గాలులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లారీలు లోడు చేసుకోక రైస్ మిల్ నిర్వాకులు వద్ద లోడ్లను దించుకోక ఇబ్బందులు. తమను ఎవరు పట్టించుకోవడం లేదని అధికారుల నాయకుల తీరుపై మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామాల్లో బెల్టు దందా

- వైన్స్‌ల్లో అంతంతే.. బెల్ట్ షాపుల్లో ఫుల్
- నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు
- షరామామూలుగానే ఎమ్మార్పీ ఉల్లంఘనలు
- కంటి తుడుపుగా అధికారుల తనిఖీలు, చర్యలు





**మొగడంపల్లి,మే 09 (జనంసాక్షి) :** పల్లె అన్న తేడా లేదు. సమయం.. సందర్భం లేదు. బడి.. గుడి ఏదైనా పట్టించుకోరు. ఎమ్మార్పీనా అదేమిటి అంటారు. అడిగినంత ఇస్తాం.. అడ్డు చెప్పేవారెవ్వరు.. అంటూ మండలంలో మద్యం వ్యాపారులు రెచ్చి పోతున్నారు. గ్రామగ్రామాన సందుగొందికి సంబంధం లేకుండా బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేసి, అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో అక్కడక్కడ తాగునీటి సమస్య కనిపించింది కాని.. మద్యం మాత్రం నిరంతరం అందుబాటులో ఉంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలో వైన్స్ షాపుల యాజమాన్యా లు దోపీడీ అధికమైంది.. ఎమ్మార్పీ ధరలకు అమ్మాలని ప్రభుత్వం చెప్తున్నా... వాటినేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. ఊరికి దూరంగా షాపులు ఏర్పాటు చేసుకుని.. అందుబాటు లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించి ..ధరలు పెంచి అమ్ముతుండటంతో మందుబాబులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. సరే కొద్దిదూరమైనా వెళ్లి తాగుదామనుకుంటే.. సదరు బ్రాండ్ లేదని, ఫలానా మాత్రమే ఉన్నాయని చెబుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి.

**విచ్చలవిడిగా బెల్ట్ షాపులు**

మొగుడంపల్లి మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఆయా గ్రామాలలో 5 నుంచి 10 వరకు బెల్టు షాపులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా అన్ని పల్లెల్లోనూ బెల్ట్ దందా జోరుగా సాగు తోంది. వైన్స్ షాపుల యాజమాన్యాలు నిత్యం బెల్టు షాపులకు ఆటోల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు.

ఇక వైన్ షాపుల ధరల కంటే.. బ్రాండ్ ను బట్టి 20 నుంచి 40 రూపాయలు పెంచి అమ్ము తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్ యాజమానులు కూడా ఎమ్మార్పీ ధరల కన్నా అధిక ధర తీసుకుంటూ అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నారు. మండలంలోని వైన్స్ షాపుల యజమానులు సిండికేట్ గా ఏర్పడి ఒకే ధరకు మద్యం అమ్ముతున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు కంటి తుడుపు చర్యగా అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ వెళ్తున్నారా తప్ప చర్యలు మాత్రం శూన్యమని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం అన్నదాత ఆగమాగం

రుద్రంగి మే 9 (జనం సాక్షి) రుగ్రంగి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం వర్షంతో తడిసి ముద్దాయింది. ధాన్యంపై కప్పిన టార్పాలిన్ కవర్లు గాలికి కొట్టుకు పోవడంతో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షంతో తడిసి ముద్దవ్వడంతో అన్నదాత ఆగమాగం కావడం జరిగింది.ఈదురుగాల ధాటికి పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# కలెక్టర్ వర్సెస్ ఎమ్మెల్యే

- కలెక్టర్ లీవ్ పెడితే ఇంచార్జీ ఎవరికిచ్చారు
- ఏసీ రూముల్లో కూర్చుంటే రైతుల కష్టాలు కనిపించవు
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఫైర్
- హమాలీల కొరత, ట్రాన్స్‌పోర్ట్ జాప్యంపై నిలదీత



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 9 (జనంసాక్షి):** కలెక్టర్ లీవ్ పెడితే ఇంచార్జీ ఎవరికిచ్చారు.. రైతులు ధాన్యం కొనాలని రోడ్లు ఏక్కుతున్నారు... వారి బాధ ఎవరికి చెప్పుకోవాలి.కథలు చెప్పొద్దు.. రైతుల కష్టాలు తీర్చండి అంటూ మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావ్ రావ్ ఫైర్ అయ్యారు. శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, సమావేశంలోనే అధికారులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైస్ మిల్లుల వద్ద నిలిచిపోయిన వాహనాలు, హమాలీల కొరత, ట్రాన్స్‌పోర్ట్ సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ “రైతులు రోడ్ల మీదకు వస్తుంటే అధికారులు మాత్రం ఏసీ గదుల్లో కూర్చొని సమీక్షలు చేస్తారా?” అంటూ మండిపడ్డారు.సమావేశం ప్రారంభం నుంచే ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “రైతులకు ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు ఎందుకు ధర్నాలు చేస్తున్నారు? ఎందుకు రోడ్డెక్కుతున్నారు?” అని ప్రశ్నించారు. నాలుగు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల ఆవేదనను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైస్ మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియ ఆలస్యమవుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ “మిల్ పాయింట్ల వద్ద గంటల కొద్దీ ట్రాక్టర్లు, లారీలు నిలిపేస్తున్నారు. రైతులు ఎండలో పడిగాపులు కాస్తున్నారు. ఇది ప్రభుత్వాన్ని చెడ్డపేరు తెచ్చే పని” అన్నారు. హమాలీల కొరత కారణంగా అన్‌లోడింగ్ నెమ్మదిగా జరుగుతోందని అధికారులు చెప్పగా, “అది మీ బాధ్యత కాదా? ముందే ఏర్పాట్లు ఎందుకు చేయలేదు?” అంటూ నిలదీశారు.సమావేశంలో కలెక్టర్ గైర్హాజరు అంశం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. “కలెక్టర్ సెలవులో ఉంటే ఇంచార్జి కలెక్టర్‌ను ఎందుకు నియమించలేదు? ప్రజల సమస్యలు చూసే వ్యవస్థ లేకుండా జిల్లా ఎలా నడుస్తుంది?” అని ప్రశ్నించారు. “కలెక్టర్ ఫోన్ ఎత్తడం లేదు. ప్రజల సమస్యలు వినడానికి కూడా సమయం లేకుంటే ఆ పదవిలో ఎందుకు ఉండాలి?” అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ రైతు పెట్రోల్ బాటిల్‌తో కార్యాలయానికి వచ్చిన ఘటనను ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “రైతు పెట్రోల్ బాటిల్ తీసుకుని రావడం చిన్న విషయం కాదు. రైతు ఎంత మానసిక ఒత్తిడిలో ఉన్నాడో అర్థం చేసుకోండి. రైతుకు ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారు?” అని అధికారులను ప్రశ్నించారు. సమావేశ మందిరంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం రైతు పక్షపాతి అని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, “మా సీఎం రైతుల కోసం 24 గంటలు పనిచేస్తున్నారు. మంత్రులు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. అయినా గ్రౌండ్ లెవెల్‌లో సమస్యలు ఎందుకు తగ్గడం లేదు?” అంటూ ప్రశ్నించారు. “మంత్రి గారి ఇన్‌స్ట్రక్షన్స్ ఎందుకు అమలు కావడం లేదు? ప్రభుత్వం చెప్పేది ఒకటి... ఫీల్డ్‌లో జరుగుతున్నది ఇంకొకటి” అని వ్యాఖ్యానించారు.

“మీరు చేసే డ్యూటీ మీరు చేయాలి... కలెక్టర్ చేసే పని కలెక్టర్ చేయాలి అంటూ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. “మాకు రైతులే ముఖ్యం. ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. అందుకే ప్రజల తరఫున ముక్కుసూటిగా మాట్లాడుతున్నాం” అని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే, “చివరి గింజ వరకు కొనుగోలు జరగాలి. ట్రాన్స్‌పోర్ట్ విషయంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదు. మిల్ పాయింట్ల వద్ద 10 గంటల్లో ధాన్యం ఖాళీ కావాలి” అని ఆదేశించారు. “మాకే ఇలా వ్యవహరిస్తే సాధారణ రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించండి” అంటూ అధికారులను ప్రశ్నించారు. ఏసీ గదుల్లో కూర్చొని నివేదికలు చెప్పడం కాకుండా గ్రామాలకు వెళ్లి రైతుల పరిస్థితి తెలుసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. “ఫీల్డ్ మీద ఉండండి... రైతులతో మాట్లాడండి... సమస్యలు అక్కడే పరిష్కరించండి. రైతు రోడ్డెక్కే పరిస్థితి రావద్దు” అన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ స్పందిస్తూ, రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌కు సమయం పడుతోందని, ట్రాన్స్‌పోర్ట్ సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం అవుతుందని హామీ ఇచ్చారు. అయితే ఎమ్మెల్యే మాత్రం “నాకు కథలు చెప్పొద్దు... రైతులకు న్యాయం జరగాలి” అంటూ తేల్చిచెప్పారు.ఈ సమావేశం లో అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ సివిల్ సప్లై డిఎం జగదీశ్, వ్యవసాయ, డిఆర్డిఏ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



**ముత్తారం మే 09 (జనంసాక్షి) :** ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై గృహాన్ని ప్రారంభించి లబ్దిదారుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఇందిరమ్మ గృహాల పథకం ద్వారా నిరుపేదలకు స్థిర నివాస సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.లబ్ధిదారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అందుతున్న విధానం పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ధర్యాపూర్ గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి,గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్,పి ఏసిఎస్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య,మాజీ జడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు,మాజీ ఎంపిటిసి దొడ్డ గీత రాణి, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు గోవిందుల పద్మ,మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు వాజీద్ పాషా,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాధం శ్రీనివాస్,బిసి సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారస్వామి, యూత్ మండల అధ్యక్షుడు వినీత్,సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్,సర్పంచ్లు మెంగని సమత తిరుపతి,రాపెల్లి రాజయ్య,చిలువేరి జ్యోతి లక్ష్మణ్,చొప్పరి సంపత్,రాజేశం, ఇండ్ల కృష్ణవేణి సదానందం, నాయకులు, నూనెటి కృష్ణ,మండల రమేష్, గోవిందుల ఆనంద్,కొల విజయ్, తాటిపాముల శంకర్, దొంతుల రాకేష్ తోపాటు వార్డు సభ్యులు, వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి





- మౌలిక సదుపాయాలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- అధికారులకు, కాంట్రాక్టర్‌కి ఆదేశాలు
- నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

**సంగారెడ్డి ప్రతినిధి, మే 09(జనం సాక్షి) :** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెం ట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించా రు. మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డితో కలిసి జహీరాబాద్ రెవెన్యు డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటి వరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు.

ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
10 మే 2026

# బీజేపీ దాడికి నిరసనగా బంద్

## బీఆర్ఎస్ పిలుపుతో స్వచ్ఛందంగా మద్దతు



**కరీంనగర్, మే9 (జనంసాక్షి) :** ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఇచ్చిన బంద్ కొనసాగుతోంది. నగరంలోని వ్యాపార, వాణిజ్య సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. బంద్ నేపథ్యంలో రోడ్లపైకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్క అరెస్టు చేసి టీటీసీకి తరలించారు. శనివారం ఉదయం నుంచే గంగుల కమలాకర్ ఇంటి వద్ద మోహరించిన పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ మేయర్ రవీందర్ సింగ్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులను అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బంద్‌లో పాల్గొనేందుకు గంగాధర మండలం బూరుగుపల్లి నుంచి బయల్దేరిన చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన్ను అదుపులోకి తీసుకుని బూరుగుపల్లిలోని నివాసానికి తరలించి హౌస్ అరెస్టు చేశారు. ఇక కరీంనగర్‌లో బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది. నగరంలో వ్యాపార వాణిజ్య సంఘాలు సచ్ఛంధంగా గా బందును పాటిస్తున్నాయి నగరంలోని అనేక ప్రాంతాల్లో వ్యాపార వాణిజ్యాలని మూసి ఉన్నాయి మరోవైపు పోలీసులు రోడ్లపైకి వస్తున్న టిఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులకు కొనసాగిస్తున్నారు.

# ప్రధాని మోడీ ఆత్మీయ పరామర్శ

## 97 ఏళ్ల మఖన్‌లాల్ సర్కార్‌కు పాదాభివందనం



**కోల్‌కతా, మే9 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పశ్చిమ బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వేదికపై 97 ఏళ్ల వృద్ధుడు మాఖన్ లాల్ సర్కార్ పాదాలకు మోదీ నమస్కరించడం చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వేదికపై మాఖన్ లాల్ సర్కార్‌ను సన్మానించి, కౌగలించుకున్న ప్రధాని, అనంతరం ఆయన కాళ్లకు నమస్కరిం చారు. బెంగాల్‌లోని సిలిగురికి చెందిన మాఖన్ లాల్ సర్కార్ బీజేపీ సీనియర్ నాయకుడు. ఆయన భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి సన్నిహితుడిగా మెలిగారు. ఆయనకు సహాయకుడిగా పని చేశారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణానంతరం జరిగిన అంతిమ యాత్రలో కూడా మాఖన్ లాల్ పాల్గొన్నారని బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య తెలిపారు. కాంగ్రెస్ పాలన సమయంలో దేశభక్తి గీతం పాడినందుకు ఢిల్లీ పోలీసులు మాఖన్ లాల్ సర్కార్‌ను అరెస్టు చేసిన సంఘటనను కూడా బీజేపీ నేతలు గుర్తు చేసుకున్నారు. కోర్టులో క్షమాపణ చెప్పడానికి కూడా మాఖన్ లాల్ నిరాకరించారట. కోర్టులో కూడా అదే పాటను మళ్లీ పాడారట. దీంతో న్యాయమూర్తి.. మాఖన్ లాల్ తిరుగుప్రయాణ ఖర్చులకు అవసరమైన వంద రూపాయలు ఇవ్వాలని ఆదేశించారట. బెంగాల్‌లో తొలిసారి బీజేపీ అధికారంలోకి రావడంతో ఆ సీనియర్ నాయకుడికి బీజేపీ నేతలు తగిన గౌరవం కల్పించారు.

# అక్రమ కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటా?

- సంగారెడ్డి జైలునుంచి క్రిశాంక్ విడుదల




**సంగారెడ్డి, మే9 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నందుకే తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుంచి క్రిశాంక్ విడుదలయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గతంలో హైదరాబాద్ ఏటీఎం కాద్ద కాల్పులు జరిపి దొంగలు పారిపోయారని, కరీంనగర్ జ్యువెలరీ షాపులో దొంగలు కాల్పులు జరిపి నగలు ఎత్తుకెళ్లారని అన్నారు. సీపీ సుమతికి అర్థరాత్రి రక్షణ లేకుండా పోయిందని క్రిశాంక్ అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్‌లోనే రక్షణ లేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై కాకుండా శాంతి భద్రతలపై దృష్టి సారించాలని హితవుపలికారు. మీడియా వాళ్లతో కూడా మాట్లాడితే ఎందుకు మాట్లాడా వని అడుగుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఫోన్లు ట్యాపింగ్, వైఫై హ్యాకింగ్ చేస్తుందన్న అనుమానం కలుగుతోందని క్రిశాంక్ పేర్కొన్నారు.

# అన్నదాతల గోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

## కల్వకుర్తి రహదారిపై మాజీమంత్రి లక్ష్మారెడ్డి ఆందోళన



**మహబూబ్ నగర్, మే9 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని రైతులు భయంకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న పంటను గోదాంలకు తరలించాలని డిమాండ్ చేస్తూ రైతులు జడ్చర్ల కల్వకుర్తి జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రైతులకు మద్దతు పలికారు. దాదాపు నలభై రోజులుగా రైతులు ధాన్యం, మొక్కజొన్న అమ్మకాల కోసం మార్కెట్లోనే ఉంటున్నారని పంట పండించడానికి రైతు ఎంత కష్టపడతాడో, అంతకంటే ఎక్కువ అమ్ముకోవడానికి కష్టపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా పాలనలో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. జడ్చర్ల మార్కెట్లో ఉన్న నలభై వేల బస్తాలు వెంటనే గోదాం కు తరలించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పంట ఎంత సాగు చేశారు. దిగుబడి మీద అంచనా లేకపోవడం,గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలు,గోదాం వంటి అంశాలపై ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు.

# హైదరాబాద్‌లో నేడే అరుదైన ఖగోళ వింత..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ వాసులకు నేడు ఒక అద్భుతమైన అనుభవం ఎదురుకానుంది. మధ్యాహ్నం వేళ కాసేపు వస్తువుల నీడలు కనిపించకుండా మాయమైపోయే 'జీరో షాడో డే' ఆవిష్కృతం కానుంది. ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉన్న వారికి, విద్యార్థులకు ఇది ఒక గొప్ప అభ్యాస అవకాశం. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటల 12 నిమిషాలకు ఈ అద్భుతం కనిపించనుంది.

సూర్యుడు సరిగ్గా మన నెత్తిమీదకు వచ్చినప్పుడు (12.12 గంటలకు), సూర్యకిరణాలు భూమికి 90 డిగ్రీల కోణంలో నిలువుగా పడతాయి. ఆ సమయంలో భూమిపై నిటారుగా ఉన్న ఏ వస్తువు నీడ అయినా దాని కిందకే చేరుతుంది. దీనివల్ల నీడ పక్కకు కనిపించకుండా మాయమైనట్లు అనిపిస్తుంది. ఈ వింత కేవలం ఒకటి నుండి రెండు నిమిషాల పాటు మాత్రమే కొనసాగుతుంది. భూమి తన అక్షం మీద వంగి ఉండటం, సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో సూర్యుడు కర్కట రేఖ, మకర రేఖల మధ్య అక్షాంశాల మీదుగా సంచరిస్తున్నట్లు కనిపిస్తుంది. ఈ క్రమంలో ఏడాదికి రెండుసార్లు సూర్యుడు నిర్దిష్ట అక్షాంశాల మీదుగా వెళు తున్నప్పుడు ఆయా ప్రాంతాల్లో జీరో షాడో డే ఏర్పడుతుంది. ట్రాపిక్ జోన్లలో ఉండే నగరాల్లో మాత్రమే ఈ దృశ్యం కనిపిస్తుంది.

# నిత్య జీవితంలో లింగ వివక్షను వీడాలి

- మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' ప్యానెల్ చర్చ
- సమాజంలో మార్పు రావాలన్న వక్తలు



**హైదరాబాద్, మే 9 (జనంసాక్షి) :** సమాజంలో మహిళల పట్ల ప్రదర్శిస్తున్న చిన్నచూపు, నిత్యం ఎదురయ్యే లింగ వివక్ష వారి మానసిక భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా అభిప్రాయ పడ్డారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యా లయంలో ఉన్న 'వీహబ్' వేదికగా స్టాండ్ విత్ హర్ ప్రచారంలో భాగంగా 'ఎవ్రీడే సెక్సిజం అండ్ ఎమోషనల్ సేఫ్టీ' అనే అంశంపై శనివారం ప్యానెల్ చర్చ నిర్వహించారు. వివిధ రంగాల కు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహిళల పట్ల సమాజం ప్రదర్శిస్తున్న వివక్షా పూరిత ధోరణులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ.. నిత్యం మహిళలపై జరిగే చిన్నపాటి ఎగతాళి, అసభ్యకరమైన జోకులు నేరాల్లా అనిపించకపోవడమే అసలైన ప్రమాద మని హెచ్చరించారు. ఇవి సమాజంలో ఒక అలవాటుగా మారిపోవడం వల్ల ఎవరూ ప్రశ్నించడం లేదని, ఫలితంగా మహిళలు తమకు రక్షణ ఉండాల్సిన చోట కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకున్నప్పుడే మహిళలకు గౌరవప్రదమైన వాతావరణం లభిస్తుందని ఆమె స్పష్టం చేశారు. కార్పొరేట్ రంగం నుంచి హాజరైన శైలజ జోశ్యుల మాట్లాడుతూ.. మహిళల ఎంపికలను గౌరవించడం నేర్చుకో వాలని, పాతకాలపు మూసధోరణులకు స్వస్తి పలికినప్పుడే మార్పు సాధ్యమవు తుందన్నారు. అనంతరం సినీ దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ.. మహిళా పాత్రలను సృజించేట ప్పుడు తాను ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తానని, మనమంతా నేర్చుకునే దశలో ఉన్నామని గుర్తించినప్పుడే సమాజంలో మెరుగైన మార్పును చూడగల మని పేర్కొన్నా రు. మహిళలు తమకున్న అంతర్గత శక్తిని గుర్తించాలని చాయ్ బిస్కట్ వ్యవస్థాపకుడు శరత్ చంద్ర కోరారు. ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు జీవితంలో మెరుగైన నిర్ణయాలు తీసుకోగలరని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మసూద్ హుస్సేనీ వివరించారు. ప్రముఖ జర్నలిస్ట్ ప్రేమ మాలిని సమన్వయకర్తగా వ్యవహరించారు. ఏడాది పొడవునా సాగే ఈ 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక సామాజిక అంశం పై అవగాహన కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ వివరాలను ఇన్‌స్టాగ్రామ్‌లోని **@womensafetywing_tg** ఖాతా ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

# మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు

## పంజాబ్ పరిశ్రమల శాఖ మంత్రి సంజీవ్ అరోరా అరెస్ట్



**చండీఘడ్, మే 9 (జనంసాక్షి) :** మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొం టున్న పంజాబ్ పరిశ్రమల శాఖా మంత్రి సంజీవ్ అరోరాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం అరెస్టు చేసింది. మోసపూరిత జీఎస్టీ లావాదేవీలతో రూ.100 కోట్ల నగదు అక్రమ రవాణా జరిగినట్టు ఆరోపణలు రావడంతో దర్యాప్తు ప్రారంభిం చిన ఈడీ తాజాగా మంత్రిని పీఎంఎల్ఏ చట్టం కింద అరెస్టు చేసింది. ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్‌లోని మంత్రి సంజీవ్ అధికారిక నివాసం సహా మొత్తం ఐదు చోట్ల ఈడీ అంతకుముందు సోదాలు నిర్వహిం చింది. మంత్రికి సంబంధించిన వ్యక్తులు, కంపెనీల భవనాల్లో కూడా రెయిడ్స్ నిర్వహించిన అనంతరం మంత్రి సంజీవ్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈడీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంత్రికి సంబంధించిన వారు ఫేక్ కంపెనీల సాయంతో మొబైల్ ఫోన్ కొనుగోళ్ల పేరిట నకిలీ బిల్లులను సృష్టించారు. ఈ బిల్లుల సాయంతో అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, జీఎస్టీ రీఫండ్స్, ఇతర ఎగుమతి ఆధారిత ప్రయోజనాలను క్లెయిమ్ చేసుకున్నారు. ఇలా అక్రమంగా వచ్చిన డబ్బును అక్రమంగా దుబాయ్‌కు పంపించి తిరిగి భారత్‌కు తీసుకొచ్చి మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు అధికారులు ఆరోపిస్తున్నారు. వచ్చే ఏడాదిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రి అరెస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఆప్ నేతలు మాత్రం మంత్రి సంజీవ్ అరెస్టును ఖండిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల సాయంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. ఈ ఈడీ రెయిడ్స్ ఉద్దేశం నల్ల ధనాన్ని వెలికి తీయడమో లేక ఇతర డాక్యుమెంట్స్‌ను వెలుగులోకి తేవడమో కాదు. బీజేపీలో చేరితే ఇవన్నీ పోతాయని రెయిడ్స్ ఎదుర్కొంటున్న వారికి ఒక సంకేతం పంపించడమే అసలు లక్ష్యం' అని పంజాబ్ ముఖ్యమంత్రి భగ్‌వంత్ మాన్ మీడియాతో అన్నారు.

# కాజీపేటలో కోమటిపల్లి రైల్వే సొరంగ మార్గం


- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



**వరంగల్, మే 9 (జనంసాక్షి) :** కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని మూడో లైన్, కోమటిపల్లి భూగర్భ రైల్వే సొరంగ మార్గాన్ని ప్రధాని నరేంద్రమోదీ హైదబాదాద్ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర దక్షిణ భారతానికి ముఖ ద్వారమైన కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలోని కోమటిపల్లి వద్ద రైలు ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ భూగర్భ సొరంగం మార్గం నిర్మించారు. దీంతోపాటు సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట-బలార్షా, కాజీపేట- విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీకి అనుగుణంగా 421 కిలో మీటర్ల మూడో లైన్‌ను ఏర్పాటు చేశారు. గ్రాంట్ ట్రంక్ రూట్‌లో ఢిల్లీ-సికింద్రాబాద్, విజయవాడ సెక్షన్‌లో రైళ్ల రద్దీని తగ్గించేందుకు రైల్వేశాఖ దాదాపు 12 ఏళ్ల కాలంలో దాదాపు రూ.4015 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసింది. ఈ రెండు ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని రైల్వే అధికారులు వెల్లడించారు.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ చొరవ

- మస్కట్ నుంచి సొంతూరుకు చేరిన మహిళ



**అన్నమయ్య, మే9 (జనంసాక్షి) :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో ఏపీకి చెందిన మహిళ మస్కట్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలానికి చెందిన షెహనాజ్ కుటుంబ జీవనం కోసం ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లి చిత్ర హింసలకు గురైంది. తనకు జీతం ఇవ్వడం లేదని, వేధింపులకు గురిచేస్తున్నారంటూ భర్తకు వీడియో కాల్ చేసి చెప్పింది. తనను రక్షిచాలంటూ డిప్యూటీ సీఎం పవన్‌ను వేడుకుంది. షెహనాజ్ బాధలు విన్న వెంటనే డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. మహిళను స్వగ్రామానికి రప్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ అధికారులకు ఆదేశించారు. ఎట్టకేలకు ఉప ముఖ్యమంత్రి చొరవతో షెహనాజ్ స్వగ్రామానికి చేరుకుంది. కేవలం ఐదు రోజుల్లోనే మస్కట్ నుంచి మహిళను స్వగ్రామానికి డిప్యూటీ సీఎం పేషీ అధికారులు చేర్చారు. మస్కట్ నుంచి ముంబైకి అటు నుంచి విజయవాడకు వాల్మీకిపురం మహిళ షెహనాజ్ చేరుకుంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పేషీ అధికారులు.. మహిళకి రూ 30,000 నగదు, చీర బహూ కరించి సురక్షితంగా స్వగ్రామానికి పంపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి షెహనాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. తనను సమస్యల నుంచి రక్షించి స్వగ్రామం చేర్చడంతో పాటు ఆర్థిక సహాయం అందించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపింది.

# కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారు

- బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారని, బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని గాయత్రి గార్డెన్‌లో మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడారు. భారతదేశాన్ని అస్థిరపరచాలని చూసిన శక్తులను తొక్కి పడేసి అఖండ భారతను సురక్షితంగా ఉంచుతామని మాట ఇచ్చి.. సాధించిన విజయంతో మోడీ తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. బీజేపీ తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని ప్రజలు అనుకుంటున్నారని, బీఆర్ఎస్ వద్దనుకొని కాంగ్రెస్ కి ఓటు వేస్తే రెండేళ్లలోనే తేలిపోయిందని, తెలంగాణ అప్పుల ఊబిలో కోరుకుపోకుండా ఉండాలంటే, నియంతృత్వ పోకడలు పోవాలంటే, అభివృద్ధి చెందాలంటే బీజేపీనే అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో ఉందని, నేడు మోదీ మీటింగ్‌కు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, కంటోన్మెంట్ లో 16 వేల ఓట్లతో ఎమ్మెల్యే ఓడిపోయినా మోదీ గారి ప్రభావం వల్ల ఎంపీ ఎన్నికల్లో 25 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందని, కార్యకర్తలు, నాయకులు ప్రజల వెంట ఉండి బహిరంగ సభకు రావాలని, మల్కాజిగిరి పార్లమెంట్ నుండి లక్ష మంది హాజరుకానున్నారని తెలిపారు. ఎండకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసామని, తాము వెయ్యి బస్సులు పంపిస్తున్నామని, వ్యక్తులుగా ఎవరు ఏం మాట్లాడినా.. మా బీజేపీ సంస్కారవంతమైన పార్టీ. దాడులు చేయడం తిట్టడం మా సంస్కృతి కాదని తెలిపారు.



# ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్-పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడెబల్లూర్-మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరపున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# క్లాస్‌లో డెమో ఇస్తూ కుప్పకూలిన టీచర్

- గుండెపోటుతో మృతి చెందినట్లు గుర్తింపు



**ఖమ్మం, మే9 (జనంసాక్షి) :** జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. క్లాస్ రూమ్ లో డెమో ఇస్తూ గుండెపోటుతో కుప్పకూలాడు ఓ ఉపాధ్యాయుడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా మధిరలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. జిల్లాలోని మధిర పట్టణం రెండోవార్డు ఎంఎ÷-లాయిస్ కాలనీకి చెందిన ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గారపాటి జయరాజ్ ఖమ్మంలోని మమతా రోడ్ లో ఉన్న శ్రీ చైతన్య ఒలంపియాడ్ స్కూల్ లో వర్క్ షాప్ కి హాజరయ్యాడు. వర్క్ షాప్ లో భాగంగా క్లాస్ రూమ్ లో డెమో ఇస్తుండగా గుండెపోటుతో కుప్పకూలాడు జయరాజ్. డెమో ఇస్తున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అతనిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు సహ ఉపాధ్యాయులు. అయితే.. అప్పటికే జయరాజ్ మరణించినట్లు తెలిపారు డాక్టర్లు. జయరాజ్ డెమో ఇస్తూ కుప్పకూలిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. జయరాజ్ మరణంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. అప్పటిదాకా హుషారుగా పాఠం చెబుతున్న జయరాజ్ ఒక్కసారిగా కుప్పకూలడం జీర్ణించుకోలేక పోతున్నామని అంటున్నారు తోటి ఉపాధ్యాయులు. ఈ ఘటనతో మధిర పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# చంద్రబాబు, పవన్ నివాసాలకు మోడీ

**హైదరాబాద్, మే9 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా నగరంలోని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసాలకు ప్రధాని వెళ్లే అవకాశముంది. ఇప్పటికే చంద్రబాబు, పవన్ నివాస మార్గాల్లో భద్రతా సిబ్బంది ప్రధాని కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించారు. పవన్ కళ్యాణం ముక్కు సర్జరీతో రెస్ట్ తీసుకుంటున్నారు. చంద్రబాబు శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారి ప్రమాణానికి కూడా హాజరయ్యారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370